

జ్ఞాన యోగం
విచారణ
శాశ్వత పరిపోషణ



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120001441

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శాశ్వత పరిపోషణ

రచయిత

డాక్టరు జె. సి. కుమారప్ప

అనువాదకులు

తత్వానందస్వామి

ది ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీ, (రిజిష్టర్డు)

తెనాలి :: మద్రాసు :: సికింద్రాబాదు

 1949 [వెల రు. 1—8—0

విషయసూచిక

౧ వ భాగము

౨ వ భాగము

నరుడు — వ్యష్టిరూపము

శాశ్వత పరిపోషణ

౧వ భాగము

అధ్యాయము 1

ప్రకృతి

ప్రకృతి:—ప్రకృతిలో కొన్ని వస్తువులు ప్రాణము లేనివిగ కాన్పించునవి కలవు. అవి పెరుగవు, ఎదుగవు; కాని తరిగిపోవును, వాడుకచేత అరిగిపోవును. నేలబొగ్గు, రాతినూనె, ముతకలోహము, ఇనుము, రాగి, బంగారము మున్నగు పదార్థముల రాశి లేక నిధి కొంత ప్రపంచమున గలదు. ఇవి పరిమితమగు మొత్తములుగా లభించుచుండుటవలన వీనిని 'అశాశ్వతము' లని పేర్కొనుచున్నాము. ఒక నదిలో వెల్లువలైపాఱు ప్రవాహ జలమునుగాని, అడవిలో నిరంతరము పెరుగుచుండు కలపనుగాని, 'శాశ్వత' మందుము. ఆ వెల్లువను, ఆ పెరుగుదలను మాత్రము వినియోగించుకొనునప్పుడు వానిరాశి నరుని ప్రయోజనమునందు అక్షయముగనుండును గాన వానిని 'శాశ్వత' మందుము.

చేతనముల విషయములో ప్రకృతియొక్క శాశ్వతత్వ రహస్యము జీవచక్రమునందు గోచరించుచున్నది. జీవితమును నిరంతరముగ సాగించుటకై ఆజీవచక్రముయొక్క వివిధాంశములు సన్నిహితములై సహకరించుచుండును. గోధుమగింజ యొకటి తల్లి మొక్కనుండి నేల

రాలి మట్టిలో పూడుకొనును. నేలలోనికి వేళ్ళను చొప్పించును. అందుండి యావేళ్ళద్వారమున, తేమయొక్కయు, సూర్యుని వేడిమి యొక్కయు సాహాయ్యముతో పోషకద్రవ్యములను పీల్చుకొనును. ఈచర్యమూలమున అదొక మొక్కగా వికాసముపొందును. ఆ మొక్క ఆకులు వేయును. దానివేళ్లు నేలనుండి ఆహారము తీసికొనుటకు తోడ్పడినరీతినే, దాని ఆకులు గాలినుండియు, వెలుతురునుండియు ఆహారమును ప్రోగుచేసికొనుటలో తోడ్పడుచుండును. ఆ ఆకులలో కొన్ని 'చచ్చి' నేలరాలును. నేల, గాలి, వెలుగులనుండి తల్లి మొక్క పూర్వము తీసికొనియున్న ఆయా మూలద్రవ్యములుగా ఈ యాకులు చీలిపోవును. అనగా విచ్చిపోవును. రాబోవు తరపు మొక్కల కివి పోషకద్రవ్యములుగా మఱల వినియోగపడగలవు. తేనెటీగలు మొదలగునవి ఈ మొక్కలనుండి తమ యాహారము కొఱకై పూదేనెను పుప్పొడిని ప్రోవుచేసికొనునప్పుడు వాని పూవులందు చూలుకల్పనముచేయగా గింజ లేర్పడును. మఱల రాబోవు తరపు మొక్కల కీ గింజలు జీవాధారములు కాగల్గును. ఈ గింజలు పండి నేల రాలును. లోగడ తరపు మొక్కలనుండి రాలిన యాకుల వలన సారవంతముగ చేయబడియున్న నేలయొక్క ఆధారముతో ఆ గింజలు మొలకలెత్తుచుండును. ఈరీతిగా మఱొక జీవచక్రమేర్పడుచున్నది. ఈవిధమున ప్రకృతిలో జీవచర్యసాగిపోవుచుండును. ఈ జీవచర్యలో తెంపు లేనంత కాలము ప్రకృతిలోని జీవచక్రము సాగిపోవుచు ఆ ప్రకృతిని శాశ్వతము గావించుచుండును.

అధ్యాయము 2

ప్రకృతిలోని శ్రమవిధానము - జీవితాలు

ఈ జీవచక్రమునకు పూర్ణతగూర్చుటకై సహకరించు ఆ యా చేతనాఽచేతనముల ప్రయత్నమే ప్రకృతిలోని 'శ్రమ' అనం దగును. ఏకాలమందుగాని, ఏదశయందుగాని, తెలిసియో తెలియకనో ఈ చక్రమునకు భంగపాటు గల్గించునెడల, ఆ భంగపాటునకు ఫలితార్థముగా హింస సంభవించును. ఇట్లు హింస సంభవించునప్పుడు వృద్ధి, లేక పురోగమనము ఆగిపోవును. తుదకు నిరర్థకత, నాశనము వాటిల్లును. దోషములను ప్రకృతి మన్నించదు. దాక్షిణ్యము చూపబోదు. జీవచక్రముజోలికి పోకుండ, దానిని సంకుచితపఱుప యత్నించకుండ, దాని శాశ్వతత్వమును పరిపోషింప గోరువార మగునెడల, మనము స్వీయక్షేమముకొఱకును, స్వీయరక్షణము కొఱకును గూడ సంపూర్ణముగా అహింసాపరులమై యుండుటయు, ప్రకృతివిధానములతో సహకరించుటయు, వానికి వశవర్తులమై మెలగుటయు అత్యావసరమగును.

చేతనములు సహితము తమ బ్రతుకును నిలుపుకొనగోరుచో తదితరములతోపాటు చేరి, తమతమ క్షేత్రములలో క్రమప్రకారము

---

* సేంద్రియపు ఎరువులకు మారుగా రసాయనపు ఎరువులు వాడునప్పుడు కొంతకాలము హెచ్చుపంటయే లభించును. కాని వీనిని తఱచుగా వాడుచో రసాయనికద్రవ్యములను దిని బ్రతుకలేని యెఱ్ఱలు వినాశము నందును. ఎఱ్ఱలదృశ్యమగుటోడనే నేల బరువెక్కి, తుదకు సారమును కోల్పోవును. పశువుల దొడ్ల యెఱువులను ఆకుచెత్త యెరువులను పరిత్యజించి వేయుటవలన, ప్రకృతి చక్రము భగ్నముకాగా, శాశ్వతపరిపోషణ తొలగిపోయి, మానవకృతమైన అశాశ్వతపు ఆర్థికదశ ప్రాప్తించినది.

శ్రమ చేయవలసియే యుండును. ఎఱ్ఱలు నేలలో తిరుగుట మూల మున మట్టిని గుల్లబారునటుల చేసి, గాలిని, నీరును భూమి పీల్చు కొనుటలో సాయపడును. శాకపదార్థములతో కూడిన మట్టిని తిని ఆయాపదార్థముల నవి తమకడుపులో చక్కగ మిశ్రము చేయు చున్నవి; బాగుగ సిద్ధముజేసి సారవంతము గావించిన యెఱువును రెట్టలరూపమున బయటికి విడుచుచున్నవి. ఆ రెట్టలనుండి మొక్కలు తమ యాహారమును తేలికగా గ్రహింపగల్గుచున్నవి. తేనెటీగలు సీతాకోకపురుగులు చెట్ల పూలకు చూలు కల్పన చేయు సహకారవిధా నమునకు సదృశమగు విధానము స్థావరజంగమజీవులకును, నేలకును మధ్య జరుగు సహకారవిధానమునందుగూడ ప్రస్ఫుటముగ గోచ రించుచున్నది.

ఆతీరు శ్రమను లేక సేవను చేసినందుకు ప్రతిఫలముగా, అటుల శ్రమచేయు వ్యక్తికి ఆహారము దొరకుచుండును. నేల, నీరు, గాలి యందుండు చేతనాచేతనరూపములగు లెక్కకుమీరిన వ్యక్తులమధ్య ఘటిల్లు సహకారమువలనను, అనుబంధచర్యవలనను తానుపొందు ఉపకారములకెల్ల ప్రతిఫలముగా న్యాయమగు 'కూలిని' ప్రకృతి ఒసగుచునే యుండును.

వృక్షజాతిజీవులు స్థలాంతరములకు కదలవు; కాన స్థావరము లన బడును. వాని బీజములు తల్లిమొక్కకు, లేక చెట్టునకుదాపుగా దానిక్రిందనే రాలును. అన్నిగింజలు తల్లిచెట్టు చుట్టును పడి, మొల కెత్తునెడల, అవి పొదగాపెరిగి గుబురగుగాన వానికి ఊపిరియాడదు. కావున దూరముగా విశాలప్రదేశమున వెదజల్లబడుట యవసర మగును. అందుకొఱకు పక్షులు, పశువులు మొదలగువాని సేవలను ప్రకృతి సమకూర్చుకొనుచున్నది. ఈసందర్భమున జంగమములగు జంతువులు ప్రత్యేకముగ నుపకరించును. పక్షులు మొక్కల గింజ

లను తిని యొక్కొక్కప్పుడు మైళ్ళకొలది దూరముపోయి తమరెట్టలతో ఆగింజల నచ్చట పడవేయును. అవియు నిటుల సహకార కార్యములు చేయుట తమబ్రతుకుకొఱకేగాని, కేవలము పరోపకారార్థమనికాదు. పక్షులు తమయాకలిదీర్చుకొను కొఱకే గింజల తినును. ఇటులనవి తమజీవన ప్రధానకార్యముల నిర్వహించుకొనుచు, ప్రకృతి జీవనచక్రములో తమవంతుపని నవి నెరవేర్చుచుండును.

ఈవిధముగా జంగమములు స్థావరములకును, చేతనములచేతనములకును తోడ్పడుచు, ఆయావర్గములు తమ ప్రయోజనములను తాము నిర్వర్తించుకొనుచుండును; మఱియు నితరవర్గములతోడను సహకరించుచుండును. తన్మూలమున ప్రకృతి తనయందుండు సకల వర్గముల సహకారమును సమకూర్చుకొనుచు దృఢపఱచుకొనుచునుండును. ఇటుల సమష్టిప్రయోజన నిర్వహణముకొఱకై, ప్రకృతియంతయు సంఘటితమై పఱగుచున్నది. ఇందేదియు తనకొఱకే వేఱై మనుటలేదు. ఈ కార్యనిర్వహణమంతయు సవ్యముగా జరిగిపోవునెడల హింసజొరబడి, ఆకార్యపరంపరను భగ్నము చేయనిచో, శాశ్వతపరిపోషణము చేకూరకలదు.


అధ్యాయము 3

ప్రకృతిలోని పరిపోషణరీతులు

వివిధమూలవర్గముల మధ్యబఱగు ఈ సంపూర్ణమా అహింసాయుత సహకారము సమస్తజీవస్వరూపములందును సదా వెలయుటలేదు. పంచభూతములనుండియు, అచేతనవస్తువులనుండియు తమయాహారముల సంపాదించుకొనుచు, ఆయా ప్రకృతి యవస్థాంతర

ముల గడచిపోవుటకు మారుగా కొన్ని మూలవర్గములు తోడిజీవుల చంపుకొని తినుట నవలంబించి సుదీర్ఘమౌ ప్రకృతి చక్రమార్గమును సంకుచితపఱచి వేయ జూచుచున్నవి.

1. పరాన్న పరిపోషణ :—కొన్ని మొక్కలు ఇతరముల భక్షించి జీవింపుచు పరాన్న భుక్కు లగుచున్నవి. కొన్ని మొక్కలు లేక చెట్లు తమ వేళ్ళద్వారమున నేలనుండి ఆహారము దీసికొనునట్లు వానిపైనిలిచి జీవించు బదనికలు త్రోవలోనే ఆ ఆహారమును దొంగిలించుకొనుటచేత నది మొదటివాని అవయవము లన్నింటికి సరిగా చేరజాలకుండును. ఆ కారణముచేత ఆతిథ్యమొసగు మొక్కలును, చెట్లును తిండి చాలక చచ్చుటయు తటస్థించును. ఈ విధముగ హింసయు, మరణమును ఘటిల్లుచుండును. జంతువులందు గొఱ్ఱెలు గడ్డితిని, నీరు ద్రావి హింసారహితముగా జీవించును. పెద్దపులి గొఱ్ఱెపైబడి దానిని చంపితిని దాని నెత్తుటిని ద్రావి ప్రకృతి మార్గమును సంకుచితపఱచుచుండును. తత్కారణముగా హింస ఘటిల్లచేయు పులి తన బ్రతుకు నంతటికిని హింసనే ఆధారముచేసికొనుచున్నది. ఈ విధముగా హింసావృత్తి పెద్దపులి జీవితములో నొక ప్రధానాంశమగుచున్నది. పాముల జంపుకొని తిను గ్రద్దలు నిట్టి క్రూర జీవులే. ఆ గ్రద్దలు, డేగలు నీ విధముగా పాములను, ఎలుకలను చంపి తిని జీవించుట బట్టి పరాన్న పరిపోషణమే వీనికి జీవనాధార మందురు.



2. స్తేయ పరిపోషణము :—ప్రకృతిలో నొక వర్గము వేరొక వర్గమునకు సమమగు ప్రతిఫలమును సమకూర్చి పెట్టకుండ, స్వలాభమునే

చూచుకొనునెడల, అట్టి వర్గము స్తేయవర్గ మనబడును. కోతులు మామిడితోపులో జొరబడి ఆ చెట్ల పండ్లను పుణికి మెక్కును. అవి ఆతోపుయొక్క క్షేమమునకై నేలను త్రవ్వికాని, మొక్కల నాటిగాని, చెట్లకు నీళ్ళుపోసిగాని, యేలాటి యుపకారమును చేకూర్చునవి కావు. ఆ కోతుల పనులన్నియు స్వార్థపరమైనవే గాని, పరప్రయోజనకరములు గావు. వీనిపరిపోషణావైఖరి, యిది వరకు మనము చెప్పుకొనినవాని వైఖరికంటె తక్కువ హింసాకరమైనది కానోపును. ఐననేమి? వినాశకరమైనదే యగును.




ధాన్యపు కంకులను తిని బ్రతుకు పిట్టలు కృషికర్మయందు సహకరించునవి కావు.

3. సాహసపరిపోషణము:— కొన్ని జీవులు తామేవర్గములనుండి యుపకారమును పొందునో, ఆ వర్గమునకు స్పష్టముగ కొంతసేవ సలుపుచుండును. ఉత్పత్తియందు తాముపకరించిన వానినుండి కొంత స్వీకరించును. తేనెటీగల విషయములో అవి యేపూలనుండి మకరందమును, పుష్పరజమును ప్రోవుచేసికొనునో, ఆ పూలకు చూలు కల్పన చేయుచుండును. మకరందమును తేనెగా మార్చును. తమయందుద్భవించు ద్రవవిశేషములతో తయారుచేసిన మైనమును నుపయోగించి తేనెపట్టును నిర్మాణము చేయును. తాముత్పత్తిచేసిన తేనెను ఆపట్టులో చేర్చిపెట్టి దానినుండి కొంత తాము తీసికొనును.

కావున తేనెటీగలు పరాన్నభుక్కులు కావు. అవేవర్గమునుండి యుపకారమును పడయునో, వానిని చంపివేయుటకు మారుగా

వానికి సాహాయ్యము చేయుచున్నవి. అవి స్తేయవర్గమునను చేరవు. ఏమన, సరకు ఉత్పత్తిచేయుట యందలి తమవంతు పనిని నిర్వహించుచున్నవి. తమ సాహసకృత్యము నైజప్రేరణాయే యైనను, అవి తమ కృషివలన ఉపకారము చేయుచు నుపకారమును పొందుచున్నవి. ఇవి నిర్మాణాత్మక ప్రవృత్తివర్గమునకు చెందునవై యున్నవి.

4. సమూహ పరిపోషణము :— ఈ సందర్భముగా తేనెటీగలు తమ తమ వ్యక్తిప్రయోజనముల కొరకై పాటుపడునవి కావనియు అవి తమ పట్టులోనివసించు తేనెటీగమాత్రములన్నింటి లాభముకొఱకై, పాటుపడుననియు చెప్పవగును. స్వీయ ప్రయోజనమును దాటిన సమష్టి ప్రయోజనమునకును, తాత్కాలిక ప్రయోజనమును మించిన భవిష్యత్ప్రయోజనము నిమిత్తమగు ప్రేరణకును నిదర్శన మిందు కానవగును.



ఒక తేనెటీగ తనపట్టులో నివసించు వాని యన్నింటి కొరకును ఆహారమును ప్రోగుచేయు చున్నది.

5. సేవా పరిపోషణము :— ప్రకృతిలోగానవగు పరిపోషణ విధానములలో శ్రేష్ఠతమమగునది సేవాపరిపోషణము. సంతానమునకును, జనకులకును మధ్యనుండు ప్రేమసంబంధమున నిది సుస్పష్టముగ గోచరించును. తల్లిపిట్ట తనకూనలకు తిండిని సంపాదించుటకై అడవినంతను వెదకులాడును. తన సంతానమును శత్రువులనుండి కాపాడుటలో తన ప్రాణము నొడ్డును. ఆ తల్లిపిట్ట తనయొక్క తాత్కాలికమగు అవసరము కొరకుగాని, తన భవిష్యత్ప్రయోజ

నము కొరకుగాని పాటుపడుట లేదు. ప్రతిఫలచింత యిసుమంతయు నపేక్షించకుండ రాబోవుతరమునకు చెందు పక్షులకొరకో, లేక తరములకు చెందు పక్షులకొఱకో అది తన కార్యముల నుద్యమించుచున్నది. అది తన మాతృప్రేమ కారణముగా, స్వీయమగు లాభాపేక్షతోగాక, నిష్కామముగా ప్రవర్తిలుచున్నది. దాని చర్య అహింసాపరమగు శాశ్వతపరిపోషణమునకు దరిదాపుగా వచ్చుచున్న దవ నగును.

శాశ్వతత్వమును, అహింసాపరతను అధికాధికముగా నిరూపించుటకై యీ విస్పష్ట సాదృశ్యములను ఈ అధ్యాయమునందు ఉదాహరించితిమి. ఈ యైదు గ్రాహ్యవిధానము లం దిమిడియున్న రకములనుండి, యితరములను పేర్చి కూర్చుటచేతను, వాని వరుస క్రమమును తేల్చుటచేతను, ఎన్నియో దృష్టాంతముల నిరూపించుకో దగును.

2వ భాగము

నరుడు - వ్యష్టిరూపము

అధ్యాయము 4

నరుడు - స్వేచ్ఛ

ఈ మన విచారణనిమిత్తము, ప్రకృతిలోని యితర వర్గములను పాలించు జీవనపరిపోషణరీతుల నింకను విమర్శన చేయు నవసర ముండదు. జంతుకోటిలోని 'నరు' డనంబడు జీవియొక్క బ్రతుకు తెన్నును మాత్రము పరిశీలించినం జాలును. ప్రకృతి చర్యల క్రమ గతిని పోషించుటకును, లేక భగ్నపఱచుటకును నరునకు సమర్థత గలదు. వాని జోక్యమువలన ప్రకృతియందు సంభవించు తబ్బిబ్బులు శాశ్వతములు కాకపోయినను, నరుని ఎదిరించి నిలిచి తుదిని విజ యము గాంచగల సామర్థ్యము ప్రకృతికున్నను, ఒక్కొక్కప్పుడు దాని సరళగతిని సంక్షోభపరచి, ఇటీవలి ప్రపంచయుద్ధమును బోలు అవాంతరములను కల్పించుచుండును. లోతుకుదిగి పరిశీలించునెడల ప్రకృతియొక్క అనుదినచర్యలో చాలవఱకు సంతుష్టికరముగా సహాకరించుటకు వీలగు మార్గములను, వసతులను మనము కనిపట్ట గలుగుదుము. శాశ్వతపరిపోషణరీతి నొకదానిని పూర్తిగ సాధింప జాలకున్నను, అట్టి దానికొఱకై బుద్ధిపూర్వకముగా పాటుపడుట వలన, అనవసరమగు హింసను నివారింపగలము; మఱియు వీలగు నంత హెచ్చుసౌఖ్యమును సమకూర్చుకొనుటకు శక్తిగల వార మగుదము.

తక్కిన జంతువు లన్నియు, కొంచెము హెచ్చుతగ్గుగా, ప్రకృతి శాసనమును అనుసరించియే వర్తించును. తమ "స్వేచ్ఛ" ననుసరించి

వర్తించుట కంతగావాని కవకాశములు లేవు. వానికి ప్రకృతివిధానమును తెలుపు 'నైజ'మనునది కలదు. అవి దాని ఆదేశము ననువర్తించును. జీవితమున వానిమార్గము రైలుపట్టాల త్రోవనుబోలియుండును. నైజము ఆజంతువులను నడపుతీరున రైలుపట్టాలు బండ్లు పోవలయు దిశను గతిని నిర్ణయించి నడుపుచుండును. ఏ అవాంతరము సంభవించకుండునెడల, ఆబండ్లు కదలుచుండు నంతకాలమును, మఱల వాని నిటునటు త్రిప్పు నవసరములేకుండనే, సముద్ర ప్రదేశమునను, అడవులగుండను, గుట్టలమీదుగను, లోయలలోను, రేయనక పగలనక, పోయిపోయి ఆరైలు గమ్యస్థానమును చేరగల్గును.

కోడిపిల్ల గ్రుడ్డును పగుల్చుకొని వెలువడిన తత్క్షణము, మేతకై దేవులాడుచు నిటునటు పరుగులుపెట్టి, తనపోషణ కనువగునట్టి నలుసుల నేరుకొని తినును. ఆకలితీరినప్పుడది, తనకు వెచ్చగానుండు నిమిత్తము తల్లి రెక్కలక్రింద దూరి విశ్రమించును. రానున్న అపాయమును ముందుగనే నైజముచే తెలిసి, వెంటనే సురక్షిత తలమునకు పారిపోవును. రుచిగానున్న కారణమున హెచ్చుగా తినదు; ఇంద్రియవాంఛలను తృప్తిపఱచు బుద్ధితో సుఖములకొఱకై దేవులాడదు. దాని జీవితచర్యయంతయు నైజప్రవృత్తి ననుసరించి నడచునేగాని, బుద్ధిపూర్వకమగు ధర్మాతిక్రమణ ముండదు.

ప్రకృతికి అనుసరణముగా బ్రతుకు జంతువులు జబ్బుపడుట చాల అరుదు. ఒకవేళ నెప్పుడైన వాని జీర్ణకోశము చెడునెడల, స్వభావముచేతనే తెలిసికొని అవి యేఆకులలమునో తినును, అంతట వాంతియో, భేదియో గలిగి అంతయు చక్కబడును

మనుష్యుని విషయముననో అతనికి 'స్వేచ్ఛా' వృత్తియు, దాని వినియోగమున కగు విశాల క్షేత్రమును కలవు. కావున నెన్నియో

చిక్కులు గలుగుచుండును. విశిష్టమగు ఆ 'వరము' నతడు సవ్యమార్గమున వినియోగము చేసికొనునెడల, తక్కినజీవులకన్న హెచ్చుగా, ప్రకృతిలోని వివిధవర్గములమధ్య పఱగు సామరస్య సహకారములను, అతడు బుద్ధిపూర్వకముగ పెంపొందింపగలడు. అందుకు భిన్నముగా, నతడాప్రజ్ఞను అపసవ్యమార్గమున వినియోగించెనా, ప్రకృతి పరిపోషణమును మిక్కిలిగ సంక్షోభపఱచి, తుదిని తనకును నాశము చేకూర్చుకొనును.

'నైజప్రవృత్తి' రైలురోడ్డుతో పోల్చబడినది. అది రైలు బండ్లను పొరబడకుండ నడుపుచు, వానికై నిర్ణయింపబడిన గతి నుండి, లేక త్రోవనుండి తొలగి పోనీయదు. ఇందుకు భిన్నముగా 'స్వేచ్ఛ' యను వరము నడకయందు స్వాతంత్ర్యము నంగీకరించు చున్నది. కాని నడక యంతయు నిరపాయమై సాగదు. అది బైసికిలు నెక్కుట వంటిది. సిద్ధాంతరీత్యా బైసికిలుమీద స్వారి చేయువాడు తన యిచ్ఛవచ్చుచోటికి పోవచ్చును. త్రోవచూపు చక్రము, దాని దండము, స్వారిచేయువాని స్వాధీనముననే యుండును. అట్లయ్యును వాని సంచారము ఆ యంత్రముయొక్క పరిమితుల (Limitations) ననుసరించియు, వాని విచక్షణ ననుసరించియు మాత్రమే సాగగలదు. అతడు గాలిలో నెగురజాలడు; నీటిపై తేలజాలడు. నేలమీదనుగూడ ఎచ్చటికి బట్టిన నచ్చటికి పోవ వీలుండదు. అతడు అలవాటుపడినత్రోవనో, రోడ్డునో అంటిపె పట్టుకొని యుండవలసియుండును. దుక్కి దున్నినచేను కడ్డముగా నతడు స్వారిచేయ ప్రయత్నించునెడల ముందుచక్రము నేలలో కూరుకొనిపోయి అతడు ముందుకు బోర్లపడవలసివచ్చును. అతడు ముండ్లపొదలమీదుగా పోజూచునా, రబ్బరుగొట్టము చిల్లులుపడి పోవును. ఈ తీరుగా చూచుచో, ఊహామాత్రమగు 'స్వేచ్ఛ' కు

పరిమితులు గలవనియు, వివేకముతో స్వారిచేయునతడు దానిహద్దులలో నుండవలసినవాడేననియు తెలియగలడు. ఈ తీరుగా నతడు తన సంచారమును వివేకముతో సాగించుకొను క్రియాశిక్షణమును, విజ్ఞానమును పొందవలసి యుండును. అవి కొఱవడునెడల వాని కుపకారము చేయుట కేర్పడిన యంత్రము, అపకారము చేకూర్చునదగును. కాని పరిచయమైన రోడ్డుమీద, పగటిపూట స్వారిచేయునతడు, కాలినడకను పోవువానికంటె ఎన్నిరెట్లు వేగముతోడనో పయనించగల్గును.

సముచితక్షేత్రమున, తన 'స్వేచ్ఛ'ను సక్రమవిధాన వినియోగము చేయుటకు శిక్షణబడసి, తన వాంఛలును తన యింద్రియములును ప్రేరేచినట్లెల్ల తన యూహాపోహాలను పరుగులువెట్టనీయక విచక్షణతో వర్తించునేని, కేవలము 'నైజప్రవృత్తి' పై నాధారపడి బ్రతుకు జీవులకంటె నరు డెన్ని మడుంగులో ఘనతరకార్యముల సాధింపజాలును. అతడు తన యిచ్ఛానుసారము తన యభ్యుదయమును తాను నిర్ణయించుకో గలడు. తనలోని నిత్యతేజో ప్రభావమును, అనగా దివ్యప్రభతో గూడిన తన సహజజ్ఞానమును అనుసరించుటవలన విజయము వైపునకుగాని, లేక వినాశమువైపునకుగాని పోగలడు. అట్టుల బుద్ధిపూర్వకముగా నరుడు తనగతికి తాను కర్త కాగలడు. చీకటిలోగాని, మెరకపల్లపు ప్రదేశముమీదగాని బైసికిలునెక్కి స్వారిచేయుచు వడిగ పోవువానిపోలిక, నతడు ఆవర్ధముం పాలును. కానగును. మఱియు తన అంతరాత్మకును, ప్రకృతికిని విరుద్ధముగా నడిచి పాపకారియగుటవలన తగిన శిక్షను బడయవలసినవాడును కానగును. ప్రకృతి విశ్వాసపాత్రమైనది; తనను గౌరవించువారియెడ నది విధేయమై వర్తించును. కాని తమ 'స్వేచ్ఛా'ను సారము వర్తించుచు, ప్రకృతియవసరముల నిర్లక్ష్యము చేయు

టకే తలపడుదు రేని, అట్టి వారియొక ధర్మదేవతను మించిన నిష్ఠురత వహించి, వారిదోషములకు శాస్తిగా ఘోరహింసల పాలు చేయుటకో, మరణమును సుఖతము విధించుటకో ప్రకృతి పూనుకొనగలదు. అట్టి నిదర్శనములను గుఱించి రాబోవు అధ్యాయములో విచారణ చేయుదము గాక!

అధ్యాయము 5

'స్వేచ్ఛ'యొక్క సదసద్వినియోగము

ఈనాడు నరుని జీవితము బహుళసంకీర్ణ ప్రవృత్తిగలదైయున్నది. కావున వాని స్వేచ్ఛావినియోగము వలన జరుగుచర్యల నన్నింటిని సమీక్షను ఈపుస్తకమునందు పొందుపఱచుట సాధ్యపడదు. మన మిప్పుడు ప్రయత్నింప జాలునదంతయు, ఆకలిదప్పుల దీర్చుకొనుట మొదలగు నరుని ప్రాథమికావసరములనుండి ప్రత్యక్షముగా సంభవించు ప్రస్ఫుటమాకొలది విశిష్టచర్యలయొక్క ప్రస్తావనమాత్రమే. పాఠకుడు తానెఱిగిన యితరోదాహరణలను పరిశీలించి, యెందెందు స్వేచ్ఛయొక్క సద్వినియోగము అవసరమగునో; మఱియు ఆస్వేచ్ఛనే దుర్వినియోగము చేసినప్పు డెట్టి దుష్ఫలితములు చేకూరుచుండునో గ్రహించును గాక.

ఆకలి:—ఇదిమిక్కిలి యవసరముగ తీర్పవలసిన వాంఛ. అన్నింటి కన్న ప్రాథమికమగు నైజవాంఛ ఆకలియే. దానింగూర్చి యొకింత విచారింతము. జీవుల స్థూలశరీర మొక యంత్రమువంటిది. దానిని నడుపుట కవసరమగు శక్తిని సమకూర్చు వంటచెఱుకు కావలసి యున్నది. దానికి మరమ్మతులవసరము. అరిగివిరిగిపోవు భాగములను పూర్తిచేయుచు దానిని వాడుకకు అర్హమగుస్థితిలో నుంచవలయును.

కదలుచుండు నా యా భాగముల ఒఱపిడిసి తగ్గించు కొఱకు చమురు లవసరము. ఈ అవసరములన్నియు ఆకలి రూపమున తెలియ వచ్చుచుండును. శరీరముయొక్క యీ అవసరములనుతీర్చి, దానిని వాడుకొనుటకు దగినస్థితిలో నుంచుటకై కావలయు ఆ యా పదార్థ ముల నేరుకొనుటలో వాసన, రుచి, యనునవి జీవులకు సాయపడు చుండును.

సాధారణముగా, నైజజీవితముల గడపు జంతువులన్నియు తమ నైజగుణముల ననువర్తించు చుండును. అవి బ్రతుకుటకై తినును. ఆరోగ్యముగ నుండును. మానవుడును నటులనే చేయగలడు; కాని దురదృష్టవశమున అనేక సందర్భములలో నరుడు తన 'స్వేచ్ఛ' ను ప్రయోగించుచున్నాడు. ఆకలి తీర్చుకొనుటకుగాక, తనజిహ్వాచాప ల్యమును తృప్తిచేయు కొఱకుగాను చాలగా పక్వము చేయబడి నట్టియు, మసాలాద్రవ్యములు చేర్చినట్టియు ఆహారపదార్థములను కల్పనచేసి కొనుచున్నాడు. రుచిప్రేరితుడై, అతడు తనకు కావలయు దానిని మించి తఱచుగా మెక్కుచుండును. అతడు 'తినుటకై బ్రతుకు' చున్నాడననగును. జిహ్వాచాపల్యమును తృప్తిపఱచుకొనుటకై తన 'స్వేచ్ఛ'ను దుర్వినియోగము చేయుటయే యిక్కాలమున మానవు డనుభవించు బాధలలో పెక్కింటికి కారణ మగుచున్నది. మితిమీరి తినుట జీర్ణకోశమునకు భారము కల్పించుటేగాక, దానిని పెడత్రోవ కీడ్చును. తినుఆహారము పుష్టికరమైనదె యైనను, సామాన్యముగా అవసరమగు పరిమాణమునకు మించునెడల, శరీరమున కది అపాయ కరమై విషముగా పరిణమించును, అనేక విధములగు రోగముల కల్పించి, అధికబాధలకు లోనుచేయును. అకాలమరణమును సైతము తెచ్చిపెట్టును.

దప్పి:—ఆహారము జీర్ణమైన పిమ్మట, అది ద్రవరూపమున దేహములోనికి పీల్చుకొనబడును. పుష్టినొసగు ద్రవములు రక్తప్రవాహములో కలిసి, అవసరములగు తావులకు గొనిపోబడును. శరీరములోని ఆయా భాగములందు ఏర్పడు మలినపదార్థములను రక్తము ఊపిరితిత్తులలోనికి తీసికొనిపోవును. ఆమలినపదార్థము లక్కడ మనము పీల్చుకొను గాలిలోని ప్రాణవాయువుతో గలిసి దహింపబడి శుద్ధి చేయబడును. ఈ పని జరుగు సమయమున నెత్తురులోని నీరు చాల భాగము ఆవిరిగామారి, శ్వాసతోపాటు శరీరమునుండి వెలువడు చమ్మరూపమున బయటికిపోవును. ఈ చమ్మ చర్మము ద్వారమున చమట రూపమున వెలువడి శరీరముయొక్క శీతోష్ణస్థితిని సరిదిద్దుచుండును. ఈతీరున నీరు తగ్గి, నెత్తురుచిక్కబడుటను దెలుపు సూచనయే దప్పి. ఆదప్పిని తీర్చునిమిత్తము నిర్మలోదకము విశేషముగ త్రాగు టవసర మగుచున్నది. ఈ నీరు మన ఆహారద్రవ్యములను ఆయాశరీర భాగములకు చేర్చుటకేగాక, రక్తమును శుద్ధిచేయుటకును వినియోగపడుచున్నది. రక్తములోని మాలిన్యములను మూత్రము ద్వారమున తొలగించుటకును, చర్మముయొక్క సహాయమున శరీరమునందలి వాయువును సమస్థితిలో నుంచుటకును నీరు వినియోగ పడుచుండును.

నరుడు తన యిచ్ఛను దుర్వినియోగము చేయుటవలన, శరీరమున సహజముగా జరుగు ఈక్రియా కలాపమును తారుమారు చేయుచు, తన దప్పిని తీర్చుకొనుటకు కల్లుసారాయములను త్రావి శరీరములోనికి విషపదార్థములను ప్రవేశపెట్టుచున్నారు. ఈవిషపదార్థములు నాడీమండలమును చెడగొట్టి, బుద్ధిశక్తులకొఱవడజేసి, తుదిని ఆరోగ్యమునకు సయితము అడ్డుతగులుచుండును. ఈ అలవాటు వ్యక్తియొక్క గౌరవమును పాడుచేసి, కుటుంబ క్షేమ

మునకు చేటుదెచ్చును. ఆధునిక సమాజమున జూపట్టు ననేకములగు దోషములకును, కీడులకును త్రాగుడు మూలకారణ మగుచున్నది.

వాసన:—ఇదేతీరున వాసనయు ఆహారమును ఏర్చుకొనుటకు సాయపడవలసిన ఘ్రాణశక్తి పొగాకుపొగ పీల్చుకొనుటచేతను, ముక్కుపొడి వేసికొనుటచేతను, దుర్వినియోగము చేయబడు చున్నది. తాత్కాలికముగా పొడుముపీల్చుట సుఖకుదనమును, హాయిని ప్రసాదించునట్లు కాన్పింపవచ్చును; కాని గుండెను, మెదడును పాడుచేసి తుదిని మితిలేని అపకారము చేయును.

కామము:— జంతుకోటియందు ప్రవృత్తిని పురికొలుపు ప్రేరణల యన్నింటిలో బలతమమగునది, సంతానోత్పత్తిచేసి జాతినినిలువ బెట్టునిమిత్తమగు కామచేష్టయన వచ్చును. చాల పక్షులును, కొన్ని పశువులును తమశృంగార చేష్టలకు కామకలాపమును కేంద్రముగ జేసికొనుటే గాక, యవి జంటలుగ గూడి సమర సభావముతో జీవించుటకును, తమ కూనలను పెంచుటలో సమష్టిని బాధ్యత వహించుటకును కామము నాధారముగ జేసికొను చున్నవి. సర్వత్ర, ప్రకృతిలో, మగజీవియు ఆడజీవియు సంతానమునిమిత్తము మాత్రమే కొన్నికొన్ని ప్రత్యేకఋతువులందే సంగమించును.

ఇట్టి సంతానవాంఛగాని, ఉద్దేశ్యముగాని లేకయే తన ఇచ్ఛానుసారము మూఢపశుదశకంటెను క్రిందికిదిగజారిపోయి, నరుడు కామలాలసకు లోనై జననేంద్రియవ్యాపారమును హద్దుమీరిసాగించు చున్నాడు. బిడ్డలు సంగమక్రియకు నిర్దిష్టఫలములగుటకు మారుగా, అనిష్టఫలములై, అనేక సందర్భములందు అసంగమకార్యము యొక్క అవాంతర ఘోరశిక్షగా పరిణమించుచున్నారు. అటువంటి దోషాకరులను సెగరోగము, కొరుకురోగము మున్నగు వ్యాధులకు గురిచేసి, తన శాసనముల నతిక్రమించి వర్తించినందుకై ప్రకృతి

కసి తీర్చుకొనును. మరియు కేవలమా దోషులను దండించుటతో తృప్తినందక, తాను నిర్దేశించిన మార్గమునుండి తొలగి నడచిన వారియొక్క నిరపరాధులగు సంతానమును సయితము ప్రకృతి బాధించుచున్నది.

ఊహాశక్తి :— జీవులన్నిటిలోను నరునందుమాత్రమే ఊహాలసాగించి, అదృశ్యక్షేత్రములం జొచ్చి, కృత్రిమరచనల గావించి, లలితకళను సృష్టిచేయగల సమర్థత విశిష్టమై కాన్పించుచున్నది. ఈ సమర్థతను సహజమార్గమున వినియోగము చేసికొనుటకు మారుగా, అస్వాభావికమగు కృత్రిమ ప్రేరణలను కల్పించు నిమిత్తము సారాయములను మత్తు పుట్టించు నల్లమందు, భంగు, గంజాయి మొదలగు నిషాద్రవ్యములను నరుడు తోడు చేసికొనుచున్నాడు. ఉద్రేకజనకములగు నిట్టి పదార్థముల సేవించుట కలవాటు పడిన వారిని మత్తుమందు ప్రయోగము వలె ఆపదార్థములు ఏపనులుచేయుటకును కొఱగాని వారినిగ జేసివేయును. అంత్యమున తమకు దాసులైపోయి, తమ నాధారము చేసికొని, బ్రతుకు నరులకవి నాశము చేకూర్చుచుండును.

నిర్మాణశక్తి :— నరుడు తానుద్యమించిన కార్యముల నిర్వహణమునకై యాంత్రికసౌకర్యముల కూర్చుకొనుటలో తన మేధాశక్తిని వినియోగపఱచుకొనుపట్ల, సృష్టికర్తయగు భగవంతునితో పోటీకి దిగుచున్నట్లున్నాడు. వినాశముంగాక వరముల బడయుటకై అటుల పోటీ చేయబూని, ఉత్తమఫలితార్థములను సాధింపగోరునేని, అతడు ప్రకృతివిధానములను తూచ, తప్పకుండ ననుసరింపవలసియుండును. తన ఇచ్ఛవచ్చినటులెల్ల పోవుచో, ప్రకృతియొక్క సహకారమును పడయుట వానికి కేవలము దుర్లభము. అట్టి ప్రయత్నమేదైనను, వెనువెంటనే ఘోరవిపత్తును చేకూర్చును.

ప్రకృతి సిద్ధముగా సూర్యునినుండి వ్యాపించు వేడివలన సముద్రోదకము ఆవిరి యగుచుండును. సూర్యునినుండి ఆకర్షించుకొనిన శక్తితో గూడిన స్వచ్ఛమగు నీటియావిరి, ఉప్పును క్రింద విడిచివేసి, ఆకాశమున కెగిరి పోవును; అక్కడ మేఘముగా నేర్పడి, యా యున్నతప్రదేశమందలి చల్లని గాలుల మూలాన వర్షజలముగా తిరిగి చిక్కబడును. వర్షజలము కొండలపై బడునప్పుడు, అచటి యెత్తునుబట్టి దాని యందు గొప్పశక్తికూడుకొనియుండును. భూమి యొక్క గురుత్వాకర్షణ బలమువలన ఆనీరు క్రిందికి లాగబడగా, నేల మిట్ట పల్లముల ననుసరించి యది సముద్రము వైపునకు తిరిగి ప్రవహించును. ఆనీరు నదులరూపమున సముద్రము వైపునకు పాఱుచు అందు కలిసిపోవులోపల, నరుడు తనయిచ్ఛానుసారము దానిచేత యూడిగము చేయించుకొనుట కనువుగా, దానియందలి శక్తిని స్వాధీనపఱచుకొనుటకై, తనబుద్ధి విశేషముచేత నెన్నియో యుపాయములను పన్నుచున్నాడు. మొదట ఉన్నతప్రదేశమున నదుల కడ్డముగా అడ్డుకట్టలను కట్టును. అక్కడ వానియందలి అవ్యక్తరూపశక్తిని పేర్చిపెట్టును. దానిని తనకవసరమగు చోట్ల తన కవసరమగు సమయములందు వినియోగము చేసికొనుచుండును. ఈ తంతు మన దేశములో పర్వత ప్రాంతములందు పిండిమిల్లులలో జరుగుచుండుట నెఱుగుదుము. ఇది స్థానికపు టుపయోగము. కొన్నిచోట్ల పెద్దమిల్లుల స్థాపించి, నీటిప్రవాహపు శక్తిని విద్యుచ్ఛక్తిగ మార్చిచేసి, తీగల ద్వారమున వందల కొలది మైళ్ళు తీసికొని పోయి, త్రోవపొడవునను గల నగరములకును, పట్టణములకును, పల్లెలకును దీపముల నమర్తురు. లేదా నీటిపంపులను, మోటారులను నడుపుటకై వినియోగింతురు. పిమ్మట ఆనీటిప్రవాహములను కాలువలలోనికి మరల్చి పడవలు నడుపుకొనుట కుపయోగింతురు.

మఱియు సేద్యము చేయు తమపొలములకు నీరు పెట్టుకొందురు. ఈ తీరున నరుడు నదీప్రవాహములను వానిజలమును స్వాధీనము చేసికొని, ప్రకృతిగతి కేలాటి భంగము వాటిలకుండ, వేలకొలది జనములకు భోగభాగ్యముల సమకూర్చి పెట్టగల్గును.

ప్రకృతి తనమార్గమునను సరించి తనప్రయోజనముల నిర్వహించుకొనుచునే నరుడు ఆ ప్రకృతిని తనతోడను సహకరించి తనప్రయోజనములను నిర్వర్తించుకొనుటకై ఆహ్వానించు విధానమునైనచో, అతడు తనస్వేచ్ఛను వినియోగించు తీరుఎంతయు మెచ్చుకొనదగినదే. ప్రకృతియు నరుని జీవితమును హెచ్చువికాసవంతముగను, ఐశ్వర్యవంతముగను నొనర్చిన వానినాశీర్వదించును.

కాని దురదృష్టవశమున నరుడు ప్రకృతిచర్య కడ్డము తగులుటకై తనయిచ్ఛను వినియోగించుచున్నాడు. ప్రకృతిశాసనముల నతడెంతమాత్రము సరకుగొనక, తన భోగలాలసకొరకై, వానిని తిరస్కరించుచు, పెడత్రోవలబట్టి పోవుచున్నాడు. చూడుడు; అపమార్గముబట్టి, భ్రాంతి జనకమౌ తన రసజ్ఞతను తృప్తిపఱచుకొను నిమిత్తము మెరుగు పెట్టిన బియ్యపుపిండితోడను, గోధుమపిండితోడను సిద్ధముచేసినభోజ్యపదార్థములు ముత్యముల కాంతితో మనోహరముగ గోచరించుగాక యని నిశ్చయించుకొని, మెరుగులు పెట్టు యంత్రముల నెలకొలుపు చున్నారు. ధాన్యపుగింజలో పుష్టినొసగు జీవాంకురమును, జీర్ణమగుటకు తోడ్పడు తవుడు పొరను, క్రమనిష్పత్తితో, జాగ్రతగా ప్రకృతి దానియందుకూర్చి పెట్టియుండగా, నరుడు లేనిపోని జోక్యము కలిగించుకొని, ఆప్రమాణ సమరసతను భగ్నముచేయుచున్నాడు. మెరుగుపెట్టు చర్యవలన ప్రాణప్రదములగు అంశములు నశించిపోవుచున్నవి. ప్రకృతి విధించిన మార్గము విడిచి, మెరుగుపెట్టిన ధాన్యముల దినుచు పెడత్రోవల నడచు

నరునికి, అధిక బాధలను, మరణమును సయితము తెచ్చిపెట్టు నంజు జాడ్యమును కల్పించి, ప్రకృతి కఠినముగ శిక్షించును.

సీమరేగుపండ్లు, ఖర్జూరపండ్లు, దాక్షపండ్లు, మున్నగు ఆరోగ్యప్రదములగు తాజాపండ్లను ప్రసాదించుచు ప్రకృతి మనల నతి మురిపెముతో నాదరించుచున్నది. ఈ పండ్లను తాజాస్థితిలో తినుటకు మారుగా తనకు హుషారు కన్పించుననెడు భ్రాంతితో నరుడు వానినుండి రసము పిండి, దానిని పులియబెట్టి, కల్లు, సారాయముల తయారుచేసుకోసాగినాడు. ఈ సందర్భమునకూడ, ప్రకృతితో వికటవినోదములకు దిగు నరుని, పైన వివరించియున్న తెఱగున ప్రకృతి కఠినశిక్షలపాలు చేయును.

వంశసంరక్షణకొఱకగు ప్రకృతి నిబంధనలను తిరస్కరించి, గర్భనిరోధక సాధనములను సృష్టించి, హద్దుమీరి సంభోగానందమును పడయజూచు మానవుడు తన సృజనశక్తిని దుర్వినియోగము చేయువాడేకాని, ప్రకృతిసిద్ధప్రేరణను సఫలీకృతము చేయువాడు కాడు. ఈవిషయమున హద్దుమీరినవారిని ప్రకృతి కఠినదండనల పాలు చేయును. తుదకటువంటివారు పుంస్త్వమును కోల్పోవుటేగాక నాడీజాలము చెడగా, చిత్తచాంచల్యమును పొంది కుందుదురు.

అటువంటి దురభ్యాసముల సాగించి, ప్రకృతి నియమముల నతిక్రమించిన యుదాహరణలను విస్తారముగా జూపుట అనవసరము. పలువురి జీవితములు అట్టి యుదాహరణలతోడ నిండియున్నది. నరుడు నిస్సంకోచముగా తనయందుగల సమర్థతను,సాహసమును వినియోగించుకొని యింద్రియభోగములకు మరియు తాత్కాలికములును, క్షణభంగురములు నగు సౌఖ్యముల కాశపడియు, తలక్రిందుగా పరుగులిడుచున్నాడు. భయంకరమగు వేగముతో పరుగులుపెట్టి

తనకు వినాశముంగూర్చు ఆపదలయందు పడిపోవుచున్నాడు. తృటికాలపు భోగమున కాశపడి నరుడిట్టుల తన స్వేచ్ఛను దుర్వినియోగముచేసి కటా! వినాశమును చేకూర్చుకొనుచున్నాడు. ఇట్టి వర్తనము శాశ్వత ప్రకృతిధర్మమునకు వ్యతిరేకముగాన, పర్యవసానమునకు శాశ్వతములౌ క్రిమజీవనగతులు ధ్వంసమైపోవుచున్నవి.

నరుడత్యానందముతో గడించుకొను శక్తులలో దివ్యమైనది ప్రేమశక్తియై యున్నది. దానిని తోడివారి సేవయందు నిస్వార్థముగా ప్రకటించుటయు దివ్యలక్షణమే. తల్లియొక్క సహజప్రేమలో దాని రవంత తళుకుమాత్రిమే మనకు గోచరించుచున్నది. నరుడు తన తోడిజీవుల కట్టిసేవల నొనర్చుటవలన వానిజీవితమున నత్యుత్తమాంశమును ప్రకటింపగల్గుచు, దైవాంశమును భూతలమునకు దెచ్చినవాడగుచున్నాడు. అతడుతనయం దధికముగ గల శక్తిని ఎవరికి తన సాహాయమును, సేవయును అవసరములగునో అట్టి వారల క్షేమసౌఖ్యములకై అర్పణము చేయగల్గును.

ఇచ్ఛను దుర్వినియోగముచేయుట మూలమున నతడీ దివ్య శక్తిని ప్రేమయొక్క శాశ్వత దివ్యపథమునుండి పెడలాగి, స్వార్థపరుడై, తృష్ణను పెంచుకొని, భౌతికసంపదలగూర్చిన లోభగుణముగా మార్చివేయువాడగుచున్నాడు. వానియం దధికముగా జూపట్టు శక్తిని, తాను పేర్చి పెట్టుకొను ధనరాసులవలె స్వార్థప్రయోజనములకై దాచిపెట్టుకొనుచున్నాడు. ఇట్టి స్వభావముగలవాని కది అనర్థదాయక మగును. అతడు భోగములకును, వ్యసనములకును లోబడిపోవును. వాని సంపదలు వారసులకు దత్తమగునప్పుడు అన్నదమ్ములమధ్య పోరాటములకు హేతువులగును. వాని సంతానమును నాశముచేయుటకే మూలము లగును.

అధ్యాయము 6

మానవపరిణామదశలు – వ్యక్తులు

వృక్షవర్గము నందును, జంతువర్గము నందును గల చేతన జాతి యందు చూపట్టు పరిపోషణరీతులను గురించి లోగడ అధ్యాయములలో విచారించియుంటిమి. ఈ అధ్యాయములో, ప్రత్యేకముగా నరునిసందర్భమున ఆ పరిశీలనలు ఆ విచారణలు ఎట్లనువర్తించుటో, ఏతీరున ఏదశయందు నరునకు వానియం దుచితస్థానము లభించునో గమనింతముగాక.

తదితరజీవు లన్నియు, నైజగుణముచేత పాలింపబడునవై, తమ విశిష్టజీవనవిధానమునకు కట్టుబడియుండుటచేత, అవి స్వకీయమగు ప్రయత్నములమూలమున, ఒకతీరు పరిపోషణను విడిచివేసి మరొక తీరు పరిపోషణను అనుసరింపజాలకున్నవి. పుట్టినది మొదలు చచ్చువఱకును, వాని జీవనవిధానము, ఒక నిర్ణీతస్వరూపమునకు బంధింపబడి నడచును. పరాన్నభుక్కగు జీవి దాని జీవితమంతయు పరాన్నభుక్కగనే యుండి, ఇతరుల ఆహారముచేతనే పోషణ గాంచును. గత్యంతరము లేదు. చిఱుతపులి తనమచ్చల నెట్లు మార్చుకోజాలదో, తన స్వభావమును నటులనే మార్చుకోజాలదు. కావున నది యితర జంతువుల నెఱగా జేసికొని తిని బ్రతుకవలసినదే; లేదా చావవలయును. దాని జీవనగతి అట్టిదగుటం గూర్చిన బాధ్యత దానికి లేదు. దాని జీవ సరణిని సాహసపరిపోషణముగగాని, లేక సమూహ పరిపోషణముగగాని ఉద్ధరించుకొనుట దానికి సాధ్యముకాదు.

నరు డెట్లు తన స్వేచ్ఛవలన విశిష్టజీవి యయ్యెనో గమనించి యున్నాము. వానికి లభించినబుద్ధి వృత్తిసాహాయ్యమున అతడు తన పరిసరములను పరిస్థితులను ఎట్లు మార్చుకొనశక్తుడగునో గ్రహిం

చితిమి. మనుజవర్గమునకును తదితరవర్గములకును గల భేదము అందే గలదు.

ఒక బందిపోటువాడుగాని, కన్నపుదొంగగాని, పరాన్నభుక్కై జీవించు తన విధానమును మార్చుకొని, తన హింసావృత్తిని తగ్గించు కొనగలడు. అతడు స్వయముగా పాటుపడిగాని, యితరుల శ్రమలో పాల్గొనిగాని సంపాదన చేయకుండ ఊరక కౌలుదారునుండి సొత్తును ప్రోగుచేసికొని బ్రతుకు మూరసభూస్వామివలె, పై (స్తేయ) (తరగతి) పరిపోషణవర్గములోనికి ఉద్గమింపజాలును. లేదా తన స్వంతప్రయోజకత్వమువలన పాటుపడి, చెమటనోడ్చి పని చేసి, ధర్మజీవనమును గడుపు సేద్యగానివలెనో, లేక శిల్పివలెనో పరివర్తన మందుటకు నిశ్చయించుకొనగల్గును. అప్పు డతడు సాహసపరిపోషణా వర్గమున కెగయగల్గును.

తన పోషణపై నాధారపడియుండు కుటుంబముకొఱకై శ్రమించుచు, తా ననుభవించు నాదాయమును తన కుటుంబములోని యితరులతో పంచుకొనుచు ఒక హింసాసమష్టికుటుంబములోని యొక బాధ్యతగలవ్యక్తి కానగును. అప్పు డతడు సమూహాపరిపోషణా వర్గమున చేరినవా డగును.

తోడిమానవునియెడ సాంద్రప్రేమను వికసింప జేసికొని జాతీయ సేవకుడుగా పరివర్తనము పొందనగును. నిరాడంబరముగను, పొదుపుగను, జీవనము గడుపుచు, నేదేని పవిత్రోద్యమమున జేరి, శక్తికొలది పాటుపడువాడు కావచ్చును. అప్పు డతడు శ్రేష్ఠతమవర్గమున అనగా సేవాపరిపోషణ వర్గమున జేరగలడు.

శమదమాదుల శిక్షణ గఱచునెడల నిట్టిదంతయు మానవునికి సాధ్యము కాగలదు. అట్టివ్యక్తి తన జీవితధర్మమునకు విధేయుడై

నడుచుచు, అత్యుత్తమ దశను ప్రాపించునటుల తన యిచ్ఛాశక్తిని నియమింపజాలును.

మానవునియెడ ననువర్తింపగల వివిధపరిపోషణ విధానముల యొక్క విశిష్టలక్షణముల నిచ్చో సంగ్రహముగ చెప్పుకొనుట ప్రయోజనకరమగును.



మెడలోని బంగారుదండను దొంగిలించుకొఱకై చిన్నబాలికను జంపు చోరుడు మంచి ఉదాహరణము

పరాన్నపరిపోషణ :— నగలకై బిడ్డను హత్యచేయు చోరుడు

1. లోభప్రేరిత స్వార్థము.

2. ఉద్దేశ్యము: తన చర్యలవలన నితరుల కేలాటి యాపద వాటిలునా యను చింత లేకుండ స్వలాభమునే చూచుకొనుట.

3. సత్ప్రయోజనావకాశములను నాశముగావించకున్నను దుర్లభము చేయుట.

4. స్వంత హక్కులయెడ పూర్తిగ గట్టి పట్టుదల చూపుట.
5. స్వకీయవిధులను నిర్లక్ష్యము చేయుట.
6. పరోపకారశూన్యత.
7. హింసాకారకము.

ముఖ్యనిదర్శనము:—ప్రయోజనాధారముల భగ్నపరచుట.

స్తేయపరిపోషణము :— మంచి ఉదాహరణ: తా నెవరిని దోచునో వారికా నష్టము దెలియరాకుండ చమత్కారముగా జేబులు కత్తిరించుదొంగ.

1. అతివాంఛాప్రేరిత స్వార్థపరత.

2. స్వలాభమును సాధించు పూనిక వహించియు, తన దోపిడికి గుఱియైనవాడు సాధ్యమైనచో ఆపదపాలుగాకుండు తీఱున తన స్వార్థమును గడించుకొనుట.



3. తన హక్కులగూర్చియే పూర్తిపట్టుదల చూపుట.


4. తనవిధుల గుఱించి స్వల్పముగ యోచించుటో, లేక అసలే యోచించకుండుటో.

5. పరోపకారచింత లేకుండుట.

6. హింసాకారణ మగుట.

ముఖ్యలక్షణము :— ఉపకారము చేయకుండ లాభముల సాధించుకొనుట.

సాహసపరిపోషణము:—మంచియుదాహరము : రయితు తన భూమిని



దున్నును, ఎరువు వేయును. నీరు పెట్టును. మంచి విత్తనమును భూమిలో చల్లును; పైరును జాగ్రత్తగా కావలికాయును; పిమ్మట పైరుకోసి, నూర్పిడిచేసి ధాన్యలాభమును అనుభవించును.

1. తెలివితేటలతో స్వీయ క్షేమ లాభముల చింతచే ప్రేరణపొందును.

2. ఆత్మగౌరవ చింతగలిగి, తనశ్రమను, బుద్ధిని, పూనికనువినియోగపరచి, తద్వారమున పొందగల లాభమును మాత్రము పొందును.

3. సాహసించి పనిచేయుచు, లాభనష్టములను బుద్ధిపూర్వకముగ ననుభవించును.

4. సాధ్యమగుపట్ల తోడి శ్రామికులకును, నితరులకును లాభము చూపుట.

5. అందరిస్వామ్యముల సమముగ చూచును.

6. ఇతరులయెడ తన విధులను అధికాధికముగా గుర్తించును.

7. న్యాయ ధర్మబుద్ధిపై ఆధారపడుట.

8. ఒకానొకప్పుడు హింస కలుగవచ్చును.

ముఖ్యలక్షణము:—లాభనష్టములకు సిద్ధపడి తనవంతు శ్రమకును (పనికిని) తానుపొందు లాభమునకును పరస్పరానుబంధము కూర్చుట.

సమూహ పరిరక్షణము :— ఉదాహరణ : సమష్టికుటుంబములోని అందరి క్షేమముకొరకై కుటుంబపు యజమాని పాటుపడును. తానున్న సమాజముయొక్క సమష్టిక్షేమము కొరకు పంచాయతీ దారుగగాని సహకారసంఘపు మెంబరుగగాని సేవచేయును.

1. తనస్వంత ప్రయోజనమును, తానున్న సమాజము యొక్క క్షేమముకొఱ కర్పణ గావింపవలయునను ప్రేరణ.

2. తనక్షేమమునకు భంగము కలిగిననుకూడ, స్వార్థత్యాగము చేసి, తోడివారల యభిప్రాయమును మన్నించును.

3, సంఘధర్మములనే హెచ్చుగ పాటించును.

4. తాను పంచుకోగల లాభమునుకన్న, తానునిర్వహింప వలసిన ధర్మమును హెచ్చుగ పాటించును.

5. పరోపకారమును ప్రమాణముగ నెంచును.

6. తనసంఘమునకు చెందనివారలకు హింసకలిగినను కలుగ వచ్చును.


ముఖ్యలక్షణము: వ్యష్టికి కలుగు లాభముకన్న సమష్టియొక్క లాభమును ప్రధానముగ జూచుట.

సేవాపరిపోషణము :—

మంచి యుదాహరణము: ఆపన్నుల రక్షణకై సేవల చేయువాడు.

1. స్వలాభమునకు భంగకరముగ జూపట్టినను, పరుల యుపకారము కొఱకు పాటుపడును.

2. తన హక్కులను పాటింపక, తన ధర్మనిర్వహణము ప్రధానముగ నెంచి పాటుబడును.



ప్రతిఫలము నపేక్షింపకుండ దప్పిగొనిన మార్గస్థులకు నీరిడుట.

3. ప్రతిఫలాపేక్ష లేకుండ ప్రేమతోడను, పరుల హితము కొరకై పాటుపడు తీవ్రకాంక్షతోడను పాటుపడును.

4. అహింస, శాంతి చేకూర్చి శాశ్వతత్వము కొరకై పాటుపడుట.

ముఖ్యలక్షణము:— పనిచేయువాడు తనకు లభించు ప్రతిఫలమును పాటింపకుండ పాటుపడును.

మానవజీవుల సమూహములలో ప్రతిదానియందును, అది యొక సమాజముగాని లేక జాతియేగాని, ఈ పైన పేర్కొనబడిన ఆయా పరిపోషకవర్గములలో చేర్చదగిన వ్యక్తులు కాన్పించుచుందురు. మనదేశములోని ప్రాచీన వర్ణాశ్రమధర్మము ఇట్టి పరిపోషణ వర్గముల పాటించి యేర్పడినదై యున్నది. తమ పశువాంఛ తీర్చుకొనుటకును, జీవితము నెగుడు దిగుడు లేక నడుపుకొనుటకును, అవకాశమున్నంతవరకు సేవ యొనర్చుటకును, సంతోషపడు శూద్రులు మొదటి రెండురకముల పరిపోషణవర్గములలో చేరుదురు. ఆశాప్రేరితులై సాహసించు వైశ్యులు సాహసపరిపోషకవర్గమునకు చెందుదురు. రాజ్యముయొక్క క్షేమమునే ప్రధానముగ పాటించి, వర్తించు దేశభక్తులగు క్షత్రియులు సమూహపరిపోషణవర్గములోనివారగుదురు. సమాజమునకై నిష్కామసేవ యొనర్చుచు, భౌతికప్రయోజనములకగు స్వార్థచింతను, చూచుకొనక, ప్రజల యాదర్శములను ఉన్నతముగ నుంచి సంరక్షించుచు, నిర్ధనులుగ జీవించు బ్రాహ్మణులు అత్యున్నతవర్గమునకు చెందినవారగుదురు.

ఆధునిక కులవ్యవస్థ ప్రాచీనకాలపు ఆదర్శములనుండి చాలగా అధఃపతనమైపోయి యున్నది. పూర్వపు పేరులను, అర్హతలను పాటింపుచు, నిప్పటికులములవారికా గుణగణములను నారోపించి, ఆకాలపువారే వీరని నిరూపింపగలుగుట

అసంభవము. ఈనాటి బ్రాహ్మణు డొకడు పెద్దపెద్ద జీతాలకు ఆశించి హైకోర్టుజడ్జీ కావచ్చు లేక ఐ. సి. యస్. కూటములో జేరవచ్చు. అవాంతరముల భీతిలేకుండ, శాశ్వతాధారమైనపటుగు ఉద్యోగబలము గలిగి, భౌతికలాభముల కాశించి పని చేయునంత వఱకు, అత డెంతటిసమర్థతతోడను, ఎంత న్యాయబుద్ధితోడను తన విధుల నిర్వహించువా రైనను, ప్రాచీనవ్యవస్థప్రకార మైనచో తప్పక శూద్రకోటిలో పరిగణింపబడవలసియే యుండును. అతడే శ్రీమంతు డగు వ్యాపారి యగుచో వైశ్యు డగును. లోకమాన్యతిలకును బోలి, తన కేమిమూడునను లక్ష్యము లేక, తన జాతియొక్క స్వాతంత్ర్యా దర్శమును సాధించుకొఱకై నిష్కామముగా పాటుపడు రాజకీయ నాయకు డౌనెడల, అతడు ఉత్తమక్షత్రియుడే యగును. గాంధీజీవలె కేవలము ఉద్యమసిద్ధికన్న, ప్రయోగింపబడు సాధనముల నిర్మలతను సంరక్షించుట ప్రధానముగా నెంచి పాటుపడుచు, ఫలితార్థ మేమైన గాని, యెట్టికష్టములు పైబడినగాని, తన ఆదర్శము నంటిపట్టుకొని యుండి తీవ్రప్రయత్నముల సాగించునతడు, వాస్తవికబ్రాహ్మణు డనవలయును.

బహుశః ఆప్రాచీనకాలపు పరిస్థితులను శాశ్వతముగా పరిరక్షింప గోరి, ఆకాలపు వ్యవస్థానిర్మాతలు కులధర్మములను వంశపారం పర్యము చేసి అనుల్లంఘనీయములుగా నియమించియుండిరి. వృత్తి నిర్ణయమునందు వ్యక్తియొక్క స్వేచ్ఛావినియోగమునకు హద్దుపెట్టి, వానిని పుట్టువునకు బద్ధుని జేసిరి. ఈ ఆధునికప్రపంచమున ఉద్యో గములయు, వృత్తులయు ధారాళతనుబట్టియు, యెక్కడికిబట్టిన నక్క డికి మార్పుగల శ్రామికబలము ననుసరించియు, రాకపోకల సౌక ర్యములచేతను, కర్మకౌశలమును సాంకేతికజ్ఞానమును సంపాదించు కొనుట కగు విశాలావకాశముల ప్రాభవమువలనను, సార్వజనీన

అసంభవము. ఈనాటి బ్రాహ్మణు డొకడు పెద్దపెద్ద జీతాలకు ఆశించి హైకోర్టుజడ్జీ కావచ్చు లేక ఐ. సి. యస్. కూటములో జేరవచ్చు. అవాంతరముల భీతిలేకుండ, శాశ్వతాధారమైపఱగు ఉద్యోగబలము గలిగి, భౌతికలాభముల కాశించి పని చేయునంత వఱకు, అత డెంతటిసమర్థతతోడను, ఎంత న్యాయబుద్ధితోడను తన విధుల నిర్వహించువా రైనను, ప్రాచీనవ్యవస్థప్రకార మైనచో తప్పక శూద్రకోటిలో పరిగణింపబడవలసియే యుండును. అతడే శ్రీమంతు డగు వ్యాపారి యగుచో వైశ్యు డగును. లోకమాన్యతిలకును బోలి, తన కేమిమూడునను లక్ష్యములేక, తన జాతియొక్క స్వాతంత్ర్యార్జనమును సాధించుకొఱకై నిష్కామముగా పాటుపడు రాజకీయ నాయకు డౌనెడల, అతడు ఉత్తమక్షత్రియుడే యగును. గాంధీజీవలె కేవలము ఉద్యమసిద్ధికన్న, ప్రయోగింపబడు సాధనముల నిర్మలతను సంరక్షించుట ప్రధానముగా నెంచి పాటుపడుచు, ఫలితార్థ మేమైన గాని, యెట్టికష్టములు పైబడినగాని, తన ఆదర్శము నంటిపట్టుకొని యుండి తీవ్రప్రయత్నముల సాగించునతడు, వాస్తవికబ్రాహ్మణుడనవలయును.

బహుశః ఆప్రాచీనకాలపు పరిస్థితులను శాశ్వతముగా పరిరక్షింపగోరి, ఆకాలపు వ్యవస్థానిర్మాతలు కులధర్మములను వంశపారంపర్యము చేసి అనుల్లంఘనీయములుగా నియమించియుండిరి. వృత్తినిర్ణయమునందు వ్యక్తియొక్క స్వేచ్ఛావినియోగమునకు హద్దుపెట్టి, వానిని పుట్టువునకు బద్ధుని జేసిరి. ఈ ఆధునికప్రపంచమున ఉద్యోగములయు, వృత్తులయు ధారాళతనుబట్టియు, యెక్కడికిబట్టిన నక్కఱకు మార్పుగల శ్రామికబలము ననుసరించియు, రాకపోకల సౌకర్యములచేతను, కర్మకౌశలమును సాంకేతికజ్ఞానమును సంపాదించుకొనుట కగు విశాలావకాశముల ప్రాభవమువలనను, సార్వజనీన

సంబంధమువలన నది ప్రకాశమునకు తేగలుగు వైఖరులను పరీక్షించుటమూలమున, మానవ పరిణామదశలలో దేనిని ప్రాపించియున్నదో నిర్ణయించుట సాధ్యమే యగును.

మన వివరణమునకొఱకు, ప్రాచీనమార్గమునుండి తొలగిన నేటి నాగరికసంస్కృతి అవలంబనముచేయు విధానములను మూడు దశాంతరములుగా విభజింపవగును:—1. ప్రాకృతసంస్కృతి (లేక పశుదశ), 2. ఆధునికసంస్కృతి (లేక నరదశ), 3. పరిణతసంస్కృతి (లేక పారమార్థికదశ). మన మింతకుపూర్వము ప్రస్తావనచేసిన యైదు వర్గములలోని మొదటి రెండు పరిపోషణవర్గములు- అనగా పరాన్న పరిపోషణము, స్తేయపరిపోషణము అనువానిని ప్రాకృతసంస్కృతి లేక పశుదశ కుదాహరణము లనదగును. పిమ్మటి రెండు పరిపోషణ వర్గములను- అనగా సాహసపరిపోషణము, సమూహపరిపోషణము అనువానిని- ఆధునికసంస్కృతి లేక నరదశ కుదాహరణములును; తుదిదగు సేవాపరిపోషణ మనదు సుపరిణతసంస్కృతిని, పారమార్థికదశ కుదాహరణ మనదగును, మొదటిది అశాశ్వతమును, హింసాకరము నగు సంస్కృతి యనుట విస్పష్టము; రెండవదియు అశాశ్వత మైనదే; ఇందును హింసాలక్షణములు చాలగానుండును. కాని శాశ్వతత్వాకాంక్షయు, అహింసాకాంక్షయు అధికాధికమగుచుండుట గోచరించును. తుదిదానిలో శాంతి, శాశ్వతత్వము, అహింసల గుఱించిన ఆకాంక్ష సాంద్రముగ గోచరించును.

1. ప్రాకృతసంస్కృతి లేక పశుదశ :— ఈ వర్గములోనివారు తదితర వర్గములవారితోడను లేక జాతులతోడను వ్యవహరించుపట్ల రాన్నభుక్కులుగ నుండవచ్చును. పరాన్నభుక్కగు జీవి యితరుల హక్కులను సరకుగొనదు. తన యవసరముల దానెట్లు చేకూర్చుకొనుచుండెనో విచారించరు. తన చర్యలవలన ఇతరులకు కలుగు

ఫలితార్థము లెటువంటి వగునో లెక్కసేయదు. మృగములలో పెద్ద పులిని చూడుడు. అది తాను పైబడి చంపనున్న లేడికూన యేమను కొనునో యని స్థిమితముగా కూర్చుండి విచారించదు. దాని దృష్టి యంతయు ఆసమయమున తనకుగల ఆకలిని తీర్చుకొను టెట్లా యను విషయముమీదనే యుండును. అదేతీరున అడవులలో వేటాడు బోయవాడును, ఏటిలో చేపలుపట్టు బెస్తవాడును ఇసుమంతయు జాలి లేక, ఆ యా మృగములను, మత్స్యములను తన తాత్కాలికపు టవసరముల దీర్చు కొనుటకై పట్టిచంపుదురు. సరిగా ఆతీరుననే, అన్యసంఘములను హింసించి నాశముచేసి తనుపరిపోషణమును జూచుకొను ఏజాతియైనను నైజముగనే పరాన్నభోజనముచే బ్రతుకునదై యుండును.


ప్రాచీనకాలమున పరప్రజ లొసగు కప్పములపై నాధారపడి యైశ్వర్యము లనుభవించిన గ్రీకు, రోమక సామ్రాజ్యములు, ఇతరులను బానిసలజేయు విధానము నాధారముగ గొని బ్రతికిన వగుటచేత పరాన్నభుక్కుల వర్గములోనివే యనవలయును.

ఈ నాడును, అధినివేశములందలి యుత్పత్తి మీదను, పరుల శ్రమఫలముల దోచుకొనుట మీదను ఆధారపడు జాతీయ సంస్థలన్నియు పరాన్నభోజనముతో బ్రతుకునవియే.

చీనాదేశము బ్రిటిషువారి నల్లమందు వ్యాపారము, అమెరికా దక్షిణప్రాంతముతోడి బ్రిటిషువారి బానిసలబేరము, పశ్చిమాఫ్రికా రాష్ట్రముల మీద 'లియొపాల్డు' రాజు గావించిన దోపిడి, భారత దేశపు అంగడులపై నాధారపడు బ్రిటిషు పారిశ్రామికుల వ్యాపార నీతియు వారివారికి లోబడిన జనుల వినాశమును గూర్చిన వగుట వలన, పరాన్నభోజనమే యనవలసియున్నది.

కాము చెట్లనుండి పుణికి కొని తిను పండ్లను పండించుటలో నేలాటి శ్రమయు పడని కోతుల జూడుడు. అవి తమకు పండ్ల నిచ్చు చెట్ల కేలాటి అపకారము చేయవు; ఆచెట్లు మఱలమఱల ఫలించు రీతిని వానిని నిరపాయస్థితిలోనే విడిచివేయును. కాన కోతులయొక్క నీతి స్తేయ పరిపోషణముల లోని దనవలెను.

ప్రాచీన చరిత్రలో నాదరుషావంటి వారు కలరు. వారు దేవాలయములను దోచుకొని, యచ్చోవ్యర్థముగా పడియున్న ధనరాసుల నెత్తుకొని పోయిరేగాని, ఆదేశప్రజలయొక్క సంపదల నిర్మించుకొను సమర్థతను భంగ పఱచలేదు. కాన వారి దాడులు స్తేయ వర్గములో చేరుననవచ్చును.



దక్షిణ అమెరికా ప్రజా రాజ్యములను తమవశము చేసికొనియున్నన్యూయార్కు సాహుకారులు ఈ వర్గము లలో చేరుదురు. నిర్మాణ కార్యమున స్వయముగ నే విధమగు శ్రమయు పడకుండ, తమ వాటాల లాభ


ఏ సంపదలను నిర్మాణము చేయక, వడ్డీవ్యాపా ములను పంచుకొను నేటి
రముచేసి భోగముల ననుభవించు సాహుకారులు. ‘జాయింటు స్టాకుకంపెనీల’ భాగస్వాములును స్తేయవర్గములలోనివారే. వీరు లాభముల పంచుకొందురేగాని, శ్రమలో సాయపడరుగదా? ఇదేవిధాన, గుత్తగొను వ్యాపారముల పూని, తమ పెట్టుబడి నిష్పత్తి ననుసరించిరాగల దానికంటెను చాల హెచ్చుగా లాభమునుపంచుకొనుటలో పేరెన్నిక

గాంచిన 'కార్టెల్సు' 'ట్రస్టులు' 'కంబైన్లు' మొదలగు కంపెనీ కూట ములును చాలవరకు స్తేయ వర్గములోనివే.

అధునికసంస్కృతి లేక మానవదశ :—ఇప్పుడు వర్ణించిన దశ పూర్తిగా స్వార్థపరదృష్టిమీదను, హక్కులమీదను ఆధారపడునదై యున్నది ఇక మానవదశలోనో, ధర్మములను లేక విధులను పాటించు సూచన లుండును. హక్కులకును, విధులకును సమత చేకూర్చుటకగు ప్రయ త్నము తఱచుగా గోచరించును. ఈ దశకుజెందిన జాతులు తాము శ్రమపడి సంపాదించిన ఫలముతో తృప్తిపడుచు పొరుగువానికి హింస కలిగించకుండ జీవించు ప్రయత్నముల సాగించును. భారత దేశములోను, చీనాదేశములోను వర్ధిలు వ్యావసాయిక జీవనముపై నాధారపడు నాగరికతను విచారించును. లాభము నార్జించు నిమి త్తము చాలవరకు శాంతముగా తమతమ వృత్తులను చేసికొనుచు బ్రతుకు శిల్పుల తోడ్పాటుతో అయ్యది నడచుచున్నది. ఈ నాగరి కతను సాహసపరిపోషణ కుదాహరణముగా దీసికోదగును.

జాతులపేర సమైక్యత గూర్చుకొనుచు, తెలుపు, నలుపు, ఎఱ్ఱన, పచ్చన మున్నగు రంగుభేదములగాని, లేక సంపదల సంబం ధించి రాజు, రయితు అనెడు తారతమ్యములను గాని, పాటింపని ముస్లిము నాగరికత సమూహపరిపోషణ రకమునకు చెందినదనుట స్పష్టము. 'నాజీలును' 'ఫాసిస్టులు' నిటీవల ఈవర్గములో చేరుకొనిరి. వీరు హింసాపరులైనను, ముఖ్యముగా తమ వర్గములకు వెలుపలి వారియెడ కాఠిన్యము వహించువారైనను, సాంద్రమగు సామాజిక దృష్టికలవారుగ నున్నారు. ఎట్లైనను వీరియందు సమూహపరిపోషణ లక్షణములు చాలగలవు. వీరు తమతమ వర్గమువారియెడ నిర్వహింప దగిన విధులం గూర్చి పట్టుదలగలిగి యుందురు. ఈ వర్గమునందలి

ప్రతివ్యక్తియు సమష్టిని తమవర్గము లేక తమ సంస్థ సంబంధమగు సమష్టిక్షేమమునందు వ్యక్తిక్షేమము లీనమైయున్నటుల భావించును.




జలపాత విద్యుచ్ఛక్తి ప్రజోపయోగమునకై వినియోగించువిధము.

పరిణతసంస్కృతి, లేక పారమార్థికదశ: ఇందేయొక్క వర్గమునెడనో గాక సమస్తజీవులయెడను పాటించవలసిన విధులు గలవను భావన ముదయించును. అన్నిమతములీసంస్కృతిని సాధించుటకే సాధనభూతములగుచున్నవి; మరియు నవి భూతదయను, దీనజనోద్ధారణమును ప్రతిపాదించి భగవత్సేవ నుండి తొలగినవారు పాపమునార్జించి ఎట్లుశిక్షాపాత్రులగుదురో తెలుపుచున్నవి. భోగలాలస అనిత్యమగు ప్రాపంచిక సుఖమునకే దారితీయుననియు నవి బోధించు చున్నవి.

ఐనను కూడ, ఈ దశాంతరమున కాదర్శప్రాయముగ జూప
జాలు సాంఘికకూటము నెద్దానినిగాని మనము పరిణమింపజేసి
యుండలేదు. ప్రాచీనుల యభిప్రాయములో బ్రాహ్మణులీ దశకు
సమీపవర్తను లనదగియున్నను, నేడు ఆ పేరున బఱగు జనులు,
ఆయాధర్మములకు చాల దూరులై, పతితులై పడియున్నారు.

ఈ యుత్తమదశను ప్రాపించు నిమిత్తమే తన యావచ్ఛక్తి
సామర్థ్యములను ప్రయోగించి, గాంధిజీ గాఢప్రయత్నముల సాగించి
యున్నాడు. గాంధీజీ యేర్పాటు చేసిన అఖిలభారత చర్ఖాసంఘము,
అఖిలభారత గ్రామపారిశ్రామిక సంఘము మొదలగునవి వారి ఆద
ర్శములు కార్యరూపము దాల్చుకొరకై చేయు ప్రయత్నములకు
నిదర్శనములై యున్నవి. ఆయన కృతకృత్యుడైన యెడల 'రామ
రాజ్యము' అనగా భూలోకమున దైవరాజ్యము అనదగు శాంతి
మయజీవనసంస్కృతి చేకూర్చి శాశ్వతపరిపోషణయొక్క ప్రతిష్ఠాపన
జరిగియుండెడిది.


ప్రకృతి
అనిత్యము - సాకారము
లోకోపకారశూన్యమగు హక్కులు ఆధారము
నరుడు సహా సర్వజీవులు
శాశ్వతము - రచనాసమర్థము
లోకోపకార భావమును విధులును ఆధారము
సభ్యనరుడు
పరాన్న పరిపోషణ
దానశూన్యత
అన్యార్థభంగము
స్తేయ పరిపోషణ
దానశూన్యత లేక దానమునకు మించిన ప్రతిఫలమును లాగుట
సాహస పరిపోషణ
ప్రతిఫలసహిత దానము
సమూహ పరిపోషణ
సమూహ పరిపోషణ
ప్రతిఫలమునకు మించిన దానము
సేవా పరిపోషణము
ప్రతిఫలాపేక్ష రహిత దానము

అధ్యాయము 8

మూల్యప్రమాణములు

బాగుగా తెలిసినట్టి లేక సుగ్రాహ్యమైనట్టి ప్రమాణముల ప్రయోగించి, ఆ యా వస్తువుల మూల్యమును, లేక విలువను నిర్ణయింతుము. వేర్వేఱు వస్తువులను కొలుచుటకు వేర్వేఱుసాధనములు కలవు. కొన్నిటిని లెక్కపెట్టుదుము; కొన్నిటిని తూచెదము; కొన్నిటి పొడ వెంతయో చూచెదము; కొన్నిటి ఘనపరిమాణమును గణించెదము. గోధుమలవంటి కట్టెద్రవ్యములను ఇన్ని మానికలు, ఇన్ని శేర్లు అనుచు కొలిచెదము. బెల్లము, ఇనుము మొదలగువానిని ఇన్ని మణుగులు, ఇన్ని టన్నులు అనుచు తూచెదము; వెదురువాసాలను లెక్కపెట్టుదుము; వస్త్రములను గజపుబద్దతో కొలిచెదము; కాగితములను ఇన్ని రీములు, ఇన్నిదస్తాలు అని లెక్కవేతుము; బీడీలు, సిగరెట్లు మొదలగువానిని ఇన్నికట్టలు, ఇన్ని పెట్టెలు అని లెక్కింతుము; పాలు, నూని మొదలగువానిని ఇన్ని శేర్లని కొలుతుము; కిరోసిను ఆయిలును, శీరాలను ఇన్నిసీసా లని లెక్కచూచెదము. ప్రతి ప్రమాణమునకును నిశ్చితమైన కొలత లున్నవి. ఆ కొలతలతోడ లెక్కవేయు వస్తువులును, వాని సాయమున తేల్చబడిన విలువలును సుప్రసిద్ధములై సర్వాంగీకారము పడయుచున్నవి. ఎవ్వరుగాని అంగడికి పోయి, యిన్నివేల గోధుమగింజలను లెక్కపెట్టి యిమ్మని యడుగరు.

అనుసరణస్వభావము:— ప్రత్యేకము మనసంబంధముగామాత్రము మూల్యముల పరిగణనచేయునప్పుడు ఆపరిగణనుస్వార్థమైనదందుము. మనపరిగణకన్యమగు పరిగణతో పోల్చి చూచినప్పుడుగాని, లేక భావనారూపమగు ఆదర్శముతో పోల్చినప్పుడుగాని, యితరమానవుల ప్రశక్తిదీసికొని విచారించినప్పుడుగాని ఆమూల్య పరిగణను పదార్థ

మందుము. జంతువులలో ననేకము స్వయంనిర్ణయము పైననే ఆధారపడును. వానిపరిగణన సదా స్వార్థపరముగా నుండును—అనగా వాని సద్యస్సౌఖ్యల ప్రయోజనమున కనుసరణమైనదిగా నుండును. అవి పరార్థచింత పెట్టుకొనవు. అదేతీరున ప్రాకృత మానవునకును పదార్థచింతతో జోక్య ముండదు. సంస్కృతపురుషుడు అనగా ఉత్తమపరిణతి గాంచిన నరుడు మాత్రమే నిస్సంగముగా విషయ విచారణచేయగలడు. యథార్థమునకు నరు డుపయోగించు పరిగణ ప్రమాణముల ననుసరించి, వానియోగ్యత నిర్ణయ మగుచుండును.

వ్యక్తిగతప్రమాణములు, లేక స్వార్థపరప్రమాణములు

ప్రమాణరీతులు:—సమస్తజీవనగతులందును మనుష్యులయొక్కయు, వస్తులయొక్కయు యోగ్యతలను నిర్ణయించి వర్ణన చేయవలసి వచ్చుచుండును. బావిలోనినీరు తేటగానున్నది. వస్త్రము శుభ్రముగ నున్నది అందుము; ఒకపుష్పము చూచి రమ్యముగ నున్నదందుము; ఒకమానవుని వర్తనమునెంచి యోగ్యమైన దందుము; ఒకనిచర్య స్తవనీయమైన దందుము. ఇట్టి నిర్ణయము లన్నింటి యందును, వానికాధారముగా కొన్ని ప్రమాణములు (కొలతలు) కలవని సూచితములగు చుండును. ఒకానొక పురుషుడు సదాన్యాయనిర్ణయమును సక్రమముగ చేయునను నప్పుడు, వానిని విచక్షణాశీలు డందుము; అనగా అతడు యోగ్యతాప్రమాణములను సవ్యముగను, సక్రమముగను గణనచేయ జాలునని అర్థము. ఈ ప్రమాణములను శారీరకములు లేక భౌతికములు అనియు, మానసికములు లేక సాంస్కృతికములు, మఱియు పారమార్థికములు అనియు వర్గీకరణము చేయుదుము.

ఒకవర్తకుడు వ్యాపారములో తనకు రాగల లాభమునను సరించి, సరకుల నాణ్యము తెల్పును. ఒకక్షామికుడు ఏదేనివస్తువును తాను

వినియోగము చేసికొనునప్పుడు దానివలన తిండి, గుడ్డ, యిల్లు మొదలగు అవసరముల నెంతవఱకు కది తీర్పగల్గునా యను విచారణ ననుసరించి, దానికి విలువగట్టును. ఒకచిత్రకారుఁడో, సౌందర్యము మీఁదనే దృష్టినిలుపును.

కాలము, కీర్తి, సంపదలు మున్నగువానిపై నాధారపడు ప్రమాణములు గలవు :— కెయిరో మ్యూజియమును చూడవచ్చు వారి కక్కడి చిత్రవస్తువుల చూపు దర్శకుడు కాలముయొక్క దృష్టితో సర్వమును గణన చేయును. అతఁడొక వస్తువును "టుటఖమెనుమమ్మీ"అని చూపి, అది అనేక వేలయేండ్లనాటి పురాతన వస్తువనియు, 'రాంసేజుమమ్మీ'ని జూపి అది క్రీస్తుపుట్టువునకు పూర్వ మెన్ని యుగములనాటిదో యనియు చెప్పుచు, సందర్శకుల కబ్బురముకొలుపఁజూచును. అచ్చటి వస్తువుల పురాతనత్వము గ్రహించి, ప్రేక్షకు లద్భుతపడుదురుగాక యని అతని ఆశయము.

రోము, ఫ్లారెన్సు, నగరములకు బోయితిమేని, అచ్చటి దర్శకుడు 'మైకిలు అంజీలో' 'రోబార్సు' ల వంటి శిల్పాగ్రేసరులు రచించిన చిత్రువులను, గోడలమీఁది బొమ్మలను, చిత్రలేఖనములను చూపును. వానినిచూచు ప్రేక్షకులు అతని దృష్టిలో ఆ రచనలు మహాఘనచైదములని అంగీకరింపవలసియుందురు.

ప్రాచీన కాలముననె ఉద్యానములు, భవనములు, కళలు, కావ్యములు మున్నగు రమ్యరచనలందు తాము మేటులమని పారశీకులు గర్వముమీర పలుకుచుందురు.

బ్రిటిషు మ్యూజియమును జూడబోవు ప్రేక్షకునకు చీనా, ఇండియా, పెరూ, పర్షియా మొదలగు దేశములనుండి తెచ్చిన రకరకములగు రమ్యవస్తువుల చరిత్రలు తెలుపబడును. అతడు బ్రిటిషు

వాని జగద్విఖ్యాతమగు సంగ్రహనైపుణ్యమును గని వెఱగంద గలడు.

న్యూయార్కు నగరవీధులలో బోవునప్పుడు కొంగవలె మెడ చాచి, నింగినోరయునోయన; ఉన్నతములగు మేడలదొంతరులను గాంచునతడు, వాని నిర్మాణమునందు వెచ్చింపబడిన ధనపుమొత్తములు కోట్లను దాటిపోయి యర్బ్బకములలో గణితము వేయవలయుట దెలిసి విస్మయము నందును. ధనలోభియగు విదేశీయు డెవడేని వానిం జూచునప్పుడు వాని ప్రాచీనతనుబట్టిగాక, వాని సుప్రసిద్ధశిల్పమును గనియు గాక, వాని అందచందముల యరుదగు వైఖరుల గమనించియుగాక, వానికై వ్యయపఱచబడిన ధనరాసులమూల్యముం నూహచేసి ముగ్ధుడు గావలయును.

ఏయొక్క సందర్భమునను ప్రత్యేకముగా అన్వయింపగల మని నిర్ధారణ చేయదగు ప్రమాణ మొందును లేదు. కాని విచిత్రాంశమే మనిన అందందు విశిష్టముగ వినియోగము చేయబడు ప్రమాణముయొక్క ప్రాథాన్యతను మనము గమనింపవలసియుండును. తాజ్ మహాల్ చూడబోవు యాత్రికుడు అందుపయోగింపబడిన చలువరాతి నాణ్యముంగూర్చి యభివర్ణనచేయ గడంగడు. 'కైలాసా' లో వీనిని మించిన చలువరాళు లెన్నిలేవా? దాని రచించిన శిల్పిపేరుసైతము తెలియరాదు. ఆ దివ్యనిర్మాణము యొక్క కాలమేని విస్మయజనకము కాదు. అయినను దానింజూచుటచే గలుగు చిత్తవికాసమును, ఆ భవన రచనయందు ప్రదర్శితమగు ఔచిత్యము చూచువాని నాకర్షించి ముగ్ధుని చేయుననెడు విషయము గమనింపదగియుండును. విమర్శదృష్టితో, దానియందు గమనింపగల మాన్యతరాంశముల లెక్కించి కొనియాడ నక్కఱ లేకయే, అప్రయత్నముగనే హృదయమున హర్ష ముప్పతిల్లును.

వేర్వేఱు భావములతో సాగించు పరిగణనమూలములగు ప్రమాణములకు దృష్టాంతముల నిచ్చియున్నాము. వర్తకుని ప్రదర్శనాగారమున విక్రయమునకై అమర్చి పెట్టబడిన వజ్రపుటుంగరము నందలి స్వర్ణాది ద్రవ్యముల మూల్యమునకు అతీతమై వెలయు ప్రమాణములు గలవు. ఒకానొక విఖ్యాత చిత్రకారుడు రచించిన తైలవర్ణచిత్రము నొకదానిం దీసికొందము. దానివిలువ అందుకై వినియోగించిన, గుడ్డ, రంగు, మొదలగు వస్తువులపై నాధారపడి యుండదు. తల్లిదో తండ్రిదో యగు జీర్ణపాదుకం జూడుడు. పితృభక్తి పూరితుడౌ తనయుడు దానినే మహాదమూల్యవస్తువుగా సంరక్షింప వచ్చును. విక్రయార్హమగు విలువ యిసుమంతయు దానియందు కానుపించదు. ఐననేమి? ఆవ్యక్తియొక్క దృష్టిలో ఆ ముక్కలు వోయిన వస్తువు సయితము విశిష్టమగు మూల్యము కలదేయగును.

వాంఛితార్థవస్తువునకు, దానియందు గలుగు మక్కువకొలది మూల్యమును నిర్ణయింపజూచినను, స్థిరప్రమాణమనునది యుండదు. కొందఱు వ్యక్తులననుసరించి కొన్ని కొన్ని వస్తువుల విలువ మారి పోవుచుండును. డబ్బునుబోలు విశ్వజనీన ప్రచారము ప్రమాణము గల వస్తువునకు సయితము ఎల్లఱు సమానముగ నంగీకరింపగల స్థిరతరమగు విలువను నిర్ణయింప జాలకున్నారు. ఒకరయితు చేతిలోని రూపాయి వాని కుటుంబమున నొకదినము ఆహారమును సంపాదించిపెట్టగల అవకాశమునకుచిహ్నము కానగును. ఆరూపాయియే యొక్క ఉద్యోగి చేతిలోనుండినచో, అదొక సినీమానాటకమును జూచుటకు వినియోగపడగలదు. అదియే యొక ధనాఢ్యుని చేతిలో నున్నయెడల మోటారుడ్రైవరునకిడదగు ఈనాముగనో, తన వస్తువులను కావలిగాచువానికిచ్చు కూలిగనో, ఉపయోగపడగలదు. ఇట్లు ఒకే యొకరూపాయి ధనికుని చేతను, నుద్యోగిచేతను, రయితుచేతను,

బింకను బీదవానిచేతను బడునప్పుడు స్థానపునూర్పువలన గలుగు దాని ప్రయోజనము హెచ్చుగుచుండెనని తెలిసికొంటిమి. మరియు ఆ రూపాయియే ఒక దరిద్రుని చేతిలోనుండి భాగ్యవంతుని చేతి లోనికి పోవునెడల దానివలని ప్రయోజనము తఱిగిపోవును.

ఒకే వ్యక్తిచేతిలోనున్ననుకూడ, వస్తువులయొక్క విలువ సదా యొకేతీరున నుండజాలదు. ఒక బాలునిచేతిలో ఏడు జిలేబీచుట్ట లున్న వనుకొనుడు. ఆ యేడుచుట్టలును ఒకేరకము పిండితో చేయబడి, ఒకే తూనికగలవిగ నుండవచ్చును. ఐనను ఒక్కొక్క జిలేబీచుట్టవలన గలుగు సంతోషము, తక్కిన వానిలో ఒక్కొక్కచుట్ట యియ్యగల సంతోషముతో సమానముగ నుండజాలదు. ఆ బాలుడు మొదటగా దిను జిలేబీచుట్టను అమితాసక్తితో తినును. బలేరుచిగానున్నదనును. ఇంక నొకచుట్టనో రెంటినో తిని సమానముగనే ఆనందింపవచ్చు ననుకొందము. ఆ పిమ్మట ఒక్కొకచుట్టను తినినకొలదిని, జిలేబీ చుట్టలరుచి తరుగునట్లుండి, వానిమక్కువ తలుగుచుండును. చివ ఱకు మిగిలినవానిని తినుటనిననే వానికి వెగటుపుట్టునట్టిస్థితి సంభ వించును. కావున ఆ జిలేబీచుట్టలను తినినకొలదిని, ఆ బాలుడు ఆ జిలేబీల కీయగల మూల్యము అనగా విలువ తగ్గిపోవుచుండును అనవచ్చును. ధనికునిచేత బడిన రూపాయి గతికూడ ఇదేతీరున నుండును. అతనికి హెచ్చుగా రూపాయీలు చేకూరిన కొలదిని, ఆతడు ఒక్కొక్క రూపాయికిడు విలువ లేక గణ్యత తగ్గిపోవు చుండును.

ఇప్పుడు చూడండి :— జిలేబీచుట్టల దినుబాలుడు ఆరుచుట్టల దినిన పిమ్మట, జిలేబీలయెడ వానికి గలుగు మక్కువ చాలతక్కువ. నీళ్ళు కావలయునను కోరికపుట్టి బలపడును. కడవెడు నీళ్ళుగల బాలు డొకడు వానికి కనబడుననుకొందము. అప్పుడతడు వానికడకు

పోయి, ఒక లోటా నీళ్ళు తన కిచ్చునెడల, అందుకు బదులుగా ఒక జిలేబీ చుట్టను సంతోషముతో నిచ్చివేయుటకు సమ్మతింపగలడు. అప్పుడు వాని కా లోటా లోని నీళ్ళు త్రాగుటవలన గలుగు ఆనందము వాని కడనున్న యేడవ జిలేబీచుట్టను దినుటవలన గలుగు సంతోషముకన్న మిన్నయై తోచును. రెండవ బాలునికో, మొదటి బాలునకు ఏడవదైన జిలేబీచుట్టయే వానికి మొదటి జిలేబీచుట్టయై గొప్ప సంతోషమును కూర్చును. ఒక్క లోటా నీళ్ళకొఱకు ఒసగబడు యేడవ జిలేబియొక్క మారకము ఇరువురు బాలకులకును లాభదాయకమేయై కానబడును. ! వస్తువుమార్పిడి వ్యవహారములో, ఆ యిరువురు బాలకులకు అంతకు ముందును ఆ పిమ్మటను కలిగిన ఆనందమును మనము గణితము వేసి చూచుదము. ఆ యిరువురివద్దను మొదటనున్న సరకుయొక్క విలువయందు మార్పు ఏ మాత్రమును మనకు కనుపించదు. కాని వారు చేసికొనిన వస్తుమార్పిడి వ్యవహారానంతరము, వారనుభవించు ఆనందముయొక్క విలువ చాల మారినదని యొప్పుకోవలసియున్నాము. ప్రపంచములో జరుగు వర్తకమునకంతకును ఇదియే కీలకము. అమ్మినతడును, కొనునతడును పరస్పరము మేలుకూర్చుకొనినవారే యగుచున్నారు. ఇందొకరు నష్టపడుట, వేఱొకరు లాభమునందుట అనునది లేనేలేదు.

స్థిరతర ప్రమాణములు, లేక పరార్థప్రమాణములు :— కేవలము ధనరూపమో లేక వస్తురూపమో తాల్చు మూల్యములయొక్క ప్రమాణములను ఆధారముగా తీసికొని జరుపు వ్యవహారములందు స్థలభేదముగాని, కాలభేదముగాని మన దృష్టిలో నుండదు. ఇదొక లోపమే. దీనివలన మన కొకతీరు గ్రుడ్డితన మావహించుచున్నది; హింసను వినాశమును తెచ్చిపెట్టుచున్నది; వానినుండి తప్పించుకో

లేకున్నాము. పురుషుని సంస్కృతి హెచ్చినకొలదిని, సంకుచితములును, అశాశ్వతములును నగు మూల్యములను, ఆమూల్యప్రమాణములను పాటించు బుద్ధి దూర మగుచుండును. ఏమాత్రము స్థిరత్వమును, అనగా శాశ్వతత్వమును కోరుకొనినను, మూల్యముల ప్రమాణము, అట్టి మూల్యముల నిర్ణయించు పురుషుడును అశాశ్వతుడేగాన, వాని ప్రమేయములేని దేనిమీదనో ఆధారపడునదిగా నుండవలయును. వస్తువుల స్థిరత్వచింతననుసరించి యేర్పడు ఆదర్శములు గలిగి, అట్టి దృష్టితో గ్రహింపబడునట్టియు, వ్యక్తుల యిష్టానిష్టముల ప్రసక్తిలేక స్వతంత్రమై యొప్పునట్టియు, ఆధారములు స్థిరతరములై నిలుచును. కావున అవి సత్యములును విశ్వాసపాత్రములునై, అనుచరణీయములు కాగలవు. శాశ్వతత్వమును సాధింపగోరుదుమేని, అటువంటి విలువలపై నాధారపడు పరిపోషణము మనకు ముఖ్యావలంబనీయమై యుండును.

నైతిక మూల్యములు :— నీతిశాస్త్రము ననుసరించి జీవించు వ్యక్తి, స్థూలవిషయములపై నాధారపడు మూల్యప్రమాణములను పాటించబోడు. దొంగవాడొక చిన్ని పాపను చంపును. దానిపై నుండు నగల నెత్తికొనిపోయి అమ్మజూచును. ఆ నగలు వాని కేటుల లభించినవో, ఆ పుట్టుపూర్వోత్తరగాథ దెలిసినచో యెవ్వడేని వానిని కొన నిచ్ఛగించునా ? ఆ నగలనగా యేవో కొన్ని తులాల బంగారము మాత్రమేకాదు; అభము శుభము నెరుగని యొక పసిబిడ్డయొక్క రక్తము సయితము వాని మూల్యమునే చేరియున్నది! దానిని యెంత చౌకగా అమ్మజూపినను, ఆ యొక పసిబిడ్డను హత్యగావించి తెచ్చిన నగలని యెరిగినచో, వెగటుచెందునేగాని, యే నరుడును వానిని కొనుటకైన నిచ్ఛగింపజాలడు.

అటులనే బజారులో అమ్మకమునకు పెట్టబడు ప్రతి వస్తువునందును నైతికమూల్యము ఇమిడి యుండును. అటువంటి విలువలను పాటించుటమాని 'వర్తకము వర్తకమేలెండు' అని మనము తేలికగా పలుక దగదు. కానిపల హింసతోడను, మోసము చేయబడిన శ్రామికుల కష్టముతోడను తయారు చేయింపబడిన సరుకులందు హింసాదోష మిమిడియే యుండును. అట్టి సరకులను కొనుగోలు చేయు మనము, ఆ వస్తువు లెటువంటి హింసాకర పరిస్థితులలో సిద్ధము చేయబడెనో పాటింపకున్నను, ఆ హింసను గూర్చిన బాధ్యత మన నెత్తిపై పడకమానదు. కాబట్టి వర్తక వ్యాపారములలో పాల్గొనునట్టి ప్రతివానిమీదను గొప్ప బాధ్యత యున్నది. ఆ వ్యవహారము దమ్మిడీ విలువగల వస్తువుగూర్చినదే యగుగాక. తాను బుద్ధిపూర్వకముగా ఆమోదింపదగనట్టియు, ప్రోత్సహింపదగనట్టియు పరిస్థితులకు తాను కారణభూతుడు కాకుండ జాగ్రత వహింపవలసి యున్నది.


సంఘాచారములు :— తాను పొందగల మేలును సంఘమే నిర్ణయింపగలదు. వ్యక్తులు గాని, కూటములుగాని తమకై చేయబడు వివిధములగు సేవలం గూర్చి తాము చూపు మన్ననరూపమున ఆ సేవలకును మూల్యముల నిర్ణయించినవా రగుచున్నారు.

ఉదాహరణకు, పూర్వకాలమున నాలుగు వర్ణములవారి యెడను చెల్లుబడియైన ఆదరణకు, ఆయా వర్ణములవారు సంఘమునకు చేయుచువచ్చిన సేవలే యాధారముగ నుండెను. తన యవసరములను మాత్రమే చూచుకొనుచు, నితరుల ప్రమేయమును గమనింపక, జీవనము గడపు శూద్రునకు సంఘములో చెప్పుకోదగినంత గౌరవము ఉండెడిది కాదు. అంతకంటె కొంచెము ఉన్నతస్థాన మొసగబడినను,

తన లాభముకొఱకుమాత్రమే సాహసము చూపుచు, తనకొఱకే సంపదను కూర్చుకొనుచు, ఆ సందర్భమున నేదో కొంత మేలును సంఘమునకు చేకూర్చుచుండిన వైశ్యునకును జూవబడిన మర్యాదయు తక్కువయే. తన రక్షణపై నాధారపడియున్న ప్రజల గాపాడు బాధ్యతను వహించి, తాను నిర్వహింపవలసియున్న ధర్మముకన్న తన ప్రాణమును, తక్కువమూల్యము గలదిగా గణించు క్షత్రియునకు ఘనతరపదవి యంగీకరింపబడియున్నది. తన భౌతిక శరీరము భగ్నమైపోనున్నను సరకుగొనక, ఒకానొక పరమగమ్యార్థసాధనకై జీవితము నంకితముచేయు బ్రాహ్మణుని పాదములచెంత సర్వజనులు, రాజులు సయితము సాష్టాంగపడెడివారు. ఎన్ని సహస్రాబ్దులనాడో మన దేశమున పరిపాటియై సాగిన సంస్కృతి, గౌరవప్రమాణములు ఇటు లుండెడివి. దురదృష్టవశాత్తు, నేటికాలమున, క్షణభంగురమయ్యు కండ్లకు మిఱుమిట్లుగొలుపు భౌతికసంపదల తళుకు బెళుకులు పూర్వపు గౌరవమర్యాదల విలువలను తారుమారుచేసి వైచినవి. మనకు పూర్వార్జితములైయున్న యీ దివ్యాదర్శముల దిశకై మరలుటకు మనము సర్వవిధముల ప్రయత్నింపవలసియున్నది. వానిని యవలంబించిననేగాని మనకు సుస్థిరత యేర్పడజాలదు.

ఆధ్యాత్మికమూల్యములు :— యూదుల రాజులలో మహాఘనుడయిన దావీదును గుఱించిన ప్రాచీనగాథ యొకటిగలదు. యూదుజాతికిని, ఫిలిస్టైను జాతికిని బద్ధవైర ముండెడిది. ఒకసారి సాగిన యుద్ధములో ఫిలిస్టైనులసేనలు తఱలివచ్చి దావీదురాజునకును, వాని రాజధానీ నగరము 'బెత్లెహేము' కును మధ్య చేరుకొనినవి. శత్రుసేనా వారమునకు ఆవలివైపునను, బెత్లెహేము నగరమునకు వెలుపలను నున్న పెద్దబావి దేవిడునకు వాని సేనావారమునుండి కాన్పించు

చుండెను, "ఆ బావినుండి చల్లని నీరు తోడి తెచ్చి నా దప్పి తీర్చ గలవాడెవడో కదా!" యని దావీదు అభిమానము పురిగొలుప పలికినాడు. వాని వీరభటవర్గములో కొందఱా పలుకు లాలించిరి. తక్షణమే వారు తమ యేలిక కోర్కను దీర్చుటకై పయనమైనారు. తమ ప్రాణములేమైపోవునో యనెడుచింత యిసుమంతయు లేనివారై, శత్రుసైన్యముల చీల్చుకొని సాహసమున బర్వులిడి, ఆ బావిం జేరి, అందుండి కడవెడు నీరుం దెచ్చి రాజునెదుట బెట్టిరి! రాజు వారి సాహసమునకు మెచ్చి, తనస్వల్పపుకోరికను నిర్వహించు నిమిత్తము, తమ ప్రాణములనే తృణప్రాయముగా నొడ్డ సమకట్టిన శూరభట వర్గము యొక్క సాహసమునకును, ప్రభుభక్తికిని ఆశ్చర్యపడి ముగ్ధుడై పోయినాడు. వాని ఆధ్యాత్మిక నేత్రమున కప్పుడా కడవలో గోచ రించిన దేమి? చల్లని నిర్మలోదకము కాదు; దానిని సాధించి తెచ్చిన యోధవరుల జీవరక్తమే వాని కందు గోచరించినది! ఆతడా కడవ నెత్తిపట్టుకొని, "నేనీజలము నెటుల త్రాగగలను? దీనియందున్నది నీరుకాదు; నాప్రియసైనికుల నెత్తురేసుడీ! నేను వీనిని గ్రోలితినా దైవశాపోపహతుడనై పోనా! ఆ వీరభటు లర్పించు తర్పణముగా దీనిని భగవంతుని కొసగుదుగాక" అని మిగుల నుత్కంఠుడై పలికె నట! అటునంటి దివ్యభావప్రేరితములై మన చైదములు వెలయు కొలదిని, ప్రతివిషయమునకును దానికర్హమగు నుచితస్థానమునొసగి, దాని వాస్తవికమూల్యమును గుర్తింప జాలుదుము. అప్పుడు మన జీవితచర్యలు హెచ్చు పవిత్రవంతములగుచు శాశ్వతపరిపోషణ విధా నమునకు దారిజూపగలవు. అహింసావలంబనముం జేకూర్చి, మానవ జాతి నుద్ధరించి, శాంత్యానందముల ప్రసాదింపజాలును!


మూల్యములు
స్వార్ధపరము
పరార్ధ పరము
కాయకము
భౌతికము
చిత్తవిస్ఫారకము
నైతికము
సాంఘికము
ఆధ్యాత్మికము
ప్రాధమికావసరములతృప్తి
కల్పితావసరములతృప్తి
మానసికవాంఛల తృప్తి

అధ్యాయము 9.

ప్రమాణనిర్ణయము

మూల్యములను తెల్పుటయందు ఉపకరించు ప్రమాణములు తమ తీరులను, తమ ప్రభావమును వినియోగదారులమీద అంకితము చేయుచుండును. ఒకజాతియందు సామాన్యమై పఱగు ప్రధాన ప్రయోజన దృక్పథము, ఆజాతి సంస్కృతియందు శతాబ్దములకొలది తన ప్రభావమును చూపుచుండును. కాబట్టి జాగ్రత్తగలిగి వివేక పూర్వకముగా మనము నిర్ణయించుకొను ప్రమాణముల వైఖరి చాల ప్రాధాన్యత వహించును.

ఈజిప్టు, బాబిలోను, గ్రీసు, రోము రాజ్యముల ప్రాచీన నాగరికతల చారిత్రకగాథను వివరింపజాలు జాడలు నేడు కానరావు. కొలది శతాబ్దములవరకు మాత్రము తమ తళుకుబెళుకుల జూపుచు వెలింగి యదృశ్యములై పోయినవి. ఏలన వాని నిర్మాణమున కాధారములై నిలిచిన ప్రమాణములు ప్రధానముగాస్వార్థపరములును,అస్థిరములునై యుండెను. వాని నిర్మాణ సంప్రదాయములు పరుల బానిసల గావించు విధానమువలనను, తమకు లోబడిన జాతులనుండి బలాత్కారముగ గప్పములగైకొను విధానమువలనను విషపూరితములైపోయె నని వెనుకటి అధ్యాయమున సూచనప్రాయముగ దెలిసికొని యున్నాము. గ్రీకులు, రోమనులును తమ శిల్పమునందును, కళలందును, వాఙ్మయమునందును తమ యుద్రేకపూరితములును స్వార్థపరములు నగు లక్ష్యములను, ప్రమాణములను సుస్థిరముగ అంకితము గావించియే యున్నారనుట తథ్యము. అయ్యవి వారి భావిసంతతి వారు తమ పూర్వుల ఘనతనుగూర్చి ప్రగల్భముగ చెప్పుకొనుటకు

మాత్రమే ఉపకరింపజాలునట్టివిగ నున్నవి. వారి సంస్కృతియందు సజీవమగు సత్యము శూన్యమైపోయి యున్నది.

ఇందుకు భిన్నముగా, ప్రాచీనతయందు సమానములో, లేక అధికములో ననందగు చీనాదేశముయొక్కయు, భారతదేశముయొక్కయు సంస్కృతులు, పరోపకారపరములును స్థిరతరములును, అగు సత్వముల ననుసరించి నిర్మితములై యున్నవి. ఆ కారణమున నవి యీనాటికిని తమ జాతీయ నిర్మాణమునందు చైతన్యలక్షణములను, మఱియు శాశ్వతత్వముయొక్కయు, అహింసాధర్మముయొక్కయు నితర చిహ్నములను సుస్పష్టముగ చాటుచున్నవి. వీరి పారలౌకిక దృష్టినిగూర్చియు, ప్రాచ్యమతాచారముల గూర్చియు చులకనగ గేలిసేయుటకు వెడగులగు ఆధునికయుగ లౌకికపురుషులు పాల్పడుదురే గాక! పశ్చాత్తాప పడదగిన దిందేమియు లేదు. పొంచియుండి పైబడు వన్యమృగదశనుండి పరిణామసోపానముల నెక్కి పైకిబోవుచున్న మానవజాతిని వేరుజేసి చూపు ప్రాచ్య సంస్కృతి గుణమేకాని దోషము గాదు. సమాజము సుస్థిరమై నిలుచుట కనువగు పునాదులు వేయుటలో మన పూర్వులు ప్రయోగించిన యోగ్యతాప్రమాణములు బహుదూరదృష్టితో నిశ్చయింపబడి యుండెననుటకు, ఈ నాగరికతలు అవిచ్ఛిన్నముగ సాగివచ్చుటే ప్రబల దృష్టాంతము. వారివలెనే శాశ్వతములును అహింసాపరములు నగు ప్రమాణ సత్వముల ననుసరించి, మనమును పురోనిర్మాణమును సాగింపనెంతుమేని, మన మనుసరించు ప్రమాణములు సయితము పరోపకారపరములును, ప్రయోజనకరములునై యుండవలయునేగాని, తాత్కాలికపు టవసరములమాత్రము తీర్చునవిగ నుండిన చాలదు. ముఖ్యముగా ప్రస్తుత పరిస్థితులలో మన రాజకీయసంస్థలు తారుమారైపోనున్న సందర్భమున, భావిభాగ్యో

దయముకొఱకై ప్రణాళికల రచించుటలో ఆలోచనానిమగ్నులమై యున్న యీసమయమునందు మనము కడుంగడు జాగరూకతతో మెలగవలసియున్నాము.

దురదృష్టవశాత్తు ఆధునిక యుగమున, ప్రపంచ నాటకరంగమందు ప్రముఖ పాత్రధారులై నిలుచుచున్న వర్గనాయకులు ధనరూప ప్రమాణములనే కేవలముగ అవలంబింపకున్నను, చాలవఱకు వానినే అవలంభించుచున్నారు. ఈ ప్రమాణావలంబనముయొక్క ప్రభావమునకును, పర్యవసానమునకును నిలకడయనునది గోచరించుటలేదు. ఏయెడ చూచినను "ఉన్నతజీవన ప్రమాణములు", "జాతీయ వార్షికాదాయాభివృద్ధి", "వస్తూత్పాదన శక్తిసామర్థ్యముల విస్తృతి", "ఆధునికప్రపంచపు స్పర్ధలో లాభసముపార్జనము" అను నినాదములును, మఱియు నింక నితర ప్రగల్భ ప్రకటనములును ఎన్నెన్నియో చెవులందు గింగుఱుమనుచు వినవచ్చుచుండును. ఈ కాలపు ఆర్థిక సిద్ధాంతము లాభములు, ధరలు, కొనుగోలుశక్తి, విదేశ వాణిజ్యమునను ఊబినేలలమీద నిర్మాణమగుచున్నది. తదితర జీవవర్గములనుండి మానవజాతిని వేఱుజేసి, దాని విశిష్టగౌరవమును ప్రకటించు గంభీరజీవన ప్రయోజనముల ప్రస్తావనయే శూన్యము. లేలగ ఏకొలదిగనో చూపట్టినను, మానవప్రయోజనములయొక్క అనగా ఆధ్యాత్మిక ప్రయోజనములయొక్క ప్రసక్తిని అల్పమనుచు తృణీకరించివేయు మహానర్థకరమగు వైఖరి బయలుదేఱుచున్నది. కాబట్టి అత్యంతము జాగ్రత్తతో మెలంగవలసిన యవసర మేర్పడినది.

మనకు పరంపరాగతమై వచ్చుచున్న కొన్ని సంపదలకు విలు
వలు కట్టుటలో ప్రయోగింపబడునట్టి నూతన ప్రమాణపద్ధతుల

కొన్నింటిని పరిశీలించి చూచునెడల, వాని సౌఖర్యంబే నవ్య నూతన పద్ధతు లనబడునవి యెంతవిపరీతమై యున్నవో తెల్లము కాగలదు.

చేతితో రంగువేసిన అపురూపసౌందర్యముగల చైనా గిన్నె నొకదానిని పరీక్షించునెడల, కుమ్మరిపనుల తనిఖీచేయు ఇన్‌స్పెక్టరు "అయ్యో! యీగిన్నెనొకదానిని చేయుటకు ఎంతసమయము వ్యయమైపోయెనోగదా! ఇట్టివానిని వేయిజతల నొక్క నెలదినము లలో నేను సిద్ధముచేసి పెట్టగలనే" అని వింతపడును.

· అజంతాగుహాలకు పోయి అనేక దశాబ్దములో శతాబ్దములో కష్టపడి నిర్మించినట్టియు, విశ్వవిఖ్యాతి గన్నట్టియు కుడ్యాలంకార చిత్రము లను, బొమ్మలను గాంచి, "కొలది వారములలోపల ఆ యద్భుత చిత్రరచనల బోలు ప్రతులను వేలకొలదిగా తయారుచేసి ఈయగల న"ని నవీనప్రవీణవర్ణచిత్రకారు డత్యంత సాహసముతో పలుకగలడు.

పాలిమారు తోటలక్రింద నెన్నియో యకరముల సారవంతము గు భూమి వ్యర్థముచేయబడుచుండె ననుచు నూనెగింజల వ్యాపారము చేయు వర్తకుడు వాపోవును. మఱియు, "అయ్యో! ఈభూమి నంతను వ్యవసాయమునకై వినియోగించినయెడల ప్రతి సంవత్సరము వేల కొలది మణుగుల వేరుసెనగ పండుచుండునుగదా యని వేరొకడు ఉస్సు రనును.

వివిధ వేదాంత దర్శనముల యుద్బోధమున కాధారములై వేర్వేరు సనాతన సంస్కృతుల నిర్మాణమునకు మూలాధారములైన, ప్రాచీన చారిత్రగ్రంథములు తాళపత్రములపైని, గంటములతో లిఖింపబడియుండుటం గాంచి, నేటి గ్రంథప్రకాశక కుశలుడు వెల మాలిన యాయాకులం గూర్చి జాలిచెందినవాడై, ఒక్కొక్క సంపు

టము నైనేసి రూపాయల చొప్పున విక్రయించుట కనువగునట్లు చక్కని 'బాండు' కాగితముపైని ముద్రించుట కగు ఖర్చుల యంచనాలను తయారుచేయ గడంగును.

ఆగ్రా నగరమున సమాధుల నిర్మించుటకై వాడబడిన మేలి చలువఱాతి పలకలను చూచి, 'ఇరానీ' వసతిగృహాలకు తేనీటిబల్లల సరఫరా చేయు వ్యాపారస్థుడు ఆ చలువరాలులవంటి అమూల్య ద్రవ్యములను వ్యర్థముచేసినందుకు తీవ్రమగు నిందసేయును. తాజ మహాలును నిర్మించుటకు నుపయోగించిన టన్నులకొలది శిలాఫలకముల నూడబెరికి సద్వినియోగము చేయునెడల నవి యెన్నివేల మేజాబల్లలకు సరిపోవునో అంచనాలు వేయుచు నెంటనే తన గణితము సాగించును.

న్యూయార్కు మహానగరమునుండి సిమెంటు శిల్పాగ్రేసరు డొకడు వచ్చి మన ఎల్లోరాగుహాల గాంచుచో, ఆకొండలో మూడంతస్తులు గల దేవళమును తొలిచి, చిత్ర విచిత్ర విగ్రహములతో శోభిలు స్తంభముల నందమర్చి వాని నన్నిటిని నంత నైపుణ్యముతో తొలుచుటకై విలువగల కాలము నెంతగా వృథా చేసియుండిరోగదాయని నిన్నోటపడుట నిశ్చయము. ఆప్రాచీనశిల్పులు యెనలేని తమ ఘనతర శిల్పరచనలకు సరిపడు శిలల నేర్చుకొనుటలో జూపిన వారి భూ తత్వశాస్త్ర పాండిత్యము నభినందింప నొల్లడు, వారి నిర్మాణకౌశలమున ద్యోతకమగు సాంద్రనిష్ఠను మెచ్చుకొనుట వానికి హితవుగ నుండదు. ఈ ప్రాకృతదేవమందిరములను కఠినరాతిలో చెక్కు న్యాయము చేసిన కాలములో నత్యంత స్వల్పాంశవే చాలునే, న్యూయార్కు నగరమునం దరువది యంతస్థుల మించి ఆకాశము నంటునటుల నొకదానిపై నొకటిగా పే

'కిరాసీను నూనెడబ్బాల' దొంతరులనుబోలు మిద్దెల నిర్మాణమునకని అంచనాలువేసి గర్వముతో మురిసిపోవును. ఈ ఎల్లోరాలోని కైలాసమందిరము ప్రతిరూపము నొకదానిని, ఆ ప్రాచీన నిర్మాణము నుండియే ప్లాస్టరుతో నొక అచ్చును తయారుచేసి, ఆ అచ్చుయొక్క ఆధారముతో మూడునెలలలో కొలదిపాటి ఖర్చుతో, యినుపచువ్వలను కూర్పుతో, సిమెంటుతో పొదిగిన కంకరరాళ్ళతో అంతకన్న గట్టిగా నిర్మాణముచేసి చూపగలననియు నతడు నొక్కి వక్కాణింపనగును.

పందెపుగుఱ్ఱాల వర్తకుడొకడు సేవాగ్రామమునకు బోయెనేని, గాంధీమహాత్ముని నోటిని పరిశోధించి (యూడిపోయిన) వాని దంతాల లెక్కించి, గాంధీజీయొక్క మూల్యమును నిర్ణయింపబూనిన వింత యుండదు. వయస్సుమీరి నిరుపయోగమైపోయినటుల నిశ్చయించి, వృద్ధపశుశాలలో బాపూజీకొక యుచితస్థానమును సిఫారసు చేసినను అబ్బురముండదు.

ఇదంతయు, స్వర్ణకారుడొకడు గులాబీపూతోటలో ప్రవేశించి, యందలి పుష్పములనుదీసి వఱపిడి రాతిమీద తన యలవాటునుబట్టి పెట్టిరుద్దుచు వాని నాణ్యమును తేల్చజూచునంతటి వెడగుచేష్టవంటిదేయిదంతయునని వేఱే చెప్పవలయునా ?

దేని యోగ్యతనైనను తేల్చు సందర్భమున, పై నుదాహరించిన కృత విపరీతచర్యలు, ఒకరీతి ఆర్థికదృష్టిస్థానమున వేఱొకరీతిదగు కదృష్టిని ప్రయోగించుటవలన సంభవించునవియె! చూడుడు: పందెపుగుఱ్ఱాల వర్తకుడు 'పరాన్నపరిపోషణ' రకమునకు సంబంధించినవాడై యుండి, తా నలవాటు పడియున్న యేకైక ప్రమాణమును, 'సేవాపరిపోషణ' కు సంబంధించిన ధర్మసూత్రముల స్థానమునందు దుష్ప్రయోగముగావించి యున్నాడు.

పైన వ్యవహరించిన యీ వర్తకుని విపరీతచర్య అతిశయోక్తులతో ప్రస్తావింపబడినట్లు తోచునుగాక! ఐనను నేటి వాస్తవిక జీవితమున అటువంటి మూల్యప్రమాణములే చెల్లుబడి యగుచున్నవి. అదియు పామరులగు సామాన్య బేరగాండ్రసరణిగాదు. ప్రపంచములో ప్రబల విఖ్యాతిగన్న సర్వకళాశాలలనుండి ఆవిర్భవించి మహా మేధానిధులని ప్రఖ్యాతిగన్నవారి చరితమె. పరాన్నపరిపోషణము, స్తేయపరిపోషణము, సాహసపరిపోషణమునను మొదటి మూడురకములకు చెందిన ఆధునిక పారిశ్రమాధినాయకులను సమర్థింపబూని, తర్కవాదముల సాగించు సుప్రసిద్ధ సిద్ధాంతకర్తలకు మన సర్వకళాశాల లునికిపట్టులై వెలయుచుండుటలేదా ?

ఏ సమస్యనైనను సరియే, "ఇది లాభకారియగునా" అనెడు నొఅపిడిరాతిపైననే, వీరి పరీక్షనుడీ! అతి స్వచ్ఛమగు నేతితో తన బిడ్డలకై యే తల్లియైనను తన యింటిలో స్వంతముగా హల్వా తయారుచేసినయెడల, "ఓయమ్మా ! నీవు నేతిలో ఏమాత్రమో క్రొవ్వు కలితీచేయకుంటే, లోకములోని విక్రయవీధులలో నీ వెందేని నెగ్గేదెలాగునమ్మా ?" అనుచు డాక్టరు డంబాచారిగారు వచ్చి కడు దర్పముతో ఆ తల్లిని మందలించగలడు. మఱియు ఆ హల్వాను తయారుచేయుటలో వ్యయమా కాలమునకు సముచితము కొంతమూల్యమును చేర్చి లెక్క కట్టి, తన మిఠాయి ఖరీదును తేల్చుకోవలసియుండునని ఆతడా తల్లికి బుద్ధిగఱప బూనును. ఆ వస్తువుయొక్క ధర నిట్టుల పెంపుచేయుట, శాస్త్రప్రకారము చేసితీరవలసిన యత్యావసరకార్యమని నొక్కి చెప్పును. అటుల తేల్చబడిన శేరు హల్వా ధరను బజారులోని ధరతో పోల్చి చూచుకొనుటయు ఉచితమని ఆమెకు నచ్చునటుల బోధింపజూచును,

ఆమాటలాలించి, "లోకములోని విక్రయవీథులంటే యేమిటి బాబూ! అవెక్కడుంటై? ఈ హల్వాను నా బిడ్డలు తినేందుకని నేను తయారు చేసికొంటిని. వారికి శుద్ధమైన మేలి మిఠాయి పెట్టుకోవాలి. గాని, బజారుధరలతో నాకు పనేమున్నది? శేరుధర ఎట్లా గిట్టుబాటవుతుందో శాస్త్రప్రకారము లెక్కగట్టుట నాకెందుకు? నేను పని చేసిన కాలానికి ధరకట్టుట యేమిటి? నా కుటుంబక్షేమానికి నా జీవితమంతాకూడా సమర్పణ చేయబడిందే కాదా!" అని అమాయకురాలగు ఆ తల్లి పలుకును. అది వినిన డాక్టరు డంబాచార్లుగారు ఆ పరమ మూఢురాలు, ఆ అక్షరపు ముక్కనైన నేర్వనియాడుది, అర్థశాస్త్రముయొక్క ఓనమాలైన రాని శుద్ధ మూర్ఖవనిత చూపిన తెలివిలేమికి వెరగుపడగలడు. కాని గృహనిర్వహణమునందు సేవాపరిపోషణధర్మము పరివ్యాప్తమై యుండును. ఆ ధర్మముయొక్క మూర్తియై యొప్పు తల్లి, తదనుసరణముగానే తన చర్యల నన్నిటిని పరిశీలించుకొనుచుండును. ఇక మన డాక్టరు పండితుడో, స్వీయపరిపోషణ పద్ధతులను, సేవాపరిపోషణ ధర్మముల స్థానమున వర్తింపజేయ జూచుచున్నాడు. అత డలవాటుపడిన తీరులవి! అతడు పని నేర్చిన ప్రయోగశాల లట్టివి! తద్వ్యతిరేక విషయములకందు సూచనగనైన తావుండదు. పరిసర విశేషముల సరకుగొనకుండ, ఒకే సూత్రము ననుసరించి అతడు విచారణ సాగించును. అట్టి మార్గానుసరణము మానసికమగు గరడీసాధనగా నెంత యుపయోగకారియైనను, విశాలవాస్తవిక ప్రపంచమునుగూర్చి తీర్పులు చెప్పు నర్హత దానివలన చేకూరజాలదు; అటుల ప్రపంచమునందు సరళపఱచబడిన కల్పితపరిస్థితులు సమకూరుట అసంభవము.

ఏలోటును లేకుండ, అత్యంత శ్రద్ధతో, సర్వాంగ సమగ్రముగా అమర్చబడి యున్న ప్రయోగశాలలో పనిచేయు పదార్థ విజ్ఞాన

శాస్త్రవేత్త, శక్తి ధర్మసూత్రముల నెన్నిని పరిశోధించును. చిన్న
చిన్న కాగితపుముక్కలు సయితము, బరువగులోహ ఖండముల
వలెనే, ఒకేగమన సూత్రానుగుణ్యముగా, రెప్పపాటుకాలములో
32 అడుగుల వంతున, ఎత్తునుండి నేలకురాలునని నిర్ణయించును.
ఆ మాట ఒప్పిదముకాదని, యేబడికుఱ్ఱవాడైనను ధిక్కరించి
పలుకజాలును! "ఏమయ్యా, ముసలాయనా! నేనుగులక రాళ్ళతో
ఆడుకొనునప్పుడు, వానినిమాయూరి నూతిలోపడవేయుచు అనేక
పర్యాయములు కనుపెట్టినాను. కాగితపుముక్కలు గూడ ఆ నూతి
లోనికి వేసిచూచినాను. గులకరాళ్ళు సరాసరి నూతిలోబడి నీటిలో
బుడుంగున మునిగిపోయేవి. కాగితపు ముక్కలో గాలిలో నెమ్మదిగ
నెగురుచుపోయి, ఒక్కొకప్పుడు బావివెలుపలికే యెగిరివచ్చేవి. నేను
ఎగురవేయు కాగితపు పతంగాలు, ఆకాశానికెగిరెగిరి, మనకు కానరా
నంత చిన్నచుక్కలై పోవునే! సీసపు పతంగాలనుచేసి అలానీవు ఎగుఱ
వేయుము చూతాము" అని హేళన సాగించును. ప్రత్యేకమగు
కల్పిత పరిస్థితులలో, గాలితీసివేసిన గాజు గొట్టాలతో, పరిశోధనలు
సలిపిన ఆశక్తిశాస్త్రవేత్త చెప్పునది వాస్తవమే. సందేహాము లేదు.
ఐనను ఆ నిష్కపట హృదయుడగు బాలుని పలుకులును బాహ్యము
నందు సంకీర్ణ పరిస్థితుల తోడనొప్పుప్రపంచమున సత్యములేయ
గును. ఇట్లు ఏసమస్యను విచారింప బూనినను వందలకొలది అను
షంగికాంశము లెన్నియో వచ్చి జొఱబడుచుండును. దేనిప్రయోజ
నము నేని నిర్ధారణ చేయవలయునన్నను, అందుకు సంబంధించిన
సూక్ష్మాంశముల నన్నింటిని విచారించినగాని నిర్ణయించుటకు
వీలు పడదు. ప్రస్ఫుటములు గాని స్వల్పాంశములే ప్రాధాన్యత
వహించి తఱచు ఎదురై నిలుచుచుండును. డబ్బువిలువవంటి సర్వసా

మాన్యమగు అంశము లే, పరిస్థితులు మారినచో, ప్రస్తావన లోనికి దీసికొనుటకు అర్హములు గానివై పోవుచుండును.

గిరాకీ సరఫరాలను నిర్ణయించునది 'గిట్టుబాటు' అనెడు త్రాసు అని అర్థశాస్త్ర నిపుణుడు వక్కాణించును. 'వస్తువునవకయైన కొలదిని, దానికిగిరాకీహెచ్చి, చాలమంది కావలయునని చాలమంది కోరుదుర''నుచునేమేమో చెప్పగలడు. సర్వసర్వత్రాయిది యథార్థమగునా? ఈవిశాల ప్రపంచములో ఆర్థికపండితునకు తావులేదు. చీరెను కొనబోయిన యువతి 'చౌకచీరెయిమ్మ'ని యడిగి కొనదు. రంగుల పొందిక, అందచందములు, మొదలగు భావములెన్నియో ఆమెదృష్టిలోనుండును. ఆభావములను తృప్తిపరచగల చీరెనే ఆమె కొనుక్కొనును. అదేతీరుగ ఒకరాకొమరుడు తనమెడముడి మాదిరి మెడముడిని (Necktie) మరెవండును ధరింపరాదను తలంపుతో, అంగడిలో చూపట్టువానిలో తనకునచ్చిన యొకానొక రకపు మెడముడులనన్నింటిని నిశ్శేషముగా కొనివేయును. ఇట్లె ఒకానొక కిరోసిన్ నూనె కంపెనివాడు బజారునకు రాదగిన అన్నిగింజల నూనెతో వెలుగగల లాంతరులను, వానినిచేయు అనన్యాధికార పత్రమును (Monopoly) లక్షలాది ధనమునొసగి కొనివేయును. తానా లాంతరును ఉపయోగించు కొనకుండనే ఒకమూల దాచిపెట్ట గలడు. ఎందులకు? అట్టి లాంతరుల అమ్మకమువలన తన కిరొసిన్ నూనె గిరాకీకి దెబ్బతగులును గనుక! ఈ తీరుగా ఆర్థిక ప్రమాణములని మనము చెప్పుకొను ధర్మసూత్రములను తారుమారు చేసివేయు విషయము లెన్నియో సంఘటిలుచుండును. కావున ఆశాస్త్ర ప్రమాణములు అప్రతిహతములుగ చెల్లునని నిర్భయముగా చాటలేముగదా!

ఏ ప్రమాణమైనను ఒకానొక పరిస్థితి కనుకూలముగా నుండిన మాత్రాన చాలదు. సర్వేసర్వత్ర ఆర్థికసూత్రముల నన్నింటిని తృప్తిపఱుపజాలి సకలపరిశోధనలకు తట్టుకొనగలదిగాను నుండవలయును. పాశ్చాత్యవేషధారణకు అభ్యాసపడిన యువకుడొకడు, గజము మూడు పావలాలకు, చౌకగా మిల్లుగుడ్డ దొరకుచున్నదిగదా యని, వాదించును. గజము రూపాయికి అమ్మి ఖాదీగుడ్డకొనుట డబ్బును దుబారా చేయుటయే యని నిర్ణయించును. సరే, యిటు చూడుడు: ఖాదీ అభిమానియగు నొక పల్లెటూరివాడు స్వయముగా ప్రత్తిని పండించుకొనును; ఆప్రత్తిని తానే కోసికొనును; దానిని గిలకబట్టి గింజలు తీయును. తీరికగా తానే నూలు వడుకుకొనును. దాపున తన గ్రామములోనే కాపురముచేయు సాలెవానిచేత గుడ్డలు నేయించుకొనును. తన గుడ్డలను తానే యుతుకుకొనును; వానిని ధరించి ఎక్కడపట్టిన నక్కడ చతికిలపడి కూర్చుండును. వాని గ్రామపు ఆర్థికప్రమాణమున నదంతయు ననుకూలమే. వీనిని హేళనచేయు పట్టణవాసి మిల్లుగుడ్డను కొనును; తన అభిరుచి కనుకూలముగా కుట్టిపెట్టు దర్జీవానికి హెచ్చుగా కూలినిచ్చి దుస్తులను సిద్ధము చేయించుకొనును; ఆరితేరిన చాకలివానిచేత తనవస్త్రములను ఇస్త్రీ చేయించుచుండును. లేదా బోలెడు డబ్బుపెట్టి కొనుక్కొనిన వాని మిల్లుగుడ్డలు పాడైపోవును. మఱియు నతడు నిశ్చింతగా నెక్కడనైనను కూర్చుండజాలడు. తన వస్త్రధారణ కనుగుణ్యముగా కూర్చుండుటకు కుర్చీలను అమర్చుకొనును. వ్రాతపనులు చేసికొనుట కనువగు బల్లలను సమకూర్చుకొనును. ఇవన్నియు చేయక తప్పదు. వాని ఈ సంకీర్ణపు టలవాటులన్నియు హెచ్చుఖర్చుల చేటే! ఇప్పుడు చెప్పండి. ఇతర సాంఘికపు చిక్కుల నట్టె యుంచుడు. గజానికి ఏ రెండుమూడణాలో హెచ్చుధరపెట్టి కొన్న

ఖద్దరు, తదనుసరణమగు జీవితపుటలవాటులను బట్టి చూడగా మొత్తముమీఁద హెచ్చువ్యయ కారణమగునని అనగలమా? అనుసరణముగా వేఱగు ఖర్చులను అవసరము లేకుండ చేయు ఒకానొక ఖర్చుపద్దుండును: అనుసరణముగా ఇతరములగు ఖర్చులను తప్పక అవసరము చేయు వేఱొక పద్దుండును. కేవలము ఈరెండు పద్దులను మాత్రము విచారణలోనికి దీసికొని, వానికి గల వ్యత్యాసమును తెల్పుట పొరబాటగును. ఒక రత్నముయొక్క విలువ, అది ప్రత్యేకముగా నున్నప్పటికంటె దానినొక నగలో పొదిగినప్పటి స్థితిలో చాల హెచ్చగును గదా! అటులనే ఒక్కొక్క తీరుపరిరక్షణ విధానమును పరిశీలించునప్పుడు, దాని ననుసరించి సంఘటనమగు విషయముల నన్నిటినికూడ విచారణలోనికి తీసికొనకతప్పదు.

ఇంతవరకును వస్తువినియోగదారుని పక్షము ననుసరించి, అనగా వస్తువును వాడుకొనువాని దృష్టి ననుసరించిమాత్రమే, వస్తుమూల్యమును నిర్ణయించు తీరును గమనించితిమి.

"ఈ యంత్రయుగములో, కుటీరపరిశ్రమలు బ్రతుకగలవా?" అనుచు శంకించువారిని తరచుగా చూచుచుందుము. ఈ సమస్యయొక్క సంపూర్ణ వివరణకు ముందు పూననుంటిమిగాన ఇచ్చట కొంతవఱకు ఆపియుంచెదము. "కుటీర పరిశ్రమల" సమస్య కేవలము వస్తునిర్మాణవిధాన సమస్యమాత్రమే యనుటకు వీలు లేదు. అదొకరీతి పరిపోషణ విధానమునకు చిహ్నమును, ప్రధానాంశమునై యున్నది. అటులనే "భారీయెత్తు వస్తూత్పత్తి" నిమరొకరీతి పరిపోషణకు చిహ్నమగును. ఇప్పుడు మనము విశదీకరింపవలసిన సమస్య ఇది: మనకు అనుకూలించు పరిపోషణవిధాన మేది? మన జీవిత లక్ష్యములపై నాధారపడి సాగింపదగిన తీరేది? ఇప్పుడు మన జీవిత ప్రయోజనప్రమాణము లెటువంటివో తేల్చుకొనవలయునను ఓ పర్యవ

సానము. కాబట్టి “ అభ్యుదయ ” మనెడు రథమును లాగుటకు “మూల్యములు” “మూల్యనిర్ణయము” అనెడు రెండును రెండు గుఱ్ఱాలనవచ్చును. తుది పరిశీలనమునందు, శాశ్వతత్వము, అహింస అను వాని వైపునకా ? లేక తాత్కాలికము, హింస అనుదాని వైపునకా మనపోకడ ? ” యను విషయమును తేల్చునది ఈ ప్రశ్నయే. కాబట్టి ఈ రెండంశములను గురించిన మన నిర్ణయము అసందిగ్ధముగా తేలిపోవలయును. మన ప్రమాణములనుగురించి గాని, మన లక్ష్యార్థమును గురించిగాని యేమాత్రము పొరబడినను వినాశము చేకురగలదు.

తిరువాన్మూరులో మొగలిఆకు చీలికలతో చక్కని మెత్తని చాపలను తయారు చేయుదురు. ఆ ప్రాంతమువారు విడివిడిగా ప్రత్యేకము స్వంతభూములలో కుటీరములు నిర్మించుకొని నివసింతురు. ఆ కుటీరములచుట్టు కొంత ఆవరణ యుండును. ఆ ఆవరణచుట్టును మొగలిచెట్లనువేసి పెంచుదురు. ఆ ప్రాంతమున నే సంచారము చేయుచుండిన సమయమున ఈచాపల నెట్లు సిద్ధము చేయుదురో చూడబోతిమి. ఒక ముసల్మాను ఆ గ్రామములోని కెల్ల చాపల నల్లుటలో దిట్టయట. ఆతడు మాకడకు వచ్చి, స్త్రీలు, పురుషులు, పిల్లలు ఆ చాపలల్లుటలో నెట్టుల సహకరించుకొనుచు పనిచేయుదురో వివరించి చెప్పసాగెను. దాపుననున్న నాలుగైదుయిండ్లకు మమ్మును దోడ్కొనిపోయి అక్కడ పనులుజేయువారిని జూపినాడు. అతడు మాతోడ నున్నంతకాలము, “ అయ్యా, మా తండ్రులు మా తాతలు ఈవృత్తినే జేయుచుండెడివారు. వారు దారిద్ర్య మెరుగరు. ఆలా చూడుడు. అలాంటి రెండుమూడంతస్థుల మేడలను గట్టుకొనిరి. సుఖపడిరి. వారి సంతానమైన ఆ వృత్తినే చేసేవారమగు మేమో ఆమేడలు కూలిపోవుచుండ వానికి మరమ్మతులు

చేసికొని నిలుపుకోజాలకున్నాము," అని మఱల మఱల ప్రశ్నింప సాగినాడు. మేమక్కడ చూడవలసినదెల్ల చూచితిమి. మధ్యాహ్న మైనది. తనయింట ఆతిథ్యము తీసికోవలెనని ఆ పురుషుడు మమ్ము బ్రతిమాలసాగినాడు. నాతోడ యిరువురు బ్రాహ్మణమిత్రు లుండిరి, వారేమందురో యని యడిగితిని. అతడిచ్చు ఆహారము కేవలము శాకాహారమగుచో తమ కభ్యంతరము లేదనిరి. మావెంట వచ్చిన పురుషునితో ఆవిషయము చెప్పగా, తనకు మాంసాశనముమీద ప్రీతియే యైనను వాని దారిద్ర్యమువలన అది లభ్యమే కాదనియు, విధిగా శాకాహారిగా మారవలసినవా డయ్యెననియు తెలిపినాడు. మఱియు మా దర్శనము ఆకస్మికమైనదయు, ముందుగా తెలిసి యేర్పాటు చేయబడినది కాదుగావున, తమ కుటుంబమునకై వా రేమి చేసికొనినారో దానిని మాత్రమే సమర్పించుకొందునని ఆతడు చెప్పెను. ఆతడు మాకు పెట్టగలది కొంచెము అన్నము, పప్పు, పచ్చళ్ళు మాత్రమేనని ముందుగా హెచ్చరించినాడు. ఆపాటి తిం డిని మేము తన యింటికడ నారగించునెడల మహానందము పొంద గలనన్నాఁడు. అతడట్లు బ్రతిమాలుట చూచి, అప్పుడు మాకంతగా ఆహారము అవసరము లేకున్నను, వాని కుటుంబము వా రెట్లు జీవిం తురో స్వయముగ కనిపెట్టు కోరికతో వాని యాహ్వానమునకు సమ్మ తించి వాని కుటీరమున కేగితిమి. మేము కాలుసేతులు కడుగుకొను చుండగా, మేము భోజనమునకై కూర్చుండుటకుగాను వసారా యూడ్చి శుభ్రపఱచినాడు. అంతసేపును తమవృత్తి నాశమగుట కేమి హేతువని అతడడుగుచునే యుండెను. ఏమి సమాధానము చెప్పుటయా యని నా బుఱ్ఱలో, నాలో నేనాలోచించుచుంటిని. ఇం తలో "దయచేయుడు, వచ్చికూర్చుండుడ" ని ఆతడు మమ్ము పిలిచినాడు, అతిథులలో నన్ను ప్రధానునిగ నెంచి, నాకు మధ్యస్థల

మును, నామిత్రుల కిరువురకును నాకిరుప్రక్కల ఆసనములను జూపినాడు. ఆయిరువుర కొఱకు మొగలియాకుల చాపలను వేసియున్నాడు. అగ్రగణ్యుడనగు నాకమర్చిన ఆసనమును చూపగానే, "మీవృత్తి యెందుకు క్షీణగతికి వచ్చెనో నాకిప్పుడు తెలిసినది. మీ రవలంబించు గౌరవ ప్రమాణమునందే ఆ దోషమున్నది." అంటిని. ఆమాటలను విశదముగా తెలుపుడని అతడు పట్టుపట్టెను.

"నామిత్రులకై వేసిన ఆసనముల నెక్కడనుండి తెచ్చితి" వంటిని.

"అవి యీదీనుడు, స్వయముగా, ఈ చేతులతో అల్లిన మచ్చు చాపలే" అన్నాడు.

"నాకొఱకై పఱచిన యదెక్కడిది? దీనిపైన పెద్దపులిబొమ్మ ముద్రించియున్నది!" అంటిని.

"అది జపాను చాపండి; బజారులో కొన్నాను." అని పలికినాడు. అంత నేనిటుల వివరించిచెప్పితిని. "ఈ అతిధులలో నన్ను ప్రధానునిగ నెంచి నన్నీ జపాను చాపమీద కూర్చుండ బెట్టుటతో హెచ్చుగ గౌరవింపజూచితివి. నాయిరువురు మిత్రులను నీచేతితో నల్లిన చాపలమీద కూర్చుండుడంటివి. అందువలన నీవు నీచేతితో తయారు చేసిన చాపకంటె జపానుచాపను హెచ్చువిలువ గల దానినిగా గణనచేసితివి. నీవే యిటుల చేయుచు, అదేతీరుగా యితరులు చేయుదురని మొఱలిడుదువేల? ఇతరులనేకులు నీపద్ధతినే అవలంబించి, విలాతివస్తువులను కొనుచున్నారు. స్థానికముగా మీరు తయారు చేసిన మొగలిచాపలను కొనుట మానుచున్నారు. పూర్వము మీదగ్గఱ చాపలను గొనుచుండినవారి బేరము అంతరించినది. ఇక మీవృత్తివృద్ధిలో నెట్లుండగలదు? మీవృత్తిని నాశము చేయుటలో ముఖ్యముగా మీదోషము కాదా?

చేతులు రెండును జోడించి, అతడునాతర్కము నంగీకరించినాడు. వెంటనే ఆజపానుచాపను తొలగించివేసి, తానుసిద్ధము చేసినచాపను దెచ్చి పఱచినాడు.

మనదేశమందెల్లెడల నేమిజరుగుచున్నదో తెలుపుబొమ్మ యిది. వస్తువులనాణ్యమును నిర్ణయించు పట్లమనము వినియోగించు ప్రమాణములందు వివేకము శూన్యమగుచున్నది. మనము వస్తువుల కొనుగ్గోనుటలో దీర్ఘదృష్టిని పోనాడుకొని, మనఆర్థిక సాంఘిక సంస్థలను విచ్ఛిన్నముచేసి నేలగూల్చుచున్నాము. తఱచుగా డబ్బుధరలో చౌకగాదొరకుననుదృష్టిలోపడి పోవుచున్నాము. కాని డబ్బుధరలో చూపట్టని మూల్యములు, నాణ్యములు, ఎన్నియో మనయిరుగు పొరుగువారిచే తయారుచేయబడు సరకునందు లయించి యుండును. మనము పాటింపదగిన విషయము లన్నిటిలో, అనేక సందర్భములందు, డబ్బుధర కనిష్టమైనదిసుడీ! కాని దురదృష్టవశమున మనము చేయు నిర్ణయములలో అట్టి డబ్బుధరనే ప్రధానముగా చూచుచున్నాము. కేవలము డబ్బును పాటించుట, మనసాంఘికవ్యవస్థను భగ్నము చేయుటకు మూలమగుచున్నది. ఎల్లెడల వినాశమును చేకూర్చి, సర్వత్ర ముప్పువాటిల చేయుచున్నది. డబ్బు విలువ, సంఘక్షేమమును చూడనీక మనదూరదృష్టిని మూసిపెట్టుచున్నది. గొడ్డలి చేబూని తానాధారముగ గొని నిలుచున్న కొమ్మను తా నెనఱుకుకొను మూర్ఖుని చేష్టను బోలుచున్న దీపని. తనపతనమునకును, తననాశనమునకును హేతుభూతమగు కార్యములనతడు బలపఱచిన వాడగుచున్నాడు. నిరాఘాటముగసాగు దీర్ఘకాల ప్రణాళిక, శాశ్వత పరిపోషణను ధృవపఱచును; ఏసమస్యయొక్కయేని సద్యస్కాల పరిష్కారమునేగాక, దాని ననుసరించి దీర్ఘకాలమునకు చేకూరు స్థిరతరఫలితార్థములను సయితము ధృఢపఱచును. ఏ

ప్రత్యేక వ్యక్తియొక్క యేచర్యయైనను, ప్రత్యేకమగు నొకానొక వ్యవహారముతో ముగిసిపోజాలదు. ఆనుషంగికముగ ఘటిల్లనున్న ప్రతిఫల పరంపరను కనిపెట్టజాలు దృష్టి మనలో పెక్కండ్రకు కొరవడిపోయియున్నది. మనకుతగిన శిక్షణము శూన్యముగ నున్నది. ఈ లోపముయొక్క ప్రతీఘాతము, లేక ప్రతీకారము, సమాజమునంతటికిని సంక్రమించు చున్నది. ఒకానొక సహకారసంఘపు కార్యదర్శి తమ సంఘసభ్యులు సిద్ధముచేసిన తేనెను అమ్మిపెట్టు వ్యాపారము వలన, ఆసంఘసభ్యులకు చేకూరుచున్న లాభములను పేర్కొనసాగెను, ఆయన నన్ను తోడ్కొనిపోయి ప్రాతమట్టి కుండలతో తయారు చేసిన అతిసరళముగా గోచరించు, తేనెపట్టులను, వాని యందలి ముప్పదితేనెటీగ సముదాయములను, వానిని పెంచు ఆరామవిశేషములను, చూపియున్నాడు. ఆ మధుపములు చాల చురుకైనవిగ గోచరించినవి. ఆరామాధిపతి వందలకొలది పౌనుల తేనెను అమ్మకమునకై ఆ సహకారసంఘమునకు పంపుచుండును. ఈ కార్యక్రమకథ నంతటిని ఆలకించి చాల అబ్బురపడితిని. మంచిసంపాదనమే చేకూరుచుండెగదా యని మెచ్చుకొనుచుంటిని. ఆ తరుణమున ఒక బాలిక, ఆరామాధికారి కూతురు, పరువులుపెట్టుచు వచ్చినది. ఆ యీగ గములన్నియు అంత చురుకుగా పనిచేసి నిర్వహించు కార్యమేమిటని నేనామెనడిగితిని. అవి తేనెను తయారుచేయు చున్నవని చెప్పినదా బాలిక. "నీకు తేనెత్రాగుట ఇష్టమేనా?" అని ప్రశ్నించితిని. ఆమె తెల్లమొగము వేసినది. ఆమెకు నాప్రశ్న అర్థము కాలేదని తలంచి, ఇంకొక విధముగా "నీకు తేనెరుచి గిట్టదా?" అంటిని. ఆ బాలిక "దానిరుచి యెట్లుండునో నే నెఱుగను" అనుట విని వెఱగుపడిపోతిని. అంతట ఆరామాధిపతి వైపు తిరిగి అతడు తన బిడ్డలను తేనె త్రాగనీయడాయని విచారించితిని. తాను కడు నిరా

పేక్షణీయమగు జవాబు చెప్పుచున్నట్లెంచి, "సంఘానికి పౌను తేనెను పంపినచో నాకు రూపాయి వచ్చును. అట్టియెడ మా ఇంటిలో తేనె నెట్లుపయోగించు కొనగలమ"ని అన్నాడు. నా మెచ్చుకోలంతయు నిమిషములో ఎగిరిపోయినది. అంతట సహకారసంఘ కార్యదర్శితో 'ఆబిడ్డకు తేనెరుచియే తెలియదనినప్పుడు, మీకార్యనిర్వహణమంతయు దోషభూయిష్ఠమైపోయినది. హెచ్చుధర ఇచ్చి, ప్రలోభపెట్టి, కటా! ఈ బిడ్డ నోటికడనుండి తేనె నపహరించివేసి, నానా రుచులతో గూడిన తిండ్లను అధికముగ మెక్కు డబ్బు దొరలకొరకై పంపుచుంటిరా?" అంటిని.

సర్వత్ర ఇట్లే జరుగుచున్నది. గ్రుడ్లు, పాలు తదితరములగు పుష్టికర ఆహారపదార్థముల సందర్భమునను జరిగెడి దిదియే. పూర్వము గ్రుడ్లు విరివిగా దొరకుచు, స్థానికముగ హెచ్చుగా నుపయోగపడుచుండిన వాయవ్యరాష్ట్రమందు రావల్పిండి, క్వెట్టా, అంబాలాల మిలిటరీ అధికారులు ఈవస్తువుల సరఫరానంతను ఆకర్షించివేయసాగిరి. కావున స్థానిక ప్రజలీ పదార్థముల వినియోగించుట చాల తగ్గిపోయినది.

గ్రామములలో విరివిగా పాలుకొఱకును ఐననేమి అచ్చటి బిడ్డల కీపుష్టికరాహారము కఱవే! అదంతయు పట్టణములకు రవాణా చేయబడి, అక్కడ అమ్మబడు బోవుచున్నది.

ఉన్నత భావసరణిని హెచ్చుగ మెచ్చుకోగల సహజబుద్ధిని, డబ్బువిలువ వచ్చిపడి వమ్ముజేసివేసినది. అందువలన ఒకపక్షము వారికి లాభమును వేఱొకపక్షము వారికి అనివార్యముగ నష్టము చేకూరును. (లోగడ అధ్యాయమునందు, జిలేబీలబాలకుని కథనము నందువలె) అధికమై మిగులు ద్రవ్యములతోడి వ్యాపారమునకు మారుగా ప్రాణావసరములగు వస్తువుల అధికవ్యయమునకే తోడ్ప

డును. తాత్కాలికముగా నిదిస్పష్టపడకున్నను, గొప్ప సాంఘికోపద్రవమునకు మూలమగును. 1943 సంవత్సరమునాటి బెంగాలు కఱవునకు మూలము డబ్బుసంబంధమైన తిరుగుడులే! తిండిలేక డొక్కలు మాడుచున్న ప్రజల నోటికడనుండి ప్రాణాధార ద్రవ్యములను పడ లాగివేసినది అదియే. లండనులో (వ్యాపారమున వినియోగపడక) బిగిసిపోయి పడియుండి ధనరూపప్రతిష్ఠకు చిహ్న మాత్రమైన పనికి మాలిన కాగితపునోట్లను గుట్టుగ మనమొగాన పడవేసినారు. కాని లాభమేమి? ఆ మహూపద్రవమునుగూర్చి గాఢముగ విచారణ చేసి, అందుండి నేర్చుకోదగిన నీతిని గ్రహింతుము గాక. వస్తుమూల్యమునకు డబ్బును ప్రమాణముగా దీసికొనుటకంటె, నరజీవితములో ప్రాణతుల్యములగు విషయములెన్నియో యితరమగునవి కలవని జ్ఞప్తి నుంచుకొందుముగాక.

అధ్యాయము 10.

జీవము, జీవనము, ఉనికి.

బ్రతుకున కేమేని ప్రాధాన్యత గలదా? దాని కేమైన అర్థమున్నదా? దాని ప్రధానాంశము లేవి?— లేక కేవలము ఉనికి యేనా బ్రతుకంటే?

మానవునకు స్వేచ్ఛ (స్వతంత్రేచ్ఛ) యుండుటనుబట్టి, యతడు తక్కిన జంతుకోటికన్న భిన్నమైనవాడని గ్రహించియుంటిమి. కాబట్టి నరుడు పాటించు మూల్యముల ప్రమాణమునకు చిహ్నమగు 'ఇచ్ఛను' అతడు వినియోగించుకొను విధము ననుసరించి, అతడెటువంటివాడో వెల్లడియగుచుండును. ఇట్లు విచారించునెడల, మానవుడు తానెట్టివాడుగా సంకల్పించికొనునో అట్టివాడై పోగలడు; మానవుడు తన జీవనపద్ధతి ననుసరించి తనలోని శక్తులను ప్రకటింపగలడు; దాని ఫలితార్థమే వాని వ్యక్తిత్వము" అందుము. మానవుడు పరిణతి పొందుటకు, వాని జీవనమొక సాధనము. వాని కల్పనా సామర్థ్యము ద్వారమున తానెట్టివాడో ప్రకటించుకొనుటకవకాశమిచ్చునది వాని జీవితమే. కావుననే జనులెటుల జీవింతురో లేక జీవింపవలయునో అనువిషయమున కంత ప్రాధాన్యత గల్గుచున్నది.

ఇక జీవనమనగా (పటమును చిత్రించుట కుపయోగపడు) వస్త్రమనవచ్చును. చిత్రకారుడగు మనుజుడు, తన వివిధప్రయోజనములనెడు రంగుభరిణలతో, స్వేచ్ఛయనెడు కుంచెయొక్క సునిశ్చితములగు వ్రాతలతో, సువిదితమగు తన జీవితచిత్రమును రచించుకొనును. మానవాభ్యుదయమును ముందుకు నెట్టుటకుగాని, వెనుకకు లాగుటకుగాని, తన యనంతరమును వినియోగపడునటుల దాని నతడు విడిచిపోగల్గును. కాలగతి ననుసరించి మసకవారిపోగల్గునట్టి

గాని, లేక తుడిచివేయబడునట్టిగాని, స్వార్థప్రయోజనము లనెడు నీటిరంగులను హెచ్చుగ గలిపి, రచన సాగించునెడల, వాని చిత్ర రచన శాశ్వతమై వెలయగల హెచ్చునాణ్యమును నందుకొనలేక పోవును; మరియు హింసకు పాల్పడి వికారరూపము నొందును. అటులగాక, అజంతాగుహాలందువలె, శతాబ్దులు గడచిపోయినను, నిగ్గుగోల్పోవని మట్టిరంగులబోలు లోకోపకారకములు, లేక సార్థకములునగు ప్రయోజనములను హెచ్చుగ వినియోగించునెడల, శాశ్వతత్వమును అహింసను చాటు సందేశముతో తన యసమాన దివ్యరచనను, తరతరములవారికి పిత్రార్జితముగ సంక్రమింపచేసినవాడగును.

మానవునకు అట్టి అవకాశమును, బాధ్యతయు నుండుటంబట్టి అతడు తన జీవితమును ఇతరులచేతిలో అధీనుడై విడిచివేయ దగదు. ప్రతి మానవుని మీదను వాని జీవితవైఖరింగూర్చిన బాధ్యతగలదు. అతడు తన శ్రేష్ఠతమ చిత్రరచనను, చట్టము మొదలగునవన్నియు తగిలించి సిద్ధముగా పరివారలచేత బజారులో అమ్మకమునకు పెట్టబడు చౌకరకపు రంగుబొమ్మలకు బదులుగా నిచ్చివేయజాలడు.

ఈనాడు, అధికోత్పత్తిచేయు పరిశ్రమల విశిష్టప్రమాణ బద్ధమైన సరకులు మనుజులెటుల జీవించవలయునో దాదాపుగ తామేనిర్ణయము చేసివేయుచున్నవి. తమకు సరఫరాకావలసిన మాదిరి సరకుల తీరును వినియోగదారులు నిర్ణయించుటలేదు. అందుకు మారుగా, ఉత్పత్తిదారులు తాముచేసిన సరకునంతను విచక్షణాశూన్యులగు ప్రజలమీద పడవేయుచున్నారు. కాన మనము మెలకువతో వివేకముగలిగి వర్తింప వలసియున్నది.

ఈ తరము వారినెత్తిన బడవేయబడిన ప్రపంచ సంగ్రామములు రెండును; ఆధునికసంస్థలయొక్కయు, వ్యవస్థలయొక్కయు వినాశ

కర నైజమునకు ప్రబల నిదర్శనము లయినవి. స్వభావము చేతనే సార్థకమును, నిర్మాణసమర్థమునై వెలయవలసిన విజ్ఞానశాస్త్రము సయితము కడు హేయమగు నిర్మూలన యంత్రముగ, నింద్యతర ప్రయోజనములకే వినియోగింపబడు చున్నది. శాశ్వతాహింసా శైలముపై ధీరులై నిలుచుటకు మారుగా, మహామేధావులగు శాస్త్ర వేత్తలును మానవాభ్యుదయము, ఉత్తమ సంస్కృతియనెడు సుక్షేత్రములమీద వరదలై పాఱుచు కొట్టుకొనిపోవు మృత్యువినాశములనెడు జలప్రవాహము లోని సుడిగుండములందు జిక్కుకొనుచున్నారు. అట్లయ్యును వారు నిర్విచారముగా, మేముఉదాసీనులమై వర్తించు చున్నామని వాకొందురు. అదివట్టి ఆత్మవంచన. ఉదాసీనతయనునది యే యెడను నుండజాలదు. మనము నిర్మాణాభిముఖముగనైనను నడువవలయును. లేదా నిర్మూలనాభి ముఖముగ నైనను నడువవలయును. నేటి శాస్త్ర పరిశోధకులో, ఐచ్ఛికముగా నిర్మూలపథము నవలంభించి యున్నారు. కావుననే అంతటి బహుళవినాశము ఘటిల్లనైనది.

దాని వలన మూడిన భౌతికవినాశము చాలగొప్పదే; కాని సంగ్రామముల వలని ఘోరానర్థములలో నది అత్యంతము అల్పాంశమే. అన్నింటను మిక్కిలి శోచనీయాంశమేదన, భవిష్యదభ్యుదయమున కాధార భూతులగు యువక జనప్రాణములు పునరలభ్యముగ నశించెగదా! పులియొకటి మహావిజ్ఞానశాస్త్రజ్ఞుని చంపెనను కొనుడు. అప్పుడుదానికి దొరకినలాభమును, మానవాళికి వాటిలిన నష్టమును పోల్చిచూడుడు. ఆ నరాశనికి లభించినది బహుళః నూటయిరువది పౌనులుతూగు మాంసము,రక్తము ఎముకలునే, పుష్టిరూపమున శాకాహారమువలన కూడ సమమగు మూల్యమును సమకూర్చిపెట్టవచ్చును; కాని, పులిజీర్ణకోశము అందుకు అనుకూలించునదిగా నుండదు. ఇకమానవ సమాజమునకు ఘటిల్లిన నష్టమో, ఇంత

మాంసము, ఇంతరక్తము మాత్రమే అనలేము. ఆయాజన్మకర్మల భిన్నదశలందు వికాసము పొందుచు వచ్చిన, అనేక తరతరాంతరముల సంస్కృతికి ఫలితార్థమగు నుత్తమ విజ్ఞానరాశి! ఈవిజ్ఞాన రాశి ఆ పులికి ప్రయోజనకారి కాదు; మానవకోటికో, పునరలభ్యమైన ఘననిధి. పరమోత్తమమును, అగణితమునై, శాశ్వతాభ్యుదయకరమునై విలసిల్లు నంశము పరాన్నజీవియగుపులివలన భగ్నమైనది; పులికి చేకూరిన లాభమూ, క్షణభంగురమైనదే. చిరతర పారంపర్యక్రమలబ్ధమైవచ్చి, భావిని వంశపారంపర్యముగ సార్వకాలము వర్ధిలగల విజ్ఞాననిధి విధ్వంసమైపోవ, ఆ నష్టమువలన కొలదిపాటి రక్తము కొలదిపాటి మాంసము పులియొక్క ఆకలిని కొలది గంటలసేపు మాత్ర ముపశమింప చేయగల్గినది. అంతే. ఆ శాస్త్రజ్ఞుని యుత్కృష్ట జీవనము, విజ్ఞాన ప్రదమై నిర్మాణసమర్థమై, ప్రేమమయమై వెలయగలది, ఆఘాతుకమృగమునకును సమముగ ప్రయోజనకారి కా లేదుగదా!

అదేతీరున, ఈ యుద్ధములో బలియైన కోట్లాది మానవుల విధ్వంసనమువలని నష్టమును, మానవోద్యోగరూపమున నింత తరిగెనని లెక్క వేయజాలము. అటువంటి సర్వవినాశంకర కార్యములవలన మానవాభ్యుదయ సంస్కృతుల (గడియారపు) నడకను ఎన్ని శతాబ్దులో వెనుకకు నెట్టివేసినటులయినది.

మఱియు, ఏ యుద్యాన కృషికుడైనను, వంటకట్టెలకని, తనకు మంచిమంచి పండ్లనిచ్చు అంటుమామిడిచెట్టును నఱికి వేయునా? కాని మానవుడు మూర్ఖుడై తనసంతానమును శతఘ్నుల నోట కటా! బలిపెట్టి, గర్వించుచున్నాడు కూడను! హింసను మహిమపఱచు విషమస్త్ర ప్రచారము ఎంత పటిష్ఠముగ నున్నదో!

ఈసందర్భమున ప్రస్తావన వశాత్తు, మతవిషయములను, కారుణ్య భావమును, హింసా అహింసా చర్చలను నొక ప్రక్క నుంచినను గూడ, పై రీతిని వివక్షించుచో ఆహారమునకై జంతువధలు చేయుటయు, దూష్యమని తేలును. మాంసభక్షకునకు కొంత మాంసము లభించుననుమాట వాస్తవమే. వానికి లభించు పుష్టిని ఇతరవిధముల పూర్తిగావించుకొనుట కవకాశములు గలవు. స్వభావసిద్ధమగు జీవన వికాసము భగ్నపడునెడ ప్రకృతిపొందు నష్టమెంతయో చూడుడు. పక్షుల మనోహరరుతములు సమసిపోవును. జీవజంతువుల సహజ ప్రేమ భంగపడుచున్నది. నరజీవనమున అరుదుగా గోచరించునట్టి విచిత్రశక్తుల నివి యెంతగనో మించి యొప్పుచుండునుగదా. మానవునిలోని కల్పనాచాతుర్యముయొక్క చర్యలును వానితోపాటుగ భ్రష్టమగును. ఇవన్నియు పునః అలభ్యము లేగదా? కాబట్టి మాంసాశనము, క్షణభంగురమగు పరాన్నభోజనపరిపోషణజాతికి చెందినదై హింసాకర వినాశహేతువగుచున్న దనవలయును. ఇట్టి తిండిపోతుతనము ప్రకృతిలో క్షుద్రాతిక్షుద్రము! ఇసుమంతేనియు నిది మాననీయము కాజాలదుగదా!

మానవుని కల్పనాచాతుర్యమును ప్రత్యేకముగ దృష్టిలో నిడుకొని పరిపోషణ పంచకమునకు ఈ జీవనరీతుల ననువర్తింపజేసి చూతముగాక.

పరాన్నపరిపోషణము — అనుకరణ ధామముగా పరిణమించును.

స్తేయపరిపోషణము—పరావలంబన ధామముగా పరిణమించును.

సాహసపరిపోషణము—భౌతికసృష్టి ధామముగా పరిణమించును.

సమూహపరిపోషణము—సాంఘికాచార ధామముగా పరిణమించును.

సేవాపరిపోషణము—దివ్యధామముగా పరిణమించును.

అనుకరణధామము : ఈవర్గమున జేరునరులు, తా మితరుల కేలాటి యుపకృతిని చేకూర్పకుండ, తమ అనుకరణ శీలము మూలమున ఇతరులు సృష్టిగావించు వానిలో తమ కలవియగు దాని నెల్ల సంగ్రహింతురు. వారి జీవనలక్ష్యము ప్రధానముగా స్వార్థప్రేమ. సులభతమ మార్గమున స్వీయసౌఖ్యమును సాధించుకొన జూతురు. పర్యవసానమునకు వారన్యుల జీవనముపై నాధారపడి బ్రతుకుదురు, వారిది పరచింతా శూన్యమగు ఉనికిమాత్రము; వెన్నెలకు వాడి పోవుదురు. జీవచ్ఛవాకృతి నుందురు. ఇక వారియందు ప్రతిభయేమేని కలదందురూ, అదిపరజన సామర్థ్యముయొక్క ప్రతిబింబ మనదగును. వారిస్వీయ వ్యక్తిత్వమెయ్యెడను కానరాదు. వారివలన ప్రత్యేకముగా నేర్వగలదేమియు నుండదు. వారు సంకరజాతి జీవియగు కంచరగాడిదను బోలువారు. అది వారిదోషము కాకపోవచ్చును. కంచరగాడిద సంతానసృష్టికి పనికిరాదు; గొడ్డుమోతుజీవి తన బోలువానినేని కల్పనచేయ జాలదు సంతానమనునది లేకుండ జీవించిచచ్చును. అదేవిధముగా, అనుకరణ శీలురందు కల్పనా చాతుర్యము గోచరింపదు. ఏ కొంచెముగనో యున్నను అది నిద్రాణావస్థలోనే పడియుండును. అది ప్రకాశమునకు వచ్చుటకుగాని, పరిణతి పొందుటకుగాని అవకాశములు శూన్యము. అటువంటి వారి పరిసరదశలను మార్పుచేసినయెడల, సమాజముయొక్క సామాన్యాభివృద్ధికి వారొకింత సాయపడుట సంభవముకానోపునేమొ. కాని వారు నిరర్థకులయ్యె పడియుండ, అట్టిమూకవలన సంఘమునకు తప్పక నష్టమేవాటిలు ననవలయును. ఉత్పత్తియనునది చేయకుండ ఉన్నదానిని వారు తిని వేయుదురు. వారి జీవితములందు శిల్పశోభయే మాత్రము గోచరింపదు. అచ్చుకూటముల నుండి, రంగులతోడి

యందచందములు లేకుండ, నెలుపు నలుపు ఛాయలతో ముద్రించి పడవేయబడు బొమ్మల తీరున వారుందురు.

ఈ శతాబ్దారంభ కాలమున, పాశ్చాత్యుల నుండి ప్రతియంశమును అనుకరింపసాగిన జపానీయులు ఈ వర్గములోనివారే. వారు తమ సమీపవాసులగు చీనావారితోడను, భారతీయులతోడను సంసర్గము కలిగి జీవించిన కాలమునాటి శాశ్వతపరిపోషణము నుండి తొలగి అనుకరణధామమున బడిపోయిరి. చీనాలోనికిని, మంచూరియాలోనికిని, వారుగావించిన దాడులను గమనించిన యెడల, వారనివార్యముగా పరాన్నపరిపోషణ విధానములోనికి జారిపోయిరని నేడు స్పష్టముగా తెలియగలదు. అహింసాధర్మగాములగుట మానివేసి, హింసను విధ్వంసనమును తమ ధామమున ప్రతిష్ఠించుకొనిరి.

మనదేశములోని మనమిత్రులనేకులు, ముఖ్యముగా భారతీయ క్రైస్తవులు ఈవర్గమున చేరుదురు. (నేనేసంఘమువాడనో, ఆసంఘము గురించి లజ్జాభిమానపీడితుడ నగుచు వ్రాయుచున్నాడను.) తమ మాతృభాషను సయితము పోనాడుకొని, ఆంగ్లభాషా వ్యామోహమున జిక్కుకొనునంతగా, సర్వవిధముల వీరు పాశ్చాత్యుల ననుకరించుచున్నారు. వీరు పాశ్చాత్యులవలె వస్త్రధారణ సేతురు. చేతనగునంతవరకు తమ గృహములను మిషనరీల శక్తిని అమర్చుదురు. సంపదలు గలవారగుచో, పాశ్చాత్యదేశములనుండి దిగుమతియైన తినుబండారపు డబ్బాలను సయితము ఆశ్రయించి తమ ఆహార సందర్భమునను, పరావలంబనము చేయుదురు. వినోదములకొఱకై పాశ్చాత్యుల కులుకులకు ముఱిసిపోయి "గానోప గూహానముల" నం బఱచు నాట్యమందిరములను గుఱ్ఱపుపందెములను మిగుల మక్కువతో ఆశ్రయించుచున్నారు. ఈవర్గమువారిలో పెక్కండ్రు వివిధ విద్య

లందును లలితకళలందును పట్టభద్రులై, గర్వముబూనగల్గువారైనను కూడ, బుద్ధివికాసమున వంధ్యత్వమే వారి తలవ్రాతగ నున్నది. దుర దృష్టవశాత్తు, నికృష్టపరావలంబనదశ యనందగు నీస్థితికే మన నగర వాసులు వర్ధిలుచున్నారు. కాని వారిసంఖ్య అత్యల్పముగనున్నం దున నూరటపడగలము. ఈ పతనచర్య ఇంకను వ్యాప్తము కాకుండ సకాలమున నాపుటకై శ్రద్ధ దీసికొందుమేని, ఈ యాచారమును సమూలముగా తొలగింప గల్గుదుము.

అవలంబనధామము:— ఈ వర్గమునకు జెందినవారి ఆదర్శవాక్యము "ఇప్పుడే తినుదము, త్రాగుదము, తందనాలాడుదము. రేపు చత్తుముగదా" అనునది వీరును, అనుకరణధామవర్గమును బోలి, యితరులవలన పరిగ్రహణము చేయుచుందురు. కాని కొంత భేద ముండును. వీరితరులు సృష్టిచేసిన వానిలో కొలది మార్పులుచేసి అవలంబింతురు. ఈమార్పులు చేసినంతమాత్రాన, వానిని తమ రచనలని చెప్పుకొనజాలునంత విశిష్టత కాన్పించదు.

అన్యులు స్వయముగ కల్పనచేసి దారిచూపినవానిని అవలంబ నముచేయ జూచువారికి మంచి నిదర్శనముగా, ఈకాలపు జపాను వారిని చెప్పుకోదగును. వారు ముందుగా పాశ్చాత్యులనుండి గ్రహించినవానిని, తమ దేశస్థితి కనుగుణముగా మార్పుచేసికొనిరి. ఎట్లన పాశ్చాత్యుల అధికోత్పత్తి విధానమును వీరవలంబించిరి; కాని అలవిగాని పాశ్చాత్యుల కేంద్రీకృత కర్మాగారములను చిన్నచిన్న కుటీరపరిశ్రమాలయములుగవిడదీసిరి. అందందుతయారైన ఆయావస్తు భాగములను ప్రోవుచేసి, యొక కేంద్ర కర్మాగారము నందు పూర్ణ వస్తువుగ కూర్పుచేయుదురు. ఒక ఉదహారణ చూతుడు: ఇంగ్లాం డులో బి. యస్. యే. కంపెనీవారి యొక్కొక్క కర్మాగారము


నందును బైసికిళ్ళపూర్తి నిర్మాణము జరుగుచున్నది. జపానులోనో కుటీరపరిశ్రమల నేర్పాటుచేసిరి; అచ్చటి పనివారలకు పనిముట్లను మూలపదార్థములను సమకూర్చి పెట్టుదురు. వారిచే వేర్వేఱు వస్తు భాగములను సిద్ధము చేయింతురు. కొందఱు చక్రపు ఆకుతీగలను, మఱి కొందఱు చక్రవలయములు మొదలగువానిని తయారు చేయుదురు. ఈ విడివిడి భాగములనన్నిటిని కలిసి కూర్పుచేయు కేంద్ర కర్మాగారమునకు వానిని ప్రోగుచేసి తెత్తురు. అక్కడ వానినన్నింటిని వినియోగించి, సిద్ధముగా పనికివచ్చు పూర్తి యంత్రములను తయారు చేయింతురు.



వికృతావలంబనము

మనదేశములో కొందఱు పురుషులు, అవలంబన ధామము వారంతగా, పాశ్చాత్య ప్రభావమునకు లోనుగాక పోయినను, వస్త్రధారణము మొదలగు వానిలో పాశ్చాత్యుల ఫక్కినవలంబనముచేసి వికృతవేషముల వేయుచున్నారు. ఒక పెద్దమనిషి మెడదగ్గఱ తెఱపిగలకోటును ధరించును. కాని మన వేడిదేశమునందు, చీకాకుగొలుపు బిరుసుమెడ పట్టిని నిరుపయోగమూ నసహ్యంపుమెడ ముడిని విసిచి వేయును. లాగుపైకి వ్రేలు 'కుడతాను' తొడుగుకొనును. అదిచల్లదనము నొసగగలదు. పాదాలకు 'ఆక్సుఫర్డు' బూట్లుచాల కర్చుచేటు గావున, తనకుదొరక గల నాటు చెప్పులనే తొడుగుకొనును. ఇట్టివికారవేషమును గాంచి, నిర్దుష్టముగా పాశ్చాత్యవేషధారణావలంబనముచేయు మఱియొకని కండ్లుమండ వచ్చును. ఐనను పూర్ణపరావలంబుని కన్న వీనికడనే స్వయంనిర్ణయ శక్తి కొంచెము హెచ్చుగ నున్నదనవచ్చును. ఇట్టి

వారియందు కానవచ్చు రసజ్ఞతయు మిల్లుగుడ్డ తానులపైనినంటించబడు చౌకపారుబొమ్మకాగితములందు గోచరింపగల కళాసంపద వంటిదే. కాని వారియందు కొంతబుద్ధి సంపదయు నుండును. విచక్షణచేసి యేఱుకొనగల శక్తియున్నది. కాని వారియందు సంపూర్ణరచన గావించి చూడగల దూరదృష్టిగాని, కళాభిజ్ఞతగాని కొఱవడియుండును. లేదా వారు సోమరితనమునకు లోబడిపోయి అటులచేయరేమో. కావున వారుచేయు అతుకు బొతుకుపనులు చిరకాలము సాగబోవు. తమకోర్కెలను సత్వరము ఈడేర్చుకో వలెనను ఆతురపాటు వలన వారు హింసాచరణమును పాల్పడు చుందురు.



తృప్తిదారు కల్పనచేయు అందచందములు

భౌతికసృష్టిధామము:—సాహసపరిపోషణ ధర్మము ననుసరిం విచారించునెడల, భౌతికసృష్టి ధామమునందలి ప్రతివ్యక్తియు, తన యిచ్చనే ప్రధానముగఁ జేసికొని తనయిష్టము వచ్చినటుల జీవించు ననవలయును. "ఎవనిపచ్చు వానిదే; వెనుకబడినవారు శనిగాని పాలే", అను క్షుద్రధర్మానుగాములై యితరుల గోడు పెట్టుకొనరు. వీరు స్వేచ్ఛానుసారము వర్తింపగోరుదురు.వారు విశిష్టములగు స్వీయ

ముకాభావములు కలిగియుండి, వానిని తమ స్వార్థప్రయోజనముల
కుపయోగించుకొందురు. ప్రతిపురుషుడు తనదైనందిన జీవితచర్య
లలో తన యిచ్ఛానుసారము పరిణతి పొందదగునని దాని అర్థము.
దురదృష్టవశాత్తు నేటిప్రపంచము వస్తూత్పత్తిదారుల పాదాలక్రింద
బడి నలిగిపోవుచున్నది. తమ సరకులు గొనువారి జీవితము లెటుల
గడపవలయునో నిర్ణయించు నధికారము వీరిచేతిలో పడినది. కాబట్టి
కొనుగోలుదారుడు తన యిష్టము వచ్చినవానిని నిర్ణయించుకొను
స్వేచ్ఛకును, వాని రచనాచాతుర్యమునకును అవకాశము లేని
కారణమున నవి తుదిని శూన్యములే యగును.

ఫ్రాన్సుదేశములో సొగసుల వరవళ్ళు పెట్టువా రుందురు.
ఎప్పటికప్పుడేది అలంకారశోభగా గణనగాంచునో వారు నిర్ణయిం
తురు. వీపులమీద సీతాకోకపురుగు బొమ్మలను పొడిపించుకొని
పలువురుచూచి మెచ్చుకొనురీతిని వీటుగ దిరుగాడుట నాగరికసంప్ర
దాయమని చాటుదురు. ఇంకేమి? కాదనజాలని వెడగువనితలు
తండోపతండములుగా వారి శృంగారరచనాశాలలకేగి బాధల
కోర్చి వీపులమీద రకరకాల సీతాకోకచిలుక పుర్వుల పొడిపించు
కొందురు. జంకుగొంకులేక 'రెవీరా' సముద్రతీరములకు మఱి
యుచు పర్వులు పెట్టుదురు. విలాసగాండ్రు వలపు చూపులతో తమ
వంకచూచుచుండ, ఈ యువతులు ధన్యత గన్నటుల దలతురు.

మఱియు, పాశ్చాత్యవస్త్రధారణము, పారిసునగర సారసాక్షుల
సొగసులు ప్రపంచమునకు మార్గదర్శకములైనవి. వీని ననుకరణము
చేయు లండను, ఆసొగసులను తమ వ్యాపారలాభములకై వినియో
గించుచున్నది. న్యూయార్కు తన ప్రయోజనములకొఱకై వీని
నవలంబనముచేసి సౌందర్యప్రమాణరీతుల సంస్థాపించుచుండును.

ఈ ప్రమాణ నిర్ణయము పాశ్చాత్యదేశములందు, వినియోగదారుల జీవన వైఖరులనుండి స్వతంత్రరచనాపేక్షను తుడిచిపెట్టినది. లోకసామాన్యమైపోయిన జీవితాచారాలకు భిన్నముగ వర్తించుపట్లు, తమనుజూచి యెవరేమనుకొందురోయని ప్రజలు భయపడుదురు. బాహ్యప్రపంచమున కోర్టులలోను రాజసభలలోను వ్యాపారమందిరాలలోను అవసరాలైన డాంబికవేషాలు గృహములలోనిసాంసారిక జీవితాలలోనికిని దాడవెడలివచ్చి జొరబడినవి.

పళ్ళెరములో సొగసగు పాయసపుగిన్నె పెట్టుకొని, అండాకృతిగల పెద్దగరిటెతో పానీయములు త్రాగుట కొంతకాలము మర్యాదగా గోచరించును. ఆ ఆచారము మరికొన్నేండ్లకు మారిపోవును. అంతట అంచులేని పాయసపు గిన్నె నుపయోగించుచు గుండ్రని గరిటెతో నారగించుట సదాచారమగును. తరచుగా నిట్టి మార్పులు గలుగుట వెకిలితనమునకు మూలమగును. ప్రజల వెకిలితనము వర్తకపు పెంపునకుపయోగకరము. పేదవాండ్రు గడియగడియకు పానపాత్రలను గృహోపకరణములను తీసిపారవేయుచు, క్రొత్త క్రొత్త వన్నెచిన్నెలను ఆచారమర్యాదలను అనుసరించలేరు. వారు సభ్యవర్గమునుండి వెలియైపోవలసియుండును. వ్యాపారదృష్టితో చూచునెడల పితార్జితముగా ఒకే సామగ్రిని తరతరములవా రుపయోగించుట తగదు. అందువలన, వ్యాపారము సన్నగిలిపోవును. అటులగాక జీవితాచారమర్యాదలు మారుచుండునెడల వ్యాపారమున కెంతేని అభివృద్ధి చేకురగలదు.

అటువంటి వ్యర్థములును, అర్థహీనములునగు ఆడంబరమర్యాదల వెంటబడిపోవు ప్రజలు అమాయికముగా బలియైపోవుదురు. సభ్యత్వము గతించుకొనుచుంటిమను భ్రమలలో చిక్కుకొందురు. సాహసవంతులగు వర్తకులు తెలివితేటలతో చమత్కారములగు ప్రకట

వలు చేసి, డాంబికమగు వ్యాపారపు టవసరముల దెచ్చిపెట్టి సహజముగా అమ్ముడుపోజాలని సరకుల కెక్కుడలేని గిరాకీని సృష్టిచేయుదురు. ఆరీతి ప్రచారములకు అందచందములకు భ్రమసి, నలిగిపోవు ప్రజలలో, పోనుపోను తామొక హీనజాతివారమను భావమును తమలో స్వయముగ పెంపొందించుకొందురు. ఆత్మవిశ్వాసమును కోల్పోవుదురు. వారిలోని స్వతంత్రయోచనా సామర్థ్యమునకు అవకాశములు లేని కారణమున ఎదుగుబొదుగులు లేని బడుగు జాతిగా మారిపోవుదురు.

బొంబాయినగరమునకు పోయి, అచ్చటి డాబాయిండ్లను కొన్నింటిని చూచినంతనే, తక్కిన యిండ్లన్నియు నెటులుండునో మీకు తెలిసిపోగలదు. ఎవరింట చూచినను, నవీనమగు ఆచారమునకు నిదర్శనముగా ఒకేమాదిరి మడతకుర్చీలు, ఒకేతీరు మడతబల్లలు, మడత మంచాలు, గుండ్రని మేజాలు, వానిపై నమర్చిన గాజుకూజాలు, పింగానీ సరంజాలు కండ్లబడును. వైచిత్ర్య మిసుమంతయు నుండదు. ఎల్లెడల ఒకేతీరు! నూతనభావాలుగాని, నవ్యతర రచనలుగాని సున్న. మృతప్రాయమగు ఏకత్వము. ప్రాచీన స్మశానవాటికకు పోయినను, రకరకములగు సమాధికట్టడములును, వానియందు కళానైపుణ్యమును కొంత గోచరింపగలదు; ఈసరిక్రొత్త బొంబాయి నగరపు డాబాలలో అట్టిదేమియు కనులబడదు. ఇట్టిచోటులలో బ్రతుకు జనులను "జీవించుచున్నా"రందుము. కాని ఈడాబాలను సమాధుల కన్నను జీవరహితములగు స్థలములనవలెను. వినియోగదారులకై విక్రయదారుడే యిచ్చట సర్వమును సంసిద్ధము చేసిపెట్టును. సుఖజీవనమును, హాయిని, చేకూర్చిపెట్టుచున్నానని అతడు బీరములు పలుకును. ఆరీతి సుఖభోగములు మానవుని యుత్తమ శక్తులను ప్రమాన్ప

డ చేసి, యడంచును. ఇక పురోభివృద్ధియున్నదే ! వికాసమూ ఆకాశ పుష్పమే !

జీవితమున సృజనలక్షణములు అమరియుండ వలయుననుచో, నిర్జీవప్రదమగు ఏకీకృత ప్రమాణము, అందము, చందము, మర్యాద-యుండదగదు.

ప్రతివారు తమ అభిరుచిని వెలువరించుటకు పూర్తిఅవకాశము లుండవలయును. తనయింటి యాకారమును తానేనిర్ణయించుకొనుట, తన గృహోపకరణములను తాను నిరూపించుకొనుట, అనునవి వ్యక్తిత్వము వికాసము పొందుట కవసరమగును. మానవసమస్యలను సరళపఱచు నెపముతో, అధికోత్పత్తిచేయు పరిశ్రమాధిపతులు, ప్రజాజీవితము నందలి వ్యక్తిత్వమును వ్యక్తిప్రతిభను వ్యర్థము గావించి, దూరముగ నెట్టివేయుచున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రములందు, ఒకరాత్రిలో ఇండ్లను కూర్పుచేసి పెట్టగలరు. తన కొక గృహము కావలయునను వాడు ఇండ్లనుకట్టు వ్యాపారిని ఎలె క్ట్రిక్కు-గంట ప్రమోగించి పలుకరించి, తానుకోరు ఇంటి నమోనా (ఏ) రకమో, (బి) రకమో, (సి) రకమో సూచింపుచు, దాని నెచ్చట నిర్మించుటో తెలిపిన చాలును. ఆ నమోనా యింటి కవసర ములగు ద్వారములు, కిటికీలు, తలుపులు అన్నియు వ్యాపారికడ నెన్నడోతయారై సంసిద్ధముగా నుండును. వానినొక కట్టగట్టి లారీలో నెక్కించుటే కావలసినపని ! ఆ మాత్రము వ్యవధిని అంగీకరించిన జాలును. తెల్లవారు నప్పటికే యిల్లు మొలుచుకొని వచ్చును.

జిహ్వాకొకరుచి యనుట ఎల్లతెలిసిన నుడియె కదా ? ఆయా ప్రజలయొక్క భిన్నభిన్నములగు రుచుల కవసరములగు తినుబండా రముల విషయమునను, ఉత్పత్తిదారులు వేత్వేఱు రకముల వానిని

సిద్ధముచేసియుంచి నోరూరజేయు వర్ణనలతోడను భ్రమలు గొలుపు ధరలతోడను ప్రకటనలు చేయుదురు. వ్యక్తులను సమ్మోహింప జేయుదురు. మన దేశమున గూడ అంగళ్ళలోను ఇండ్లలోను సయితము ఎక్కడనో సిద్ధముచేయగా తెప్పించి, అమర్చిన ఆహారములు నేడు వెలసినవి. గృహిణుల పాకశాస్త్ర నైపుణ్యమున కాస్కారమే లేకుండ బోవుచున్నది. ప్రతిగృహసతియు వంట పనులందు తన నేర్పును గుఱించి గర్వపడుచు చెప్పుకొను దినములు గడచిపోయినవి. లెక్కకు మీరిన రకరకముల యూరుగాయ డబ్బాలు, పండ్లమురబ్బాలు, పచ్చళ్ళు, పసివారికి రోగులకు వలయుతిండ్లు ఫ్యాక్టరీలలో సిద్ధముచేయబడి వేలకొలదిమైళ్ళ దూరమునుండి దిగుమతియై, పేరు చెప్పినతోడ్తోడనే కనులయెదుట ప్రత్యక్షమగు చున్నవి.

నరుడు జీవనసమస్యలగూర్చి యోచనచేయు నగత్యము తరిగిన కొలది, సహజముగ వ్యర్థజీవుడై పోవుచుండును. కాబట్టి బుద్ధి చతురుడును వివేకవంతుడును నగు ఈకాలపు వస్తూత్పత్తిదారుడు, కొనుగోలుదారుని పక్షమున ఆలోచనభాగము నంతను తానె గుత్త గొనుటచేత నరుని గణ్యతను కుంటువడజేయుచున్నాడు. దయాహృదయ యగు తల్లి సయితము తనబిడ్డను స్వయముగ నడచు యత్నము చేయనిచ్చుచు, కొన్నియెడలపడి గాయములు తగిలించుకొనుటకును సమ్మతింపక తీరదు. ఆమె తన శిశువెక్కడ పడిపోవునో యని మితిమీరిన జాగ్రత్తతో సదా తన చేతులలోనే పెట్టుకొని పెంచునెడల బిడ్డడు నడకలో తూకువ నిలువుకొను నేర్పును నెన్నడు నెరుంగలేక ఆజన్మాంతము కుంటిబ్రతుకు బ్రతుకవలసి వచ్చును. ఈనాటి ఉత్పత్తిదారులు సమాజమునకుచేయు సేవలు ఆతీరున ఫలించుచున్నవి.

మన దేశములో, వేర్వేరు శీతోష్ణస్థితులుగల, వేర్వేఱు రాష్ట్రములందు దైనందినజీవనవీధులలో లెక్కకుమీరినన్ని వైచిత్ర్యము

లేర్పడియున్నవి. ఒకే రాష్ట్రమునందు సయితము వివిధవర్ణములవారియందు వేర్వేరు విశిష్టమర్యాదలు కలవు. కాబట్టి మనము వ్యాపార కూటములవారి జిత్తులలో జిక్కుకొననియెడల వ్యక్తిప్రభావమును వృద్ధిగావించుకొనుటకును ప్రకటించుకొనుటకును అవకాశములు మెండుగా లభింపగలవు. నగరములయు, పట్టణములయు ప్రసక్తి విడిచినచో, పల్లెలందలి జీవనగతులు విశుద్ధముగ నుండగలవు. కాని దురదృష్టవశాత్తు నాగరిక దయ్యము దూరాతిదూర ప్రదేశములందున్న పల్లెలలోనికి సయితము పెద్దపెద్ద అంగలు వేసికొనుచు వచ్చి పడుచున్నది. ఐనను బొత్తిగ నిరాశచెందునంతటి దురవస్థ ఇంకను నేర్పడలేదు. కాని యీ మహామారిని అరికట్టుటకై సర్వప్రయత్నములను చేయవలసియున్నది.

సృష్టిధామము బలవర్ధకమై యొప్పవలసినది. కాని, వస్తూత్పత్తిదారుడు సమాజమున కేంద్రస్థానమాక్రమించుకొని కూర్చుండి, సమస్తమును తలక్రిందుచేయుట మూలమున, ప్రజాజీవనము నేడు గొలుసునందు సృష్టిధామమును దుర్బలతమమగు కడియముగ జేసివేసినాడు. వినియోగదారుడో, యథార్థమునకు సమాజమున కొలికిపూసయై యొప్పగావలసినవాడు. నేడు వాని రచనాచాతుర్యము ఫాక్టరీల పెంటకుప్పలక్రింద బడి పూడిపోవుచున్నది. ఇట్టి జీవన విధానము కళాభ్యుదయరచన లుద్భవమగుటకు తోడ్పడజాలదు. ఏ బడి పిల్లవాడైనను తన పుస్తకములో నతికించుకొని మూడునాళ్ళ ముచ్చటగా చూచుకొనుటకు యోగ్యమగుపాటి పిచ్చిబొమ్మల రచనలకు మాత్రము దారితీయగలదు.

తనకేలాటి సరకు కావలయునో నియమించు నధికారము వినియోగదారునుండి జారిపోయినది. వ్యాపారపు నీతిలో వినియోగదారుని అధికారమునకు “ సరఫరానిర్ణయము ” అని ఆర్థికపండితులు

ఘనమగు పేరిడుచున్నారు. కాని సరఫరానుగూర్చి అతను చేయగల నిర్ణయమే కానరాకుండపోయినది. అతడు నోరెత్తకుండ తన ఎదుటబెట్టిన సరకునే దీసికోవలసినవాడైనాడు. వ్యాపారసరళి నేడు తలక్రిందై నడచుచున్నది. ఇంగ్లాండులో 'నార్తాంప్టను' నగరమునందు గూర్చుండి చెప్పులుకుట్టువాడు భారతదేశములోనో, లేక భూలోకమున నేమూలనో వసించు వినియోగదారునికొఱకై చెప్పులను తయారుచేసి పంపుచున్నాడు. వినియోగదారుడు తన పాదములకు సరిపోవు చెప్పులను తానుగ తయారుచేయించుకొనుటకు వీలులేదు. అతడేదో యొకషాపులోనికిపోయి, అక్కడ సిద్ధముగా తయారుచేసి పెట్టబడియున్న ఏదో యొక షాపులోనికిపోయి అక్కడ సిద్ధముగా తయారుచేసి పెట్టబడియున్న ఏచెప్పులజతతో సుమారుగా తన పాదములను సరిపెట్టుకోవలసినవాడగుచున్నాడు. పాదరక్షల నిర్మాతల అదుపులో నడచుషాపులలోని పాదరక్షలకు సరిపడు పాదములుం చాలినన్ని దొఱకని యెడల, పాదరక్షలు తొడుగుకొను అలవాటే లేని 'నాటుజనులు' (Natives) గల అబిసీనియావంటి దేశమును వశముచేసికొని, పాశ్చాత్యుల ఫక్కీనిబూటులను తొడుగుకొను ఆచారమును ఆదేశీయులకు నేర్పి, వారిని నాగరికులను చేయవలసియుండును. కోరువారి ప్రసక్తి లేకుండ, విరివిగా నరకుల సరఫరా చేసిపెట్టుటలో పర్యాలువెట్టు ఉత్పత్తి పద్ధతి, ఆధునిక యుద్ధములకును పోరులకును కాలుదువ్వు ధూర్తత్వమునకు ఎంతేని మూలకారణమగుచున్నది. అస్వాభావికమగు గిరాకీని బలాత్కారముగా సృష్టిచేయు పద్ధతివలన,హింసాచర్య ప్రబలమై, సర్వానర్థముల దెచ్చిపెట్టు ఒడుదుడుకులు కల్పన యగుచున్నవి. వానిని సరిదిద్దు ప్రయత్నమునగలుగు ప్రతీఘాతములవలనను మఱల నూతన హింసాచర్య రేకెత్తుచున్నది.

సమాజమున శాశ్వతత్వము, అహింస ప్రవర్తిల్లవలయుననిన, ఇప్పటి జీవనవిధానము మారి వినియోగదారుడు ప్రధానస్థానమాక్రమింపవలయును. వాని పలుకుబడి బలతరము కావలసి యుండును. వినియోగపడు సరకులు స్థానికముగా తయారు కావలయును. అందుననూ, వీలగునంత వఱకు గ్రామకుటీరములందు, వినియోగదారుని కండ్లయెదుట ఆపనిజరుగ వలయును. తయారగు సరకు ఎప్పటి యవసరముల నప్పుడు తీర్చునదిగా నుండ వలయును. అటువంటిపరిస్థితు లేర్పడినప్పుడు మాత్రమే, వినియోగదారుని ప్రయోజనప్రమాణములకు పాటింపు లభించును. వాని వ్యక్తిత్వము ప్రవర్తనముగాంచును. నరుడు వికాసము నందగలడు. ఈకాలపు ఉత్పత్తి పద్ధతులు, విక్రయవిధానములు 'జీవనము'ను స్తంభింపజేసి, కేవలము 'ఉనికి'గామార్చివేయు చున్నది. ఈ వాతావరణమున ఊపిరాడక యుబ్బగుడువ నగుచున్నది. సృష్టిధామమునకు చెందనగు స్వతంత్ర గల ప్రజ తమ వ్యక్తిత్వమును ధృవపఱచుకొని, కార్యపరులై యొప్పినగాని, యీదుర్దశ తొలగదు. గుణనిర్ణయాధికారమును గుత్తగొనినధనము ఇప్పుడీధామమును పూర్తిగా నాక్రమించివేసినది. ముందుదానిని వెడలనెట్టవలసి యున్నది. సంస్కృతియేగుణ నిర్ణయముచేయు నాచారముపునఃప్రతిష్ఠితము గావలయును. సామాన్యప్రజాజీవన పరిస్థితులను సరిదిద్దు అధికారము దానికి సంక్రమింపగావలెను.

సాంఘికాచార ధామము :—ఈ **ధామము** సమూహపరిరక్షణకు సంబంధించినది. కాబట్టి ప్రతి దశాంతరమునందును గుణనిర్ణయము చేయునది "సామాన్యముగా, సంఘమున కేది క్షేమకరము? అను సమస్యయేగాని, ఏ ప్రత్యేక వ్యక్తికో లేక ఏ ప్రత్యేక వర్గమునకో లాభదాయకమా యనెడు విచారణకాదు. ధనప్రమాణముల క్రింద

ప్రమేయమే లేదని ఇంక చెప్ప నవసరముండదు. దూరదృష్టిప్రయో జనములు సంకుచితదృష్టి ప్రయోజనములను అణచివైచి మాన్యతర ములై యొప్పును.

ఇటీవల సాంఘికదృష్ట్యా ఆర్థిక ప్రయోగములు చాల సాగినవి. "సోవియటు" సాంఘికనీతి నవలంబించిన రష్యాదేశము దీనికి ఉప క్రమణము గావించియున్నది. ఫాసిస్టులు, నాజీలు వారి ననుసరింప సాగించిరి. శాశ్వతతత్వమును అహింసను సాధించుటలో వారువిఫలు లైరి. అందుకు మారుగా మానవజాతినే వారు రక్తప్రవాహములలో ముంచి వైచిరి. వారు అడ్డత్రోవలబట్టి పోజూచిరి. ప్రతివారు తమ వర్గముకొఱకో లేక జాతికొఱకోమాత్రమే దేవులాడిరి. సమష్టిని అఖిలమానవకుటుంబముయొక్క సమస్యలయెడ నుపేక్ష వహించిరి. నోరులేని అమాయికపు ప్రజాసంఘమునకు "మంచియో, చెడ్డయో, నా దేశము నాకు" అనెడు నినాదముల నేర్పిరి. కావున హింసా వినాశముల నెడు సుడిగుండములలో వారు దిగబడిపోయిరి.

నానాజాతిసమితి ప్రపంచమునంతటిని తనలో నిముడ్చుకొనినటుల నెంత డంబముగా దొడ్డపేరు పెట్టుకొని యూగులాడినను, ఆ సమితి కార్యక్రమమును నడిపిన కొలదిమంది స్వార్థపరులు తమ పచ్చనే చూచుకొనుచు, తాత్కాలికపు హ్రస్వదృష్టిని బూని సంకుచితమగా ఆర్థికవిధానము నవలంబించినారు. అందుమూలమున ఆ సమితియే వ్యర్థమైపోయినది; విశాల మానవజాతికొఱకై అహింసను శాశ్వత త్వమును సాధింపజాలదయ్యెను.

ఏదేని జీవనప్రణాళిక నొకదానిని మనము కూర్చుకొనక తీరదు. ఇందు విజయము సాధింపనుంటిమేని, మనము కూర్చుకొను ప్రణాళిక యొక్క గమ్యము సార్వజనీనమైనదై, శాశ్వత జీవనసూత్రములకు పూర్తిగా అనుగుణమైనదై యుండవలయును. అది కేంద్రీకృతక ర్మా

గారములందు విరివిగా తయారుచేయు సరకులను విక్రయించిపెట్టు నుద్దేశ్యముతో, (క్రిందటి అధ్యాయములో మనము తెలిసికొనియున్న విధాన) ఏకీకృత జీవనప్రమాణ పద్ధతులను అన్యుల నెత్తిపై బడవేసి రుద్దుటకు హేతుభూతమగునదిగా నుండదగదు. మఱియు వ్యక్తిమహాత్వమును ప్రకటించుకొను నవకాశముల హతము చేయునదిగా నుండరాదు.

మనదేశములో, సాంఘికాచారధామమునకు చెందినవారు కార్యపరులై వర్తింపగల్గు క్షేత్రము, కడు విశాలమైనది. గ్రామీణుల జీవనము సుఖప్రదము కాగల్గుటీరున, వారి కార్యకలాపములను చక్కనికట్టుదిట్టములలో బెట్టగలవారిసేవ యెంతయైనను మనకు అవసరముగా నున్నది. అడవిజంతువులకును ప్రవృత్తి ప్రేరకమును, ఆరోగ్యవర్ధకమును నగు ఆహారము సులభముగనే దొఱకుచున్నది. ఈనాడు మన గ్రామవాసుల గతి అంతకన్నను నికృష్టముగ నున్నది. సాంఘికముగను, ఆర్థికముగను గూడ వారి పరిస్థితులు వారి యుద్యమారంభముల నెల్ల హతము చేసివేయునవిగ నున్నవి. స్వయంప్రకాశమునకు సకలావకాశముల నొసగు మానవ జీవనము నిరాఘాటముగ సాగవలసియుండును. అట్టిస్థితి సంభవమగురీతి జీవితప్రణాళికలను సమకూర్చుకొనుటకై ఈ ధాము వాసులు ప్రధానముగ పూనుకోవలయును.

ప్రణాళికరచనయనగా, దేనిని సాధించుకొఱకై మనము పాటుపడవలసియుండునో, ఆ ఆదర్శజీవనమును ప్రకటించుటయే. ఆ ఆదర్శము సముచితరీతిని భావన చేయబడునెడల, సమాజమునందలి ప్రతి వ్యక్తియొక్క కల్పనా సామర్థ్యమునకును పరిపూర్ణావకాశములు లభింపగలవు. ఏ ఆదర్శమేని సముచితమైనదా? కాదా? యని నిర్ణయించుపట్ల దానియందు మార్పులు చేయుచో ఘటిల్లు ఫలితార్థ

ముల ననుసరించి గ్రహింపగల్గుదుము. ప్రకృతి కనుగుణముగా నేర్పడిన ఆదర్శమునైనను స్వల్పమగు నొకని జీవితకాలానుభవము నాధారము చేసికొని హెచ్చుచేయుటకుగాని తగ్గు చేయుటకుగాని వీలుపడదు. అట్టి పెడతిరుగుడులు వ్యాధులకు మూలములగును. యుగయుగాంతరములనుండి ప్రకృతి యీమానవజీవనధర్మమును పరిణామమునకు దెచ్చియున్నది. మన ఆహారకోశమును బోలు పరిశోధనాగారమును అంత సరళముగను మఱియు నంత నిపుణమైనదిగను, ఏ శాస్త్రవేత్తయు నమర్చి పెట్టుకోజాలడు. మన హృత్పిండమునుబోలు స్వయముగ వ్యవహరింప సమర్థము గలట్టియు, స్వయం నియంతృత్వముగూడ గలట్టియు విచిత్రజలయంత్రమును ఏశిల్పియు రచన చేసికో సమర్థుడు కాడు. మననాడీ జాలమునుబోలు నిర్దుష్టమైనవార్తాప్రచారకకూటమును, తంతి సహితముగగాని తంతిలేకగాని సృష్టింపజాలు 'మార్కొని' యెందేనిగలడా? ఈ భౌతిక దేహముయొక్కగాని మనస్సుయొక్కగాని సామాన్యకార్య కలాపమును కూర్పుచేయుట మితప్రజ్ఞుడగు నరున కెన్నడును సాధ్యపడదు. కాబట్టి నిస్సాహాయుడౌ నరుడు తన యిచ్ఛవచ్చిన తీరున జీవనగతులను మార్పుజేయగడంగుట మూర్ఖతయే యగును. మానవుడు చేయదగినదెల్ల, ప్రకృతితో సహకరించుచు, ప్రకృతిధర్మగతి నెంతమాత్రము చెదరగొట్టజూడక కడునేర్పుతో, జాగ్రత్తగా పరిసరములను పరిపోషించుచేనుడీ! ఈస్థితి, అనగా ఈగమ్యము ప్రకృతిచేతనే సుప్రతిష్ఠితమై యున్నది; దానిని పరిశోధించి ప్రకృతి నియమములను సరిగ గ్రహించి, నేర్పుమెయిదాని ననుగమించుటయే మనుజునికి కర్తవ్యము. ప్రకృతిధర్మనిర్ణయములకు భిన్నమగు ప్రవర్తన మిసుమంతయైనను సంఘనిర్మాణమును విచ్ఛిన్నము చేయుననుట నిశ్చయము.

శరీరముయొక్క ప్రకృతిసిద్ధమైన ఉష్ణమితిని మార్చుటకై చేయబడిన ప్రయత్నము లన్నియు వ్యర్థమగుట డాక్టర్లందఱకును తెలిసిన విషయమే. ఉష్ణము మామూలునకు మించెనా, జ్వరమంకురించును; మామూలునకు తగ్గెనా నిస్సత్తువ, శోషకలుగును. అటైనను ఇటైనను తుదకు మరణము సంభవించును. నరుడు తన యిచ్ఛానుసారము తీవ్రప్రవృత్తితో పనిచేయుచు, గుండెయొక్క గతికి దానితోలయగూర్ప జాలుట మన చేతగానిపనియే. కొలదిపాటి అనుసరణవృత్తి సంభవమగుటయు నిస్సంశయమే. కాని మితిమీరి అటుల చేయలేము. రక్తనాళములకు హెచ్చు ఒత్తిడి కల్పించితిమా అధికమా రక్తపుపోటు వాటిలి అపాయము కల్గును. ప్రాణహానిరాకుండ, మనము జీవింపగల ప్రమాణమేదియు నూతనముగ కల్పనచేయ జాలము. ఇదేతీరున మన ప్రతి అవసరమునకును పరిమితికలదు. దానిని తీర్చుకొను నప్పుడే, మనుజశరీరము శ్రేష్ఠముగ స్వధర్మనిర్వహణము గావించును. మనమే ప్రణాళికను కూర్చినను, దాని ప్రమాణమును నిర్ణయించుకొని, అది ప్రతిమానవునకును నందుబాటులోనుండు రీతిని సునిశ్చితచర్య దీసికొను నిమిత్తమే ఆ ప్రణాళిక వినియోగపడ వలసియుండును. దురదృష్టవశమున మనము స్వర్ణశునకమునకు పట్టముగట్టి, సింహాసనము నెక్కించితిమి. (మన వ్యాపారమున బంగారు స్టర్లింగులపసకూడ బయటపడియే పోయినది), మనవ్యాపారపు టాలోచనలనన్నింటిని,మానవ వ్యక్తిని మనసున బెట్టుకొని సాగించుటకు మారుగా, డబ్బుననుసరించి సాగించుచుంటిమి.

ఎన్నెన్నియో ప్రణాళికలు రచనచేయుచున్నాము. అన్నింటికిని లక్ష్యమొక్కటియే—అధికవస్తూత్పత్తి! ఏ ప్రణాళికకును మానవ ప్రకృతిని ఆధారముగ గ్రహించుటలేదు! ఆప్రణాళిక లన్నియు,

చెట్లనుండి పుణికి తెచ్చిన పూలను సొగసుగా నమర్చి మేజాబల్లల పైనిబెట్టు గాజుకూజాలవలెనుండుచున్నవి. అవి శృంగారముగ గోచరించుననుట నిర్వివాదమే. మఱియు కొంతసేపు వాని నైసర్గికమగు సువాసనను మనోహరముగ వెదజల్లుటయు యథార్థమే. కాని అవి తల్లిమొక్క నుండి వేఱుచేయబడిన వగుటచేత మృత్యువు వానిలో ప్రవేశించియే యుండును. కావున వానివైభవము క్షణభంగురము.

ప్రణాళికల రచించునతడు, అటులగాక, ఆరామపోషకునివలె వర్తింపవలయును. అతడు మున్ముందుగా నేలను సిద్ధముచేయును. విత్తనములనాటి నీరువోయును. ఇట్లు తనవంతు పనిని పూర్తిచేసి, ప్రక్కకు వైదొలగి చూచుచుండును. మొక్కలే తమ నైజము ననుసరించి, సిద్ధముచేయబడిన నేలనుండి ఆహారమును దీసికొని, ప్రవర్ధనమై, పూఁబూయును. ముచ్చటగానమర్చబడిన కూజాయెంత సొగసుగా పూలతో నమర్పబడినదైనను, దానిశోభ క్షణభంగురమైనదే. దానిలో మరణచిహ్నములు నెలకొనియుండును. మొక్కయో సుస్థిరతరమైనది. వేళ్ళతో ప్రకృతినుండి సారమును పీల్చుకొనగలదు. అది సచేతనమైనది. ఆ మొక్కయొక్క పువ్వులును కొన్ని వాడి రాలిపోవునుగాక; ఐనను మఱల పూలుపూచి, రాలిపోయిన వాని స్థానము పూరించగలవు.

అదేతీరున ఏప్రణాళికయైనను మానవజీవుల ప్రవర్ధనమునకు అనువగు పరిస్థితులను చేకూర్చునదిగా నుండవలెను. కేవలము ప్రకటనలే పరమార్థములుకావు. ‘ఫలితార్థమును ముందుగా నిశ్చయించి పెట్టుకొని, పని ప్రారంభించుటయు, ఆ ఫలితార్థము సాధించుకొఱకైయే పాటుపడుటయు’ అనెడు పద్ధతి ప్రకృతివిధానము కాదు. అట్టి పద్ధతులవలన త్వరితగతిని కొలదిలాభమును ప్రాపింపవచ్చును;

కాని, అది సహజాభ్యుదయము కాకపోవుటచేత, అది ఫలించి పోగలదు. ఒక్కొక్కప్పుడు తీరని అనర్థములకును మూలము కానగును; అటువంటి త్వరితగతి, ముచ్చిబంగాఱు మెఱుపుల బోలి తళతళలాడు క్రొవ్వువత్తులచే నలంకృతమైన 'క్రిస్మసు' చెట్టుపోలిక నుండును. దానినిండ మృదంగములు, సన్నాయీలు, గుమ్మటములు, ఇతరములౌ బొమ్మలు, ఇంకను కానుకలుగా నొసగబడిన వస్తుజాలములలం దమర్పబడియుండును. అవి నిజమునకు బహుమానములును గావు; అలంకారములును గావు. ఏ విధముగ చూచినను ఆ వృక్షమునకా యలంకారము లుపయోగకరములని చెప్పి సంతసించుటకు పనికివచ్చునవి కావు. 'క్రిస్మసు' తరువనునది సజీవముగు నొకానొక వృక్షమునుండి నఱికి తెచ్చిన కొమ్మయేమైనను, పుడమి తల్లినుండి వ్రేళ్ళద్వారమున జీవరసముల బీల్చుకొనజాలదుగదా! దాని ఆకులు, చిగుళ్ళు, కొలదిసేపు తాజాగా గోచరించినను, వడిలి తలలు వ్రేలవేయును. తుదకాకొమ్మ యంతయు యెండి, వంటచెఱకుతో చేర్చివేయబడును. కృత్రిమమగు పుష్పలతయొక్క నిగనిగల ప్రదర్శించు ప్రణాళికలగతి యిట్లే యగుచుండును.

సుదృఢ పఱచ బడవలసిన మానవ సమర్థతల యొక్క పూర్ణవికాసమునకు అనువగు పరిస్థితులును అవకాశములును ప్రణాళికారచనమున ప్రధానాంశములై యుండును. ప్రతివ్యక్తికిని ఆరోగ్యప్రదమును పుష్టికరమునగు ఆహారము, వాతావరణపు మార్పులనుండి శరీరమును రక్షించుట కవసరమగు దుస్తులు, తగుపాటి వసతిగల యిల్లు, ఉచితజీవనమున కనుకూలించునట్టి శారీరక, మానసిక శిక్షణము, ఆరోగ్యమును గాపాడగల వినిర్మల పరిసరములు, మానవ సంసర్గమునకు వలయు పూర్తి యవకాశములు, ఆర్థికోత్పత్తి, వినిమయపు వసతులు తప్పక లభింపవలయును. ప్రణాళికా రచయితల లక్ష్యములందిట్టి వన్నియు

నుండవలయును. వీనికిమించిన విషయములను స్వప్రయత్నముచేసను కూర్చుకొనునటుల ప్రజలకే ఆ బాధ్యత విడిచివేయదగును. అప్పుడు మాత్రమే ప్రజలకు తమ స్వతంత్రేచ్ఛను వినియోగించుకొనుటకు దగిన అవకాశము లభించును; అప్పుడు వారి జీవితములు, కేవలము ఉనికిమాత్ర మైపోకుండ వారి యిచ్ఛానుసారము కొంత ప్రయోజకరమైనవిగ నొనర్చుకొనుటకు వీలుండును. అందుమూలాన సుస్థిరమగు ఫలితార్థముగా ఒకసంస్కృతి యేర్పడును; మానవజాతి అభ్యుదయమునకు విస్పష్టమగు ప్రోత్సాహము లభింపగలదు.

మానవజీవి యేర్చుకొనిన విధానము తనతోడి జీవుల స్వామ్యములను భంగపఱచనంతవరకు, తన యిష్టమువచ్చిన జీవనవిధానము నేర్చుకొనుచో వాని స్వామ్యముల నెవరును అడ్డుపెట్ట తగదు.

ఒక మానవు డేర్చుకొను విధానము వానితోడి జీవుల స్వామ్యములకు హానికరమైనది కానంతవఱకును, తన యిష్టమువచ్చిన జీవనవిధానమును ఏర్చుకొనువాని స్వామ్యమునకు, ఏ జీవిత ప్రణాళికయు అడ్డతగులరాదు. ఆజీవనప్రణాళిక ప్రతివ్యక్తికిని కనీసము మానవుడుగా తన కవసరమగు దానినెల్ల పొందుటకు నిరాఘాటముగ తోడ్పడునదై యుండవలయును. అవసరములకు మించిన విషయముల సందర్భమున ప్రతివ్యక్తికిని తన విశిష్టప్రతిభను ప్రకటింపగల్గు జీవనప్రయోజనముల గుఱించి తన స్వీయభావముల ననుసరించుటకుదగిన అవకాశము లభింపవలయును. అట్టి అవకాశము నంగీకరించనంత కఠినముగా నుండునట్టియు, జీవనప్రయోజనములగూర్చిన వ్యక్తిభావములను ప్రకటించుటకుగాని, వాని ననుసరించి వర్తించుటకుగాని, స్వేచ్ఛనంగీకరించనట్టియు ఏజీవనప్రణాళికయైనను, చట్టులాంటిపోయిన పటాలపు శిక్షణవలె దోషపూరితమైనదే యనందగును. పటాలశిక్షు

ణము వంటి కఠినవిధానము మానవజీవిని, వ్యక్తిత్వశూన్యుని చేసివేసి, యేమాత్రపుమార్పు చేసికొనుటకును వసతిలేని యంత్రమందలి పండ్లచక్రముయొక్క స్థితివంటి పారతంత్ర్యదశకు వడవేయును. పుట్టినదిమొదలు చచ్చువఱకును సంకుచితదృష్టితోడి కఠినశిక్షణము నందిరికించి పట్టుకొను శిక్షణవిధానమునందు ఇతరయోగ్యతలెన్ని యున్నను, లేక అదెంతటిపటిష్ఠమైనదైనను, మానవాభ్యుదయమున కవసరమగు ప్రాథమిక నియమమునకే, అనగా స్వీయవ్యక్తి ప్రభావమును ప్రకటించు స్వామ్యమునకే చేటుతెచ్చునుగాన పూర్తిగా దూష్యమై నదగును.

మన గమ్యము వ్యక్తిత్వ వికాసమై పఱగుటకుమాఱుగా ఏపటాలములోనో, ఫ్యాక్టరీలోనో వాంఛితమై యుండురీతిని సమష్టి కార్యనిర్వాహణముపట్ల పటాలశిక్షణమునకు ఉచితస్థానమును ప్రయోజనమును నుండును. అటువంటివాని సందర్భమున వ్యక్తియొక్క అభ్యుదయమునకు మించి, అతడు తన తలతోడను చేతితోడను చేయగల పనికి అధికప్రాధాన్యత యుండును. అటువంటి సందర్భములయందు వ్యక్తితన స్వీయప్రయోజనములను సమష్టిప్రయోజనములందు అంతర్భూతము చేయవలసియుండును. సమష్టిగమ్యమును మించిన మహత్ప్రయోజనమేదియు అందు విచారణయోగ్యముకాదు. 'సమష్టి' ప్రయోజనము సాధించుటలో 'వ్యక్తి' ఉపకరణమాత్ర మగును. మనకో, వ్యక్తి ప్రభావవిలసనమే పరమలక్ష్యమై, 'వ్యవస్థ' అనునది ఆ లక్ష్యసాధనకొక అవకాశక్షేత్రమై పఱగుగాన, మన జీవన ప్రణాళికయందు పటాలశిక్షణమునకు తావుండజాలదు.

ఉదాహరణకుచూడుడు:—చక్కగ సాకనబడు క్షీరశాలయందు, పశువులను జాగ్రత్తగా మేపుదురు. శ్రద్ధగా సిద్ధముచేసిన దాణా పెట్టురురు; సకాలమున కొల్లప్రకారము నీరు ఉప్పు వేయుదురు; ఆ

రోగ్యప్రదమగు శాలలో కట్టివేయుదురు; కొంతసేపు యెండలో, వ్యాయామముకొఱకు త్రిప్పుదురు. ఒడలు రుద్దుచు ప్రతి దినము శుభ్రముగ తోముదురు. కాలనిర్ణయము ననుసరించి పాలు పితుక్కు దురు. కేవలము, పశువులవలె 'ఉనికి' కొఱకు బ్రతుకుటకంటె 'జీవింప' కాంక్షించు మానవులకు, ఇటువంటి పోషణము అవసరము లేదు. సవ్యముగా పాలింపబడు చెఱసాలయందు 'ఉనికి'కి యోగ్యమగు వసతులన్నియు నమరియుండును. ఖైదీలయొక్క ఆరోగ్యమునకు భంగకరమను కారణముచేత, సకాలమున ఖైదీలు నిద్ర, ఆహారము, విశ్రాంతి, తీసికొనని యెడల చెఱసాలనియమముల ననుసరించి నేరముగగూడ నెంచబడుచున్నది. ఖైదీల శరీరమునుగూర్చి ఎంతటి శ్రద్ధతీసికొనబడుచున్నదో చూడుడు! ఐనను ఇచ్ఛానువర్తనమునకును ఐచ్ఛికప్రవృత్తికిని అవకాశములు తొలగింపబడు కారణమున అది 'జీవనమే కాజాలదు; కేవలము 'ఉనికి' మాత్రమే! ఇటులనే అన్నివైపులను దాటరాని నిబంధనల నేర్పఱచి జీవితమును జైలు బ్రతుకుగ మార్చివేయు ప్రణాళిక యేదియైనను, నిషిద్ధమే. అది మొక్కకు అలవ వంటిదిగ మాత్రము ఉపకరింపవలయును. అక్రమముగ జొరబడివచ్చి మేసిపోవు పశువులనుండి మొక్కను సంరక్షించుట కేర్పడిన అలవ వలె నుపకరించవలయునే గాని, ఆ ప్రణాళికయే ఆటంకముల గల్పించి, గాలి, వెలుతురు ధారాళముగ రానీయక, అడ్డు నిలువదగదు. ఈ ధామవాసులు తమతమ నవ్యరచనా సమర్థతలను తోడిజీవులకు సేవలుచేయుకొఱకే అంకితముచేసి, మానవ స్వేచ్ఛాజీవన ప్రణాళికలను నిర్మించు నిమిత్తమై వినియోగము చేయవలసి యుందురు.

ఈ ప్రణాళికయొక్క విధానము, ఆచరణక్షేత్రము నెట్లుండునో మాత్రము యిచ్చట విచారించియున్నాము. పై అధ్యాయములో,

సంతృప్తికరమై ఈ ప్రణాళికకు ఆధారముగ నుండదగిన జీవనప్రమాణముల విచారణకు పూనుకొందుముగాక.

దివ్యధామము :—దివ్యధామము సేవాపరిపోషణవర్గమునకు చెందినది. ఇందు విధులకు ప్రధానస్థానము నొసగి, వ్యష్టిస్వామ్యములు వెనుకకు తగ్గుచుండును. విధులే జీవనముపైని శాసనాధికారము జరుపుచుండును. స్వాతంత్రేచ్ఛ యనునది నరుని పశ్వంశను వాని శారీరక స్వార్థచింతలను నియమితముగా కొలదిని సముచితమార్గములలో బెట్టి నడపును. వాని ప్రయోజన ప్రమాణములు, వానిస్వంతభోగములను గాక, ఇతరులక్షేమమునే హెచ్చుగ పాటించురీతిని తగిన విధానము కూర్చబడి యుండును. ఇట తాత్కాలికపు వ్యష్టిలాభము వాంఛితార్థముకాదు. కావున, లక్ష్యార్థము దూరమును, సువిశాలమునై గోచరించును.

కాబట్టి యీ ధామములోని వ్యక్తికల్పనా చతురుడై యుండ గోరుగాన, ఏదేని సంస్కరణనుగాని ప్రణాళికనుగాని సూచించుటకు పూర్వము తన యందలి లోపములను సంఘముయొక్క అవసరములను, విస్పష్టముగా గ్రహించుట ముఖ్యము. కేవలము బుద్ధిచాకచక్యముతో నాక్షేపించుటగాని, అభినందించుటగాని కార్య కుశలత కాజాలదు. అందుకు పరిమిత క్షేత్రమున ప్రయోగములు చేయుకొఱకు అర్హమగు పరిశోధనాగార ముండవలయును. అందు సునిశ్చితముగా ఆచరణోపాయమని తేల్చిన దానిని మాత్రమే వేర్వేఱు రకములగు ఆహారపదార్థములతో గినీపందులనుగాని, తెల్లయెలుకలనుగాని, పావురములు కోతులు మున్నగు వానిని గాని పెంచి, ఆయాజంతువులపైని జరిపిన ప్రయోగముల ఫలితములను గ్రంథస్థముచేయును. ఆపిమ్మట నరజీవులకు సరిపడు ఆహారమునందుండదగిన ఆయాయంశముల నతడు నిర్ణయించి తెలుపగల సమర్థుడు

కాగల్గును. అదేతీరున సమస్తమయిన సాంఘిక పరిపోషణ సంస్కరణములందును, క్రొత్తక్రొత్త యూహాలను ప్రజలకు గఱపి, పరిశోధనలు గావించు టెంతయు అవసరమగును. కాబట్టి యీ ధామము నందలి వారు ఐచ్ఛికముగా గినీపందులవలెను శాస్త్రపరిశోధకుల వలెను గూడ నుపకరింప వలసియుందురు.

వెనుకటి ధామమువారు ప్రజాసామాన్యము కొఱకై ప్రణాళికా రచనల గావింతురు. కాని ప్రణాళికా రచనయను కార్యము బాగుగ పరిశోధించిన సూత్రములపై ఆధారపడి సాగవలయును. ఆవిధముగా దివ్యధామమునకు అనుకూలమగు క్షేత్రమమర గలదు. "అవసరమనునది నూతనకల్పనలకు తల్లి" అనెడు సామెతగలదు. ఇతరుల యవసరములను మనయందారోపణ చేసికొని చూడగల్గునేషలను, మఱియు మనయందు కల్పనాసమర్థత నెలకొనియుండునేని, ఆ యవసరముల సమస్యను పరిష్కారము చేయుట కనుకూలించు విధానములను, సాధనలను సమకూర్ప జాలుదుము. ఈధామమునకు చెందినవ్యక్తి ఇతరుల జీవితములతో ఐక్యానుభూతిబడసి జీవించుటయు, బాధపడుటయు ఘటిల్లును. అట్టివాడు తన భావములను తన పరిస్థితులను కంటె ఇతరుల భావములను పరిస్థితులను హెచ్చుగ పాటించి ప్రవర్తించు చుండును. అతడు విలపించువారితో చేరి విలపించును, ఆనందించు వారితో చేరి ఆనందించును. అట్టివాని ప్రయోజన ప్రమాణము విశ్వము నావరించి యుండును. అతనికి స్వంతమగు హక్కులనునవియే స్ఫురింపవు మానవ కోటినంతటిని తన కుటుంబముగ పాటించి, నిస్సహాయులను దిక్కులేని వారిని రక్షించుచు, పోషించుచు తనజనకత్వమునకు ధన్యత చేకూర్చు కొనును.

శాస్త్రపరిశోధనా చరిత్రయందు, తమ పరిశోధనా ఫలితములను స్వయముగ తమయందు చేసికొనిన ప్రయోగములబట్టి నిర్ణ

యింతురు. అట్టి ప్రయత్నములు సాగించిన నిదర్శనము లనేకములు కలవు. అనేకులు తమ ప్రాణముల నపాయస్థితిలో బెట్టుకొందురు; అనేకులట్టి కార్యక్రమమున ప్రాణముల పోగొట్టుకొనిరి కూడను. వీరలే ఆత్మార్పణ గావించిన శూరులు; వారి పవిత్ర రక్తధారల తోడనే మానవాభ్యుదయము పరిపోషణ గాంచుచున్నది. మన దేశములోని కోట్లకొలది జనములకు గాలినుండి, వాననుండి తల దాచుకొనుటకై నీడదొరకు టటుండ, తమ దిగంబరత్వమును కప్పి పెట్టుకొనుటకైన తగిన శుభ్రమగు గుడ్డపీలికలైనను దొరకుటలేదు. ఆదశంగూర్చి సానుతాపమునంది, వారితోడ నైక్యానుభూతినిపొంది, తదనుగుణముగ జీవింప గాంక్షించుటవలననే, గాంధీజీ కొల్లాయిగుడ్డను మాత్రమే తన పూర్ణ వస్త్రధారణగా నిర్ణయించుకొనుటకు ప్రధాన హేతువయ్యెను.

సాంఘికములును, ఆర్థికములు నగు క్లిష్టసమస్యలతో నిండి యున్న మనదేశమువంటి దేశమునందు, సామాన్య ప్రజల దారిద్ర్యమును, బాధలను, ప్రతిబంధకములను తమమీదికి తీసికొని, తమ చుట్టునున్నవారి దుఃఖములను తాము స్వయముగ ననుభవించుచు, వానికి దగిన పరిహారములను గనిపట్ట పూనుకొనునట్టి పురుషవరులెందఱో కావలసియున్నారు. ఆ యుద్దేశ్యముతోడనే రవీంద్ర ఠాకూరుగారి శాంతినికేతనము, గాంధీగారి చర్ఖాసంఘము, గ్రామోద్యోగసంఘము నను సంస్థలబోలు నరజీవన పరిశోధనాగారములు, ఆశ్రమములు మొదలగునవి, నెలకొలుపబడియున్నవి. నిగ్గుతేరినట్టియు బాగుగ పరిశోధించినట్టియు విత్తనములను సిద్ధముచేసి వానిని దేశమునందలి తోటలవారికి సరఫరాచేయుకొఱకు ఆరామకృషికులు పెంచు నారుమడులవలె ఉపకరించుటకే ఈ ప్రతిష్ఠాపన లేర్పడినవి.

ఈ పరిశోధనక్షేత్రములందు కనిపెట్టబడు పరిహారములు విశాలవు ప్రపంచోపయోగనిమిత్తమై ప్రకటింపబడుచుండును.

ఇట్టి దివ్యధామము ద్వారమున, మానవజాతిని బాధించుచున్న హింసాద్వేషముల పీడలనుండి విడుదలను సాధింపగల్గుదుము. జన సామాన్య జీవనమును నియమబద్ధము చేసి, కట్టుబాటులో నడుపుటకు, వ్యక్తిస్వాతంత్ర్యమనెడు సూత్రముపై నాధారపడు వ్యష్టి ప్రయోజనదృష్టి చాలదు. కాని అటుల చేయుటకు స్వార్థరహితమును నిస్సంగమును మరియు సుదీర్ఘమునగు దృష్టియే సమర్థమగును. అట్టివిధాన మేర్పడినపుడు సంఘమందలి ప్రతి వ్యక్తియు, అతడెంతటి అల్పదశలోనివాడైనను కూడ, సమష్టిని ఎల్లఱి క్షేమము కొఱకును తనవంతు సహకారముచేయు నవకాశము లుండును. వాని జీవితము వివిధరీతులనుండు పరిస్థితుల సరకుగొనని కేవలానుకరణము కాజాలదు. కొలదిపాటి స్థానికావసరముల కనుగుణముగా మార్పు చేయబడు క్షుద్రావలంబనము కాదు; ఆయావస్తువుల ఉత్పత్తి చేయువారలకు లాభముల చేకూర్చిపెట్టుటకై యెప్పటి కప్పుడు వ్యాప్తిగాంచుచుండు విక్రయక్షేత్రములందలి వ్యాపారమును కాదు; మరియు విశాలతరబాధ్యతలను విస్మరించి, ప్రత్యేకవర్గముల వారి యవసరముల దీర్చునట్టి వ్యవహారమును కాదు. పైరీతిని నిర్మాణము చేయబడిన జీవనప్రణాళిక వ్యక్తులయు, వర్గములయు నవసరముల దీర్చుటేగాక, తోడివారల క్షేమమునకు భంగకరముకాని తెరగున, ఎల్లఱ సుఖసౌఖ్యముల చేకూర్చునదిగను, మఱియు వ్యక్తి వికాసమునకును, వ్యక్తిప్రభావమునకును గూడ చక్కని యవకాశ మొసగునదిగను వెలయగలదు.

అధ్యాయము 11

జీవన ప్రమాణములు

వెనుకటి అధ్యాయమున వివరించిన కారణములబట్టి, దైనందిన ప్రజాజీవనము, వారివారి వ్యక్తిత్వమును ప్రకటించుకొనుట కవకాశ మొసగజాలునదిగను, నియమబద్ధము చేయునదిగను నుండుటెంతయు అవసరము. మనమేమి తిందుమో, మనమేమి ధరింతుమో, మన మేలీరున జీవితముల గడుపుదుమో, మున్నగు విషయము లన్నియు కేవలము మన జీవనసరళికి సంబంధించియుండునవే కావు. అవి మానవకోటియొక్క భావిభాగ్యోదయముపైన గూడ తమ ప్రభావమును జూపునవై యున్నవి. ఏలయన ప్రతి వ్యక్తియు తానవలంబించు ప్రయోజనదృష్టి ద్వారమున తాను జీవనవికాసమును బడయుటే గాక, తానవలంబించు జీవనరీతుల ననుసరించి తన వ్యక్తిత్వమును సయితము ప్రకాశింపజేయుచుండును. అటుల ప్రకటించుటకు, ప్రజలందఱికిని వారివారి లక్ష్యార్థము లుండవలయును; వానిని వారంటిపట్టుకొని యుండవలయును. ఈ లక్ష్యార్థములు కేవలము భౌతిక దృష్టితో నేర్పరచు కొనినవిగనే యుండవలయును; ప్రతి వ్యక్తియు తనసామర్థ్యతలను వృద్ధిపరచుకొనుటకును, తద్వారా తనవ్యక్తిత్వమును వికసింప జేసికొనుటకును సంపూర్ణమగు అవకాశము లుండవలయును. ఈ లక్ష్యార్థములుగాని లేక జీవనప్రమాణములుగాని కేవల శారీరక భౌతికావసరములకు సంబంధించినవిగా మాత్ర మున్నను, చాలదు. వాని యందనే కాంశములు ఇమిడియుండును. ఆయంశము లన్నియు జీవితము కేవలము 'ఉనికి' మాత్రముగ చేసివేయక, ఉన్నతస్థాయికి దీసికొనిపోయి, మహనీయమైన దానిగ చేయ నుపకరించునవిగ నుండవలయును, మానవప్రకృతి నొక స్థాయిలో నిలు

పుట కవసరమగు ఆహారసమస్య సహజముగ వచ్చును; ఉచితమగు వైద్యసాహాయ్యముండవలయును; కేవలము నగ్నశరీరమును కప్పి యుంచుట కేగాక, అందచందముల దృష్టిని తృప్తిపఱచునదగు వస్త్ర ధారణ మవసరమే. జీవితమును విశాలపఱచి తేజోవంతము చేయ జాలు విద్యకావలయును; ఆవిద్యావిధానము నైజశక్తులను బలపఱచి హృద్యమగా పనిపాటుల కనుకూలించి, నరు నందలి కల్పనాకౌశలము నకు ప్రోత్సాహోన్నతులచేకూర్చునదిగా నుండవలయును. ఇంతేల? వ్యక్తియొక్కయు, సమష్టియొక్కయు అభ్యుదయమును చేకూర్చు వసతులన్నింటితో నొప్పునదై యుండును.

ఇటువంటి యవసరముల నన్నింటిని తీర్పజాలు జీవనప్రమాణము స్వతస్సిద్ధముగా వ్యక్తికిని సంఘమునకును గూడ అంగీకార యోగ్యముగ నుండగలదు. ఏదేనియొక సంకుచిత దృక్పథమునుండి దానిని నిర్ణయించుకొనుటకు వలనుపడదు. ఏలాటి నియమ నిరోధ ములును లేకుండ, తన యిచ్ఛానుసారము వ్యక్తిని నడువనిచ్చి, అతడు అనుకరణధామములోనో, పరావలంబనధామములోనో చేరిపోవుట నంగీకరించితిమేని, అతడు సమాజాభ్యుదయమున కెంతమాత్రమును తోడ్పడబోడు: మఱియు అపకారము చేయగలడు. అతడు భౌతిక సృష్టిధామములో చేరిపోయెనా వాని కల్పనలు ఇతరుల క్షేమమున కడ్డుదగులనగును; సమష్టి అభ్యుదయమునకు అవరోధ మేర్పడ దగును. ఒక ఉత్పత్తిదారుని వాని కుతంత్రముల ననుసరించి పోనిచ్చు నెడల, విభ్రాంతి గొలుపు ప్రకటనలతో తనసరకుల నమ్ముకొను యుక్తులపన్నుచు, తన వ్యాపారవృద్ధి కనుకూలించు అందచందాలను, సొగసులను వ్యాపకము చేయును. ఇదిసరిగాదని సమష్టిసమాజమున కే సర్వాధికారమొసగు నెడల, వ్యక్తి పతితుడై నలిగిపోవును; నోరుమెదప

వీలు లేని పశువై పోవలసియుండును. నేడు సామాన్యజనుని గతి, కాపిట లిజము, ఇంపీరియలిజము, ఫాసిజము, నాజీజము, స్టేటుసోషలిజము-అనెడు విధానముల క్రింద ఘోరమైపోయినది. నేడు ప్రపంచమంతయు ఉత్పత్తిదారుని కాలి క్రిందపడి నలిగిపోవుచున్నది. ప్రజలు అతడాడు మనినటుల నాడవలసినదే; అతడు పాడుమనినటుల పాడవలసినదే! ఇదంతయు ఎనలేని గందరగోళమును తెచ్చిపెట్టినది. ఈ స్వార్థపరు లగు ఉత్పత్తిదారులకు సమితము సమష్టిని అంగీకృతమగునేయొక్క ప్రణాళికయు లేదు. వారు దర్శించు జీవనలక్ష్యమునకు త్రోవ, తెన్ను లేదు. ప్రతి ఉత్పత్తిదారుడును తన యిష్టానుసారము ననుసరించి పరువులు పెట్టుచున్నాడు. తత్ఫలితముగ జీవనవిధానమునందు ఏయెడ నను కలవరమే; కల్లోలమే!

ప్రజలు 'జీవనప్రమాణముల'ని పేర్కొనునప్పుడు, వారి భావ మేమో గ్రహించుట కష్టముగ నున్నది తమ మాట సుస్పష్టము కాకుండుటచే వారికి సంతోషము కూడను. కాబట్టి ఒక నిశ్చితార్థము నకు కట్టుబడకుండ నిర్భయముగా ఈ పదప్రయోగమును గావించుట వారికి చాలవీలుగా నుండును. 'జీవనప్రమాణము'న నేమిటో, అందలి యంశములేమిటో యిప్పుడు ప్రతివాడును తన యిచ్ఛానుసారము భావనచేసికో వచ్చును. ఒకని దృష్టిలో రేడియో సెట్టు, మోటారు కారు కేవలము అవసర వస్తువులగును. మరొకనికి రెండు పూటల అన్నము దొరికిన చాలును; అదివానికి భోగమే! కాబట్టి మన దేశ స్థితి ననుసరించి, ఒక నిర్దిష్టప్రమాణమును మనము నిర్ధారణచేసి కొనుట మనకవసరము. ఈ ప్రమాణమునకు ఆర్థికస్థితి ఆధారమా? లేక సంస్కృతి ప్రధానమా? లేక సాంఘికావసరములా? "నిమ్నోన్నత" ప్రమాణములన అర్థమేమి? లౌకిక భోగముల విరివిగ

ననుభవించి తృప్తిచెందుట 'ఉన్నత' ప్రమాణమును, వస్తుసామాగ్రిని చాలమితముగ గలిగియుండుట 'నిమ్న' ప్రమాణములని చెప్ప కొందమా !


జీవితప్రమాణమును నిర్ణయించుటకు గల వివిధదృక్పథములను, భిన్నభిన్న ప్రయోజన ప్రమాణములను వెనుకటి అధ్యాయములలో విచారించితిమి. సద్యస్కాలమున ఘనముగ నెంచుడబ్బును మాత్ర మాధారముచేసికొని, జీవితముయొక్క మూల్యమును నిర్ణయింప దగదని శాశ్వతత్వమునకును, అహింసా వర్తనమునకును దారితీయు ఆర్థికసామ్యావస్థ కావలయుననుచో, సువిశాలాధారములు గల వివిధజీవితాంశముల సమగ్రవిచారణ సలుపవలసి యుండుననియు గ్రహించితిమి. అటువంటి ఆర్థికవ్యవస్థయందు, డబ్బునకు ప్రాధాన్యత చాలతక్కువ. "మానవ జీవితమున కవసరమగునది తిండి యొక్కటియెకాదు" శరీర మానసాత్మలతోగూడిన పూర్ణనరుని స్వేచ్ఛావిలసనమున కవకాశము నొసగు సర్వమును వాని కవసరమే. ఆ సర్వము చేకూరినప్పుడే వానికి పూర్ణతసిద్ధించిన దందుము.

ఇంగ్లాండునందలి జీవనప్రమాణము చాల ఉన్నతమైన దని సామాన్యముగ చెప్పకొందురు. అచ్చటి ఆరామాధికారి మిద్దెపైన మూడునాలుగు పడకగదులును, అక్కడనే పాకీదొడ్డి, స్నానాల గదియు అమరియుండు, రెండంతస్థుల 'కటీరము' లో నివసించు చుండవచ్చును. మేడక్రింద కాపురముండు గదియొకటి, భోజనాల గది యొకటి, మఱియు సంభారములగది, బట్టలుతుకుకొను గదియు నుండును. కిటికీ లన్నింటికిని అద్దాలమడతతలుపులు, వానిపై తెరలు, మూతలు నుండును. తలుపులమీద పెద్ద తెరలు వ్రేలాడుచుండి గాలి దుమారములను చొరనీయకుండును. నేలమీద తివాచీలు

పఱతురు. గోడలకు సొగసగు కాగితము లంటింతురు. ప్రతి గది లోను సరళమును, చౌకగా దొఱకునదియు నైనను అనువగు సామగ్రి చాలినంత అమర్పబడి యుండును. ఉదాహరణకు భోజ నాగారములో ఒక భోజనపుబల్ల, దానిచుట్టు చేతులులేని కురిచీలు, చూపుటద్దము పెట్టిన ప్రక్కబల్ల యొకటి సొగసగు ఆచ్ఛాదనము. కత్తులు, గరిటెలు, అమర్తురు. అత్యాడంబరము లేకున్నను, భోజనపు బల్లపైన సహుపాయములన్నియు చేకురునట్లు గిన్నెలు, పళ్ళెరములు, ముళ్ళగరిటెలు, సాదాగరిటెలు రకరకముల సూపములు, చేపలు మాంసము, మిఠాయి, పండ్లు మున్నగువానిని నారగించుట కవసర మగు నుపకరణముల నెల్ల నమర్చిపెట్టి యుంతురు. ఒకరీతి తినుబండా రమును భుజించుట కుపయోగపడు ఉపకరణములతో, వేఱొకరీతి తినుబండారమును భుజించుట అక్కడ సదాచారముగాదు. చేపల కుపయోగించు ముళ్ళగరిటె, కత్తి, యొకరకముగాను, మాంసము తీసికొనుట కుపయోగించు ముళ్ళగరిటె, కత్తి వేఱొక రకముగాను, ఇంకొకతీరు భోజ్యమున కుపయోగించునవి యింకను భిన్నమయినవి గాను నుండు టాచారము. ఒక పురుషుడు భోజనమునకు కూర్చుండి లేచిన పిమ్మట ఏబది యుపకరణములను కడుగవలసి వచ్చును. అక్కడ ఆచారముగా నంగీకారముబడసిన "ఉన్నత" జీవనమర్యాద సాధారణముగా నిట్లుండును.

భారతదేశములో, యథార్థమగు సభ్యపురుషు డొకడు, కోట్లాది ప్రజల బాగోగులకు బాధ్యుడగు నొక సంస్థానపు దివానో లేక ప్రధానామాత్యుడో యగుగాక, వాని గృహము పెద్ద రాజప్రాసా దముం బోలునదైనను, అందలి సామగ్రి కొలదిపాటిగా నుండును. వాని అతిథిశాల చలువరాళ్ళతో పఱచబడియుండవచ్చును. లేదా చిత్రవర్ణ సంశోభితమైన శిలాఫలకములతోడనో లేక ఇటికల

తోడనో పఱచబడి, కడిగి శుభ్రము చేయుటకు అనుకూలముగా నుండును. సామాన్యముగా దుమ్ము దుమారము పేరుకొనుటకు తివాచీలుండవు. ఆ దివాను పాదరక్షలులేని కాళ్ళతో స్వగృహమున దిరుగాడును; దక్షిణ దేశమున నెందరెందఱో ఘనపురుషు లిటులనే చరింతురు.



రెండుతీరుల భోజనపు టాచారములు

మన దివాను నేల పైపఱచిన ఆసనముమీద కూర్చుండి, యే యరటి యాకులోనో భోజన పదార్థముల వడ్డించగా చేతితో దీసికొని తినును. ముళ్ళగరిటెలు సాదాగరిటెలు చేతబట్టు కళ నతడు నేర్చియుండకపోవచ్చును. ఆ నేర్పును అసాధారణమా కళయే యందురు కొందరు. ఆ ఆచారసూత్రములు సామాన్య జనులకొఱ కేర్పడినవి కావు. మన దేశపు సభ్యపురుషుడు తనకు ప్రకృతి యొసగిన వ్రేళ్ళను ఉపయోగించుకొనును; భోజనానంతరము విస్తరను కడుగవలసిన పని యుండదు; దాని నావల పాఱవేయుదురు. ఏ మేకయో దానిని దినివేసి, యజమానికి శుభ్రమగు పాలనిచ్చును. ఆయన తన హస్తమును మాత్రము కడిగికొనవలసి యుండును. పాశ్చాత్యాచారమున కిది భిన్నమైనదని తెలుపుకొఱకై దీనిని “ నిమ్న ” జీవనప్రమాణ మనదగునేమో.

ఇటుల “ నిమ్న ” “ ఉన్నత ” అను శబ్దముల ప్రయోగించుట సమంజసమగునా ? కృత్రిమముగా కల్పనచేసిన అవసరములను,

అత్యధికముగా పెంచిన సామగ్రిని ప్రమాణముగ నెంచునెడల, ఈ శబ్దముల ప్రయోగమునకు అర్థముండవగును. కాని మనము భిన్న మగు భావమును వహించి చూడనెంచితి మేని, నరునం దంతర్యాత మైయున్న మహోన్నతశక్తులను ప్రకాశమునకు తెచ్చుటే వాంఛి తార్థ మనుకొందుమేని, మన దివాను జీవనము 'ఉన్నత' ప్రమాణము ననుసరించునదనియు, బ్రిటిషు ఆరామాధిపతి జీవనము "నిమ్న" ప్రమాణము గలదనియు చెప్పవలసియుండును. కాని, సార్థకములగు విషయముల గమనించు ప్రమాణముల ననుసరించు నెడల, 'ఉన్న తము' 'నిమ్నము' అను పదములకన్న 'సంకీర్ణము' 'సరళము' అను పదముల ప్రయోగించు టెంతయు సమంజసముగ నుండును. అప్పుడు దివాను జీవనప్రమాణము 'సరళ' మయ్యు 'ఉన్నత' మైన దనియు, బ్రిటిషు ఆరామాధిపతి జీవనప్రమాణము 'సంకీర్ణ' మయ్యును 'నిమ్న' మనియు చెప్పవలసి యుండును. వస్తూత్పత్తి దారుల విక్రయక్షేత్రములకు ఆధారమగు 'సంకీర్ణ' ప్రమాణము నెడగల అభిమానము ననుసరించి ఇప్పుడు వాడుకలో నున్న (నిమ్నో న్నత) శబ్దములు ప్రత్యేకముగా కల్పింపబడెనని తోచుచున్నది. 'సంకీర్ణ' మని తమ ప్రమాణమునకు పేరిడుదుమన ఎవరు సమ్మ తింపగలరు ?

'సంకీర్ణ' ప్రమాణము తన నాశ్రయించు నతనిని కష్టజీవిని చేసి వేయును. బ్రిటిషు ఆరామాధిపుని భార్య, పరిశుభ్రజీవనము గడుప నెంచునెడల, ప్రొద్దున మొదలు రాత్రివఱకు *'వ్యాక్యూమ్ క్లీనరు' తో తివాచీలను దులుపుచునో, కిటికీ అద్దములకు మెఱుగులిడుచునో, ... గుడ్డలను, పక్కలమీదను, మేజాలమీదను, పఱచు గుడ్డలను ఉతుక

* ఒకరీతి దుమ్ము దులుపు యంత్రము.

చునో, గిన్నెలను పళ్ళెములను కడుగుచునో, వంటపాత్రలను తోము చునో, అంగడి బేరములు వంటపనులు సవరించుకొనుచునో, బండ చాకిరిలో సదా మునిగియుండవలసినదే. ఒక్క ముళ్ళగరి సైననుసరిగా తోముటకు వలయునంతకాలమును, శ్రమయు ఎవరిచేతులను వారు కడుగుకొనుటకు అవసరములు కావు. ఇటువంటి 'సంకీర్ణ' జీవనప్రమాణములు వెలయు దేశములందు, స్త్రీలు బిడ్డలపీడ తప్పించుకొనాతురపడుట యబ్బురమా? ఆలాంటి దేశములలో "శిశువులకు స్థానములకు నింద కావులేదు" అనెడు ప్రకటనలు గల బల్లలు ఎల్లెడల కండ్లబడుచుండును. దినమెల్ల తీరికలేని కార్యక్రమము మాతృధర్మము నింకను భారముచేసివేయగలదు. వారి 'సంకీర్ణ' ప్రమాణావలంబనము, వారు వారుపాటించు ప్రయోజనప్రమాణములను బయటపెట్టుచుండును. ప్రచారములు, ప్రకటనలు, అందాల కల్పనలు మొదలగు వివిధోపాయములను, తమ కందుబాటులో నున్నంతవఱకు, వారు ప్రయోగింతురు. గృహిణు లిటువంటి జీవనగతుల నవలంబించి, తమ నభిమానించు కొనుగోలుదారు లౌనటుల, వస్తూత్పత్తిదారులు ఎన్నెని ప్రబల ప్రేరేపణలను కల్పింపగల్గుచున్నారు. సుంతయు లాభములేని అవసరములకు దాసులగావించి పడవేయుచున్నారు. ఈలాంటి వలలలో పడకుండ మనము జాగ్రత్త పడవలసి యుండును. అట్టి వానివలన చేకూరు సత్ఫలమేమియు నుండదు. అవిపృథాగా అల్పస్వల్ప కార్యకలాపముతో మన సమయమునంతను నింపి వమ్ముచేయును. అవి మన జీవన చర్యనుబండచాకిరిగ మార్చివేయ గలవు

శ్రమనివారణోపాయము లనుచు ప్రవేశపెట్టి, వానివలన గృహిణులకు చాలతీరిక, సుఖము లభించునను భ్రమలుపెట్టి, స్వార్థపరులేమేమో ప్రచారములు చేయుదురు. మానవ శ్రమను తొలగింతు

మనెను మిషతో నొకయంత్రమును నెమ్మదిగ ప్రవేశపెట్టుదురు. తోడ్తోడనే, వేఱొకపన్నుగడ వచ్చిపైపడును. ఆమొదటి పన్నాగమువలన ఆదాచేసికొని గలిగిన కొలదిపాటి ధనమును, కాలమును రెండవపన్నుగడ వచ్చిహరించి వేయును. అప్పటి గృహిణీజీవనము పూర్వదశయందు కంటె రెండవదశాంతరమున హెచ్చుఅనర్థకరమై పోవును.

నిదర్శనమునకై మనమిత్రుడు బ్రిటిషు ఆరామాధిపుని భార్యస్థితినే విచారింతము. పూర్వపు జంపుకాణాలు మనుష్యులే కష్టపడి, ఉతికి, బాగుచేసి కొనుటకు తగియుండేవి. "వ్యాక్యూముక్లీనరు" యంత్రములు వెలసిన పిమ్మట ప్రత్యేకముగా మానవశ్రమ అవసరము లేకుండ పోయినది. ఒక సంచార విక్రియదారుడు ఆరామాధిపతి భార్యాదర్శనమునకు వచ్చును. తాను విక్రయింపనున్న 'వ్యాక్యూముక్లీనరు'యొక్క అత్యద్భుత ప్రయోజనముల గూర్చి భట్రాజువలె పొగడ్తల సాగించును. తివాచీలు శుభ్రపఱచుట వంటిభారపు పని చేయుటకు సేవకులపెట్టుకొను అవసరము గడచిపోయినదనును. ఆమె సంవత్సరమున కెంతసొమ్ము నాదాచేయ వచ్చునో, పొదుపు నాశించు నాగృహిణికి గణితము వేసి చూపును. మఱియు ఆమె జీవితకాలములో నెంతపొదుపు చేసికొవచ్చునో వివరించును. ఇంకను వడ్డీక్రింద యీలాభమున కెంత చేర్పవచ్చునో నచ్చచెప్పును. విక్రయదారుడు ప్రయోగించు నీప్రలోభముల కంతకు ఫలముగా ఆగృహిణి ఒక 'వ్యాక్యూముక్లీనరు'ను కొనును. అందుమూలమున సంవత్సరమునకు కొన్ని షిల్లింగులాదాయ మామెకు చేకూరగలదు. 'శ్రమనివారకయంత్రము'ని పేరేగాని, 'వ్యాక్యూముక్లీనరు'తోడి పనంతయు ఆమెయేచేయవలసి వచ్చును. కొలదికాలము పిమ్మట ఆసంచార విక్రియదారుడు మఱల దర్శన మిచ్చును. ఆమెయొద్ద కొన్నిపౌనుల

ఆదాయము చేరియుండును. ఈసారి తాను క్రొత్తగా కనిపెట్టిన యింకొక యంత్రము దెచ్చును. గిన్నెలను కడుగు ఆ చిత్రసాధనమును అమ్మజూపును. ఆ యంత్రపటిమను అతిశయోక్తులతో వర్ణించును. ఆగృహిణి కూడబెట్టి కొనినడబ్బు వానికీయదేలిన సొమ్మునకు తక్కువై యుండును. అప్పుడాత డెంతయో ఔదార్యమును, సానుభూతిని ప్రకటించుచు, వాయిదాలవారీగా సొమ్ము చెల్లించే విధానమును దెలుపును. ఈఅరువుకొనుగోలుపద్ధతి, ఆమెకునచ్చును. అంతట నామె వెంటనే చెల్లించగల సొమ్మునంతటిని చెల్లించును. అతడా యంత్రమును వాడుకొనుచుండు మనియిచ్చి వేసిపోవును. ఐదేళ్లో, ఆరేళ్లో, సంవత్సరపు వాయిదాల పద్ధతిని, ఆయంత్రపు అద్దె క్రింద ఆమె సొమ్ము చెల్లించుచుండ వలయును. పిమ్మట ఆయంత్రము ఆమె స్వంతమై పోగలదు. ఇట్లా యిల్లాలు వర్తకుని ప్రలోభముల వలలో పడిపోవును. తాను మూండెన్నడో నిలువ చేసికోగల డబ్బును గిన్నెలకడుగు యంత్రముకొఱకై తాకట్టు పెట్టివేసినది. ఏ ముసలమ్మయో వచ్చి, బహుశః, దినమున కొక యరగంట, సాహాయ్యముచేసి పోవు అవసరము ఆమెకు తీరిపోయినది. యీతీరుగా వారానికి రెండు షిల్లింగుల ఆదాయము లభింపనగును. కాని, ఆయంత్రముతో స్వయముగా పనిచేయు నవసరము ఆమెపై బడినదే! మఱియు 'వ్యాక్యూముక్లీనరు' కు గాని, గిన్నెల కడుగు యంత్రమునకుగాని, కొంచెము మరమ్మతు కావలసినయెడల దానిని సరిచేయు నిమిత్తమామె సంచారశిల్పికి కబురు చేయవలసి యుండును. అతడు వచ్చి తాను వినియోగించు కాలమునకై కొంత డబ్బుతీసికొని, ఆయంత్రమును కొంత సవరించి పోవును. ఈ విధముగా మానవశ్రమను తొలగించు యంత్రముల వాడుకచే ఆదా చేసిన కాలము, సొమ్ము రెండును ఉత్పత్తిదారుని మూలముననే

వ్యయమైపోవుచుండును. పాపమా ఆరామాధిపతి భార్య తనకు సాయముపడుచు వచ్చిన తోడిమానవుల శ్రమను తొలగించుకొని, తానే గాడిదవలె శ్రమపడవలసి వచ్చినది. యంత్రరూపసేవకులను సంబాళించుటకిప్పుడు హెచ్చుశ్రమ అవసరముయినది. తనకు దొరికి పోయినదని యువ్విళ్లూరిన విశ్రాంతి మాయమైపోయినది. అంతయు భ్రమయని తేలినది. ఆమె యేమి ఆదాచేసికొనిసను, మఱొకటే దేని "శ్రమనివారకయంత్రము" వచ్చి హరించివేయును. ఆమెకు వాస్తవముగ లభించిన లాభము సున్న. ఆమెకేదేని వచ్చి యొటి గెనా? అది గురుతరమగు కార్యభారమే. తనయంత్రములను స్వయముగ వాడుకచేయు బాధ్యత పైబడినది. ఇక్కడనుండి తరిమివేయబడిన మానవశ్రమ నిర్వ్యాపారమున ఉత్పత్తిదారుల కర్మాగారపు ద్వారమునొద్దజేరి, తుదిని "అన్నమో, రామచంద్రా"! "ఉద్యోగమో, రామచంద్రా!" అను నినాదములు చేయుట పరిణామము దాల్చును. ఈ కథాలాపమును ముందుముందింక విచారింతముగాక!

మన ఆరామాధిపతి భార్యయొక్క జీవనప్రమాణము మారి, ఆమెయొక్క శ్రేష్ఠతరశక్తిరాశి స్వేచ్ఛగా వినియోగపడుట కవకాశము లామెకు లభించెననగలమా? ఈసంకీర్ణ జీవనప్రమాణమామె యొక్కయూహాపోహలకు హెచ్చువసతుల కల్పించెననియందుమా? లేదు. అందుకుమారుగా, ప్రతిపనియు స్వయముగ, అన్యుల సాహాయ్యములేకుండ, ఆమెయే చేసికోవలసి వచ్చిన కారణమున, ఏదేని పత్రికనైనను జదువుకొనుటకు తీరుబాటులేకుండ బోయినది. రేయింబవళ్ళామె బండచాకిరి చేసికోవలసి వచ్చినది. ఇదంతయు దేనికొఱకు? వాస్తవికజీవితానుభవమును ప్రసాదించు కర్మ ఇసుమంతేని లేకుండనే, ఆమె సమయమంతయూ సరిపోవుచున్నదే! ఈ బ్రతు

కునకు 'యథార్థజీవన' మని యర్థము చెప్పగలమా? కేవలపు 'టునికి' కంటెను నికృష్టమైనదేయిది!

సరళజీవనమో దీనికి భిన్నమైనదైనను "ఉన్నత" మైనదన వచ్చును. మానవ జీవనమునందలి యుత్తమ లక్షణములన్నియు అందు నెలకొనియుండును. బహుశః అన్యులచే నిర్ణయింపబడిన బాటలలో నడువజేసి, వ్యక్తిత్వము మారణముచేయు 'సంకీర్ణ' జీవనము కన్న శ్రేష్టతరమనియే చెప్పవచ్చును.

భోజనసందర్భమే విచారింతము. ఏ ఆహారమైనను పాశ్చాత్య పద్ధతిని తీసికొనినను భారతీయపద్ధతిని తీసికొనినను పుష్టి నొసగుటలో భేదముండదు. భారతీయపద్ధతి చౌక. మరియు పరిశుభ్రమైనది. వడ్డన చేయుటలో కథావిన్యాసమున కవకాశము గలదు. తాజా పచ్చని విస్తరిలో వడ్డనచేయుటను మించిన రమ్యమగు దృశ్యమేది యుండ గలదు? ధవళమౌ వెన్నముబోలు అన్నము లేక రొట్టె, పసుపువన్నె పప్పు, తెల్లని పెరుగు, ఎఱ్ఱని పచ్చడి, ఊదారంగు ఊరుగాయ, మఱియు రంగురంగులకాయగూరలు, ఎఱ్ఱని రామ ములగలు, ఇట్లె న్నియో చూడ ముచ్చట గొలుపును. భోజనము ముగిసిన పిమ్మట విస్తళ్ళు ఎత్తివేయుదురు. నేలను చక్కగ కడుగుదురు. విందార గించువారో వ్రేళ్ళతో భుజించి, అనంతరము పండ్లు తోముకుందురు. నోట పుక్కిలించి కడుగుకొందురు. ఇదెంతయో హృద్యమును, ఆరో గ్యప్రదమునగు నాచారము. కాని ఇట్టి చక్కని ఆచారమును విస ర్జించి కొందరు ముళ్ళగరిటెలను, చంచాలను వాడసాగినారు. ఈ యాచారావలంబులం గాంచుడు, తమ వ్రేళ్ళకొనలను సొగసుగా నీటిపళ్ళెరములో ముంచి, పెదవులను మాత్రము తడిచేసి, తుండు గుడ్డతో తుడిచికొందురు. అదే చాలవిశేషము. ఈ 'సంకీర్ణా' చారమును అవలంబించువారి ఘనతగాని, యోగ్యతగాని యెందు

న్నదో తెలియదు. సంకీర్ణజీవనమర్యాదలు హెచ్చు వ్యయకారణములేగాని, అందుకు దగిన ఆరోగ్యలాభముగాని, కళావిశేషముగాని లభింపవు. కాబట్టి లోగడ తెలిపినటులపాశ్చాత్య మర్యాదను, ' సంకీర్ణ ' మనియు, మన మర్యాదను ' సరళ ' మనియు వర్ణించుట, వానిని ' ఉన్నతము ' ' నిమ్నము ' అని వర్ణించుటకంటె మిగుల సమంజసముగా నుండును.

గుణభేదమును గుర్తించుచో, ఒకే ప్రమాణమునందే ' ఉన్నతము ' ' నిమ్నము ' అని చెప్పకోదగిన జీవనప్రమాణములు గోచరించగలవు. ముతక బట్టలను కట్టుకొని తృప్తిపడువానికంటె, సన్నని ధోవతిని ధరించు పురుషుడు ' ఉన్నత ' ప్రమాణము నవలంబించువాడనదగును. మఱియు పాశ్చాత్యుల అందాలు ననుసరించి కత్తిరింపులుచేసి, కుట్టుకోట్లను, మెడపట్టిని, మెడముడిని, బహుశః టోపీని సయితము ధరించు నరుడు, ఆ కారణముచేత, ఒకధోవతి కుడ్తాను వేసికొనువానికంటె ' ఉన్నత ' ప్రమాణముగలవా డనిపించుకొనజాలడు. టోపీని ధరించు పురుషుడు సంకీర్ణప్రమాణము ననుకరించువాడు కాగా, ధోవతి ధరించు మనుజునందు హెచ్చు కళాచాతుర్యముగల దలంచవచ్చును.

వాని ధోవతి అందమునందు ప్రాంతీయుల భావము ననుసరించి సొంపుగ నేయబడినదై, అచ్చటి శీతోష్ణస్థితికి, అనుకూలముగా నుండును. ఇదేతీరున తుష్టిని పుష్టిని నొసగు ఆహారమును దినువానికన్న, ఊరుగాయతోనో, ఎఱ్ఱగారపు పచ్చడితోనో అన్నము దినువాడు ' నిమ్న ' దశనున్నవాడని తోచవచ్చును.

పరాన్నపరిపోషణమునకో, లేక స్వీయపరిపోషణమునకో చెందిన రాయొకని జీవనము, ఉపకారపరిపోషణమునకు చెందినవాని జీవనముకన్న తప్పక " నిమ్న " మైన దనవలయును. దేశోపకార పరాయణు

డైన యొక ఆశ్రమవాసియొక్క జీవనప్రమాణముతోడ పోల్చి చూచినయెడల, ఎంత వ్యయముతో కూడినదైనను లక్షాధికారి జీవనప్రమాణము నిమ్నమైనదే సుడీ!

ఎంత గొప్పగా చెప్పుకొన్నను సాహసపరిపోషణ విధానమునకు చెందిన బ్రిటిషు ఆరామాధికారికంటె, సమూహపరిపోషణకు చెందిన వాడు, వాని భౌతిక జీవనవిధాన మెటువంటిదైన నగుగాక, హెచ్చు ప్రమాణమే కలవాడే యననగు. భారతీయ దివానుయొక్క జీవనమును గూర్చి, వెనుకటి ఉదాహరణలో వివరముగ చెప్పుకొని యుంటిమి.

పోటీపడుచు, సంకీర్ణతను వృద్ధిచేయుచు, అటుల చేయుటలో మానుషప్రమాణమును అధోగతికి ద్రోయుటయే, నవనాగరిక జీవనమున పరిపాటియై సాగుచున్నది.

అమెరికాలో, కృత్రిమపు జీవితాదర్శములను ప్రచారము గావించుట మూలమున, గృహస్థజీవనము వేవేగము శిథిలమైపోవుచున్నది. ఒకటిరెండు గదులుగల డాబాయింటిలో, "శ్రమనివారకోప కరణము"ల బెట్టుకొని భార్యాభర్తలిద్దరు కాపురముందు రనుకొనుడు. భర్త ఉదయముననే లేచి పనిపాటులకై పోవును. భార్యయు అటులనే పోవును. త్రోవలో వారు వేర్వేరు కాఫీవిక్రయశాలలలో నెక్కడనో తొందఱతొందఱగా ప్రాతఃకాలభోజనము నారగింతురు. ఏదేని ఫ్యాక్టరీకడనుండు పూటకూళ్ళ ఇంటిలో, మధ్యాహ్నపు తిండి తిందురు. సాయంతనమున వారిరువురు మఱలకలిసి, యొక భోజనశాలలో భుజింతురు. మఱియు వారిరువురి సంపాదన అనుకూలపడునెడల, నొక కారునెక్కి విలాసముగా విహారమునకు పోయివత్తురు. సినీమా చూడబోదురు. రాత్రికి తమగదికి మఱలివచ్చి 'రేడియో' విందురు. వారికి యిల్లు చక్కబెట్టుకొను పని లేదు; వంటపనియుండదు;

గృహస్థలక్షణము లెవ్వియు గానరావు. పిల్లలజంఝాటనయా వారు పెట్టుకొనరు; ఇంతేల వారి 'ఉన్నత' జీవన ప్రమాణమున అటువంటి దాని కవకాశముండదు. తమ ఫాక్టరీపనులకై శిక్షణపొందిన ప్రజల కొఱకు, ఉత్పత్తి దారులు తమక్షేమమున కనుకూలముగా, కల్పించిన, "ఉన్నత" జీవన ప్రమాణము ననుభవింపుచు, బండచాకిరిచేయు వారు వీరే! అప్పుడప్పుడు బ్రిటిషు ఆరామాధికారి భార్యకు సహకారులుగ వచ్చుచుండెడి వారును, అతిథిమందిరాల దాసీలును మఱి యిట్టి ఇతర గృహపరిచారకులును, ఇట్లు ఫాక్టరీద్వారములకడకు ఆకర్షింపబడి వేయుదురు. ఆతీరున వారి జీవనప్రమాణము 'ఉద్ధరింప' బడుచున్నది.

అటువంటి 'ఉన్నతప్రమాణముల సృష్టించిపెట్టుట లోకోపకార బుద్ధితో ప్రజల అభ్యున్నతికొఱకు గావింపబడు సంస్కరణమా? స్వీయలాభముకొఱకు స్వార్థపరతతో పన్నిన దుస్తంత్రమే యిది. గృహసేవకాగణమును ఫాక్టరీపనివాండ్రుగా మార్చివేయుటేగాక ఉత్పత్తిదారులు కల్పించు 'ఉన్నతప్రమాణము'ల మూలమున, తమ నాశ్రయించిన పనిపాటుల వారిచర్యలను, క్రియాస్వాతంత్ర్యమును స్తంభింపజేసి వేయుదురు. ఇట్టి భౌతికప్రమాణములు పెంచబడినకొలదిని పనిపాటులవారి బేరములాడగల సమర్థత క్షీణింపజేయబడుచుండును.

తనపనివాండ్రు, ఎన్నడును ఇతర వ్యాపకములను కోరుకొనకుండునటుల, తన యుత్పత్తి ఎగుడుదిగుడు లేక స్థిరతరముగ సాగునటుల, శ్రామికులు సక్రమముగ పనిలోనికివచ్చు నిమిత్తమై, తన పనివాండ్రకు 'సంకీర్ణ' జీవన ప్రమాణమును అలవాటు చేయుదురు. 'ఉన్నత' జీవనప్రమాణమని ఘనమగుపేరిడి, శ్రామికుల వశము చేసికొను తంత్ర జాలమును మిల్లుయజమాని నిరంతరము పన్ను

చుండును. ఈ తంత్రము ఫలించుకొఱకు అతడు పనివాండ్రుకు హెచ్చుజీతము నిచ్చును. ఉదారములుగ చూపట్టు నుపకార ప్రణాళికలకు ప్రోద్బల మిచ్చును. ఫ్యాక్టరీజీవనపు రమణీయతకు చిహ్నములట్లు క్లబ్బులు, టీమందిరాలు, వినోదాలు, సినీమాలు సుఖ తరములగు బసలు మొదలగు వానికి పనివాండ్ర నలవాటు పడ జేయును. దీనికంతకు పర్యవసాన మేమిటో చూడుడు. పైన వివరించిన రీతిని, అమెరికాదంపతుల 'సంకీర్ణ' ప్రమాణముతో నెలయు జీవనమునకు పనివాండ్ర భ్యాసపడుదురు. ఫ్యాక్టరీ యజమాను లెన్నినియమములను భగ్నపఱచినను కూడ, తమ స్థానమును మార్చుకొనుటకు సమ్మతింపజాలని స్థితిలో పడిపోవుదురు. వారి జీవనప్రమాణము చాలవ్యయ కారణమగునది కాబట్టి, పనిపోయిన యెడల, తమ కాధారముగ నుండదగిన నిలువసొమ్ము శ్రామికులయొద్ద నుండదు. భౌతికావసరముల కని, డబ్బు వెచ్చించుటకు వారలవాటు పడి యున్నారు. కాబట్టి ఆ అవసరములు తీరనియెడల తాము బ్రతుకనే లేమనెడు భయము వారిని పట్టుకొని యుండును. ఈతీరుగా పనివాండ్ర స్వేచ్ఛావర్తనమును బేరమాడగల శక్తియు కుంటువడి పోయి, వారుపనిచేయు 'బల్ల' (ఫాక్టరీలో పనిచేయుచోటు)ను విడిచిపోలేక దాని కంటుకొనియే పడియుండ వలసివచ్చు చున్నది. వారి జీవనప్రమాణ మిప్పుడు, ఎద్దుకు పొడిచిన ముకుత్రాడువలె బాధించును. అది శ్రామికుల స్వాతంత్ర్యేచ్ఛను గంగపాలుచేసి, వాండ్రను యజమాని చిత్తమునకు బానిసలచేసి వేయుచున్నది.

విదేశపరిపాలనక్రింద, ప్రభుత్వోద్యోగుల కీయబడిన హెచ్చు జీతములును ఇట్టి స్వభావము కలవియే సుడీ! ఎంతమంది దేశభక్తులో, అటువంటి యెఱకులోనై, ధర్మమార్గము నుండి తొలగిరి. వారి అంతరాత్మను చంపుకొని, ఉద్యోగపువలలో చిక్కుకొని పోయిరి. తోడ్డి

ప్రజలకు వ్యతిరేకముగా ఘోరకార్యములుచేయ పాల్పడిరి. తమ కాలాటి నిర్బంధము లేక, స్వేచ్ఛయే యున్నయెడల, అటువంటి నీచకార్యములకు వారొడంబడెడి వారుకారు. రమణీయమును, సుఖప్రదమునునై గోచరించు బ్రతుకు వారిని భ్రష్టులగావించి, వారిలో ప్రయోజన ప్రమాణముల గూర్చిన జ్ఞానమును ధ్వంసముచేసి, వారి సత్కార్యోత్సాహమును అధఃపతితము గావించినది.

పెట్టుబడిదారులయు పనిపాటులవారియు బేరమాడగల సమర్థతను దృష్టిలో పెట్టుకొని చూడుడు. యజమానికిని పనివారలకును మధ్య తగాదా సంభవించునెడల, యజమానిచేతిలో నిలువడబ్బు హెచ్చుగానుండు కారణమున, పనివారల బింకముతగ్గి, లోబడివచ్చువఱకును అతడాగగలడు. ఎప్పటికప్పుడు, తమకూలిడబ్బులమీద ఆధారపడు పనివాండ్రో హెచ్చుకాలము నిలువబడి నిగ్రహించలేరు. స్వల్పకాలముననే లేమికిని, ఆకలిబాధకును లొంగిపోవలసినవారగుదురు. సరళమై, తత్కారణముచేతడబ్బు ఖర్చంతగా సక్కరలేని జీవనవిధానము నవలంబించు పనివాండ్రు సంకీర్ణమై అందువలన ధనవ్యయ కారణమును అగు జీవనవిధానము, నవలంబించు పనివాండ్రకంటె హెచ్చుకాలము బాధల నెదుర్కొన గల్గుదురు. కాబట్టి, తన పనివాండ్రు హెచ్చుకాలము తనతో బేరములాడగల స్థితిలో నుండకుండులాగున, వారలకు సంకీర్ణ జీవనప్రమాణము నలవాటు చేయుటయందు యజమాని మిగుల నభిలాష జూపుచుండును. పనివాండ్ర సందర్భమున ఈ కారణములటుండగా, సంకీర్ణ జీవనవిధానము ఉత్పత్తిదారునికి మంచి అంగళ్ళను సృష్టించిపెట్టుటలో, అనగా వాని సరకుల నమ్ముకొను వసతులను కల్పించుటలో, నెట్లు తోడ్పడగలదో బ్రిటిషు ఆరామాధిపుని కుటుంబ సందర్భమున గ్రహించియుంటిమి. కాబట్టి అటు చూచిన ఉత్పత్తి

పక్షమునను, ఇటుచూచిన విక్రియపక్షమునకుకూడ, సంకీర్ణ జీవన విధానము ఉత్పత్తిదారునికే లాభదాయక మగుచున్నది.

అమెరికనులవంటి పారిశ్రామికజాతులు, పైని వివరించిన, 'విజ్ఞానమయ స్వార్థ' మనందగు విధానము నవలంబించుచున్నవి. కాని ఆ విధానము నరుని క్రియాస్వాతంత్ర్యమునకును, వ్యక్తిత్వ వికాసమునకును విరుద్ధమైనది. సంకీర్ణజీవనప్రమాణమును ప్రవేశపెట్టుటలో గాని, అనుసరించుటలోగాని ఇతరములగు నుద్దేశ్యములును గలవు. అవి సామాన్యప్రజల కంతగా జోక్యములేని వగుటచేత, మనము చూచాయగా మాత్రము వానిని విచారించిన చాలును.

ఆడంబరప్రియులకు సంకీర్ణప్రమాణ మవసర మగును. ఒక పురుషుడు ఇతరులదృష్టి నాకర్షింపగోరిగాని, ప్రఖ్యాతి నపేక్షించిగాని తన భటులకు విశిష్టవేషధారణను నియమించవచ్చును. విశిష్టవేషము సేవకుని వ్యక్తిత్వమును మఱుగుపఱచి, వాని దాసత్వమునకు ప్రాధాన్యత నొసగును. అతడిక రాముడో, రహిమానో కాడు. డ్రైవరో, ప్యూనో, డఫేదారో, చప్రాసియో యై పోవును. అటువంటి సేవకులు, పాపము! అమాయికపు దరిద్రులు; తమ స్వీయసామాన్య జీవితములో, తమ సేవాచిహ్నముగా ధరించుపాటి సొగసగు వస్త్రధారణను చేసికోజాలని కారణముచేత, ఆ దాస్యచిహ్నపు దుస్తులను వేసికొని యెంతయో గర్వముతో మురిసిపోదురు. ఆడంబరార్థమై చేయబడు వ్యయమును "దంభపు దూబర" అనుట సమంజసమే. మన దేశమునుబోలు దరిద్రరాజ్యములో అట్టి అభ్యాసములు "గొప్ప నేరముగా పాటింపదగిన దూబర" యనదగుట తథ్యము.

సంకీర్ణజీవన ప్రమాణమువలన విశిష్టతకై, వేఱై నిలుచు అల్లవాటు బలపడుచున్నది. మొదటితరగతి రైలుపెట్టెలో ప్రమాణ

ములు చేయుట, ధనాఢ్యులు వసించు ప్రాంతములందు బసలు చేయుట యీలాటి అలవాటు లిట్టివే.

మన దేశముయొక్క సందర్భములో ఏ యొక్క ప్రమాణమును గాని కచ్చితముగ నిర్ణయింపజాలము. ఏప్రమాణము నిర్ణయించుద మనినను ఆయా ప్రాంతముల కవసరములగు ఆహారపుష్టి, అందలి శీతోష్ణభేదములు, మానవాభ్యుదయమునకుగల వసతులు, వ్యక్తిత్వమును ప్రకటించుకొనుట కనువగు అవకాశములు, ఇత్యాదివిషయముల నెన్నిటినో విచారణలోనికి దీసికొనవలసి యుండును.

దక్షిణభారతమున వరియన్నము పుష్టికరమగు ముఖ్యాహారము కావచ్చును, కాని బియ్యము మెఱుగు పెట్టనిదిగా నుండవలయును. దేహమునకు కావలయు అన్ని అవసర పదార్థములు లభించుకొఱకై పాలు, పప్పు, కాయగూరలు, చమురు మున్నగు నితరవస్తువులను గూడ చేర్చవలయును. ఇచ్చటి శీతోష్ణస్థితిని బట్టి విస్తారమగు వస్త్రధారణగాని, ఏలాటి పాదరక్షలుగాని అవసరము లేకపోవచ్చును. చాపవేసికొనిన అదేమంచిసెజ్జ కానోపును. ఉత్తర ప్రాంతమున, ఇతరాహార పదార్థములతో గూర్చి సమతకు దెచ్చిన గోధుమ రొట్టె పుష్టికరము కాదగును. అచ్చటి శీతకాలపు చలిమూలాన హెచ్చుగ వస్త్రములు, పాదరక్షలు, జంబుకాణాలు, మంచాలు అవసరములగును. ఇట్లు ఒకప్రాంతమున అవసర వస్తువులగునవి, మఱొకప్రాంతమున వ్యర్థపు భోగవస్తువులు కావచ్చును. కాబట్టి స్థానికములగు పరిస్థితులను బట్టియు, పరిసరములను బట్టియు జీవన విధాన మెటువంటిదిగా నుండవలయునా యనునంశము విచారించి నిర్ణయింపవలసి యుండును.

ఒకరేర్చుకొనిన జీవనప్రమాణము శాశ్వతమును, అహింసా పద మునై యొప్పువలయుననుచో, అయ్యది ప్రాంతీయ ప్రజల ఆర్థికదశ

కనుకూలముగా నుండవలయును. ప్రకృతి గిరులు గిరులుగా (అంతరములుగలిగి) వర్తించుననుటను వెనుకటి ఒక అధ్యాయములో కనిపెట్టియుంటిమి. ఒకవర్గము వారి జీవనము మఱొక వర్గము వారి జీవనమును పూర్ణముచేయు అంతరముగా ప్రకృతియెట్లు పొందుపఱచునో గ్రహించితిమి. ఈగిరులు భంగపడునెడల హింసాచర్యలు చెలరేగి, యెట్లువినాశమును చేకూర్చునో తెలిసికొని యున్నాము. వ్యక్తులశక్తి సామర్థ్యములు పరిణతి పొందుట కవకాశములు కల్పించుటయు, వ్యక్తిప్రతిభను ప్రకటించుటకుదగిన విధానముల కాధారములు కూర్చుటయు ఏనిర్ణీతజీవన ప్రమాణమునకు గమ్యములుకావు. ఆ నిర్ణీతమైన జీవనప్రమాణము సమాజము నందలి ఆయావర్గప్రజల మధ్య సంబంధ బాంధవ్యముల కూర్చునదిగా నుండవలయును. అప్పుడు హెచ్చు సౌకర్యములు గలవారు తక్కువ సౌకర్యముగల వారితో సహకారము సలుపగల్గుదురు.

బ్రిటిషు ఆరామాధికారి శయ్యలందు స్ప్రింగుపరుపు లమర్పబడియుండనగును. ఇవి ఫ్యాక్టరీలలో ఎవరిపరిశ్రమ ద్వారమున సిద్ధము చేయబడుచున్నవో చూడుడు. ఆ ఆరామాధికారి యింటికి తఱుచు వచ్చుచు, తివాచీలను దులుపుటలోనో, పాత్రలను శుభ్రము చేయుటలోనో, మునుపుసహకారము సలుపుచు వచ్చినజనుల శ్రమవలననే ఆరామాధికారియింట వారి సహకార స్థానమిప్పుడు శ్రమనివారకోపకరణము లాక్రమించుకొనినవి. ఆ జనులలో సంకీర్ణ జీవనప్రమాణపు భ్రమలకు లోనై, ఫాక్టరీయజమాని వలలో పడిపోయినారు. ఈ పరుపులు ఉక్కుతీగలతో నమర్చిన స్ప్రింగులు పొదిగినవి. ఈ ఉక్కుతీగలు ఫాక్టరీలలో తయారు చేయబడినవి. ఈ పరుపులలో ఏభాగమైనను చెడెనేని, ఏ ఫాక్టరీపనివారి కూటమో, మరమ్మతు చేయవలసి యుండును. కాని ప్రజల జీవితమునకును, ఆ పరుపుల

ఉత్పత్తికిని నడుమ నిర్మాణాత్మకమగు సహజమగు జీవితానుసంధానము సున్నయే

'ఉన్నత' మునై 'సరళము' నగు జీవనమును గడపు మన దివానును చూడుడు. ఆయన ఒక చాపపైని పరుండును. ఆ చాప మోటురకపు చాప కాకపోవచ్చును. ఏ ముప్పదియో అంతకన్నను హెచ్చో యగు సన్నని చీలికలుగా చేయబడిన తుంగగడ్డితో, పట్టుదారాల మగ్గముమీద, నొక 'పట్టుశాలి' నేసినది కానగును. ఆ చాపలు స్ప్రింగు పరుపులకంటె చల్లగానుండును; మఱియు ఆ చాప స్థానికముగా నిర్మింపబడిన వస్తువు. దీనిని తయారుచేయుటవలన ఆ నేతగాడు కళావిజ్ఞానము నభివృద్ధిపఱచుకొనుటకును, చాకచక్యము పెంపుచేసికొనుటకును సావకాశము కల్గుచున్నది. వాని నిర్మాణ కౌశలమునకు ప్రోద్బలము కలుగుచున్నది. ఈవిధముగా అతను తన వ్యక్తిప్రభావమును పరిణతికి దెచ్చుకొనుటకును, దానిని లోకమున ప్రద్యంచుటకును వసతులేర్పడుచున్నవి. ఈ చాపలమీద చిత్రవిచిత్రరూపములు అల్లబడియుండును; మెత్తగా నుండును. పట్టుగుడ్డవలె మడతలు పెట్టవచ్చును. వానిని ఉతుకుటకును వీలగుటచేత పరిశుభ్రముగ నుండును. వీనిలో హెచ్చునాణ్యముగలవి హెచ్చువెలగలవనుట నిజమే. ఆ చాపలల్లుటలో వాడిన పదార్థములనుబట్టియు, వానిపైనిగల చిత్రరచలనుబట్టియు వాని విలువ, జత ఎనిమిదణాలు మొదలు ఒక్కొక్కటి రెండువందలరూపాయీలవఱకు నుండును. వీనికై దివానుగాను కర్చుచేసిన డబ్బు నేరుగా ఆశిల్పులను వానికుటుంబమును పోషించుటకు వినియోగపడును. ఆ చాపలల్లుటలో వినియోగపడిన పదార్థమగు రెల్లు స్థానికముగా దొరకునదే యగుటచేత ఒక పూర్తియగు వృత్తిచక్ర మేర్పడుచున్నది. అటువంటి ఆర్థికవిధానము, ముడిపదార్థముల సేకరించుటకుగాని, కొనుగోలు

చేయు అంగళ్ళు నిర్మించుటకుగాని, సముద్రమార్గాల రక్షణకుగాని పదాతిసేనను కోరదు; నౌకాసైన్యము దానికవసరముండదు. ఆకాశ విమానదళమున కగత్యములేదు. కాబట్టి హింసాచర్యతో ఎందును అవసరమే యుండదు. ఆ దివాను ఇంగ్లాండులో తయారుచేయబడిన స్ప్రింగు పడకలను అభిమానించి, తన 'ఉన్నత' జీవనప్రమాణమున వానికి తావిచ్చునెడల హింసాకాండకు ప్రోద్బలమిచ్చినవాడగును.

అదేమాదిరిగా దివానుగారి ధోవతులు, ఇతర దుస్తులును ఖద్దరులై, ప్రత్యేకముగా నియమింపబడిన తీరున సిద్ధముచేయబడునవగు నెడల, స్థానికముగా జీవించు వడుకువారికిని, నేయువారికిని జీవనోపాధిని, ప్రోత్సాహోన్నతులను గల్పించును. వారి అభివృద్ధికి దోహదము లభించును.

ఆతీరుగా మన అవసర వస్తువులలోని ప్రతిదానికిని, మన ప్రాంతపు పారిశ్రామికోత్పత్తి వ్యాపారముతోడను, మనచుట్టును గల ప్రజల జీవితముతోడను అనుబంధము కూర్చుట మన విధి. అప్పుడు మాత్రమే శాశ్వతత్వము ఫలించును; తద్వారా హింసారూప వినాశము తొలగి, ఆరోగ్యప్రదమగు జీవనవికాసము సమకూరగలదు.

మన చుట్టును నివసించు ప్రజల ప్రమేయమేమియు లేకుండ, డబ్బువిలువను, పదార్థరాశిని దృష్టిలో నిడుకొని మన జీవనప్రమాణముల నిర్ణయించుకొనుట ఆచారమైపోయినది. అటువంటి ప్రమాణములు కృత్రిమములు; కావున అసహజములును అస్థిరములు నగును. అవి ప్రజల జీవితములో వేరూని పెరుగునవి కావు. కాబట్టి శాశ్వతములు కాజాలవు. బలాత్కారముగా పైన బడవేయబడినవై లోతుగ నాటుకోజాలకుండును. బ్రిటిషు ఆరామాధికారి జీవనప్రమాణము, ఆచందాన తయారుచేయబడినదే. ఆలాటి పరిస్థితులు సైనిక

శిశువును, నిర్జీవముగు ప్రమాణరచనలకును హేతువులగుట తఱచుగ చూచుచున్నాము.



ప్రజాజీవన వైఖరిని పూర్తి వివరములతో నిరూపణము చేసి ఈ తీరుగా విమర్శలు సాగించు అవసరము లేదు. ప్రజాహిత జీవితమున అనివార్యముగానుండి తీరవలసిన జీవితావసరముల యొక్క అత్యల్పప్రమాణమేదో శ్రద్ధతో కనిపెట్టి ప్రజలయొక్క వస్తూత్పత్తికర్మను గూర్చి మార్గము సూచించుచు, వారి పరిసరములకును, వారికి సులభముగ దొరకు ముడిపదార్థ సేకరణకును అనుకూలపడు విధానముల తెలుపుటే మనము చేయవలసినదంతయు. ఆపిమ్మట వ్యవహారమున జోక్యము గల్పించుకొనకుండ ప్రజలనిర్మాణ సామర్థ్యమునకును, కల్పనాచాతుర్యమునకును స్వేచ్ఛ నంగీకరింపవలయును. చెఱువులోని నీళ్ళు పైకి రావలయుననిన యెడల మనము చేయదగినదెల్ల, ఆ చెరువులోని నీరును హెచ్చుచేయుటేగదా! ఆపిమ్మట మన సాహాయ్యముగాని మన జోక్యముగాని లేకుండనే, నీటిమట్టము, ప్రకృతి ధర్మము ననుసరించియే, తనంతట నదియే పైకి లేచును.

మన దేశమునందలి ప్రజలు తిండిలేక మాడుచున్నను, చాలినంత గుడ్డలేక దేవులాడుచున్నను, అందాలపోటీలతో వారు పాల్గొన గోరి తనువుల సన్ననివిగ జేసికొనుచుండిరని గాని, దిగంబర సిద్ధాం

కానుగాము లగుచుండిరనిగాని వ్యాఖ్యానము చెప్పదగదు. వారికి తామేమి తినవలయునో, యెటుల తినవలయునో తెలియును. వారేమి ధరింపవలయునో వారెరుగుదురు. వారికి కావలసినవి ఘనమగు అంచనాలు, జాబితాలు కావు. వారికి ఆహారపదార్థములు కావలయును. వారికి వస్త్రములు కావలయును. వానిని చాలినన్ని ఉత్పత్తి చేసికొనుటకు తగిన వసతులనుమాత్రము మనము కల్పించిన చాలును.

ప్రజలలో నిర్మాణావకాశములను హెచ్చించి, స్థానికముగా విక్రయ సదుపాయముల గావించి, వినియోగపద్ధతులను సవరణ గావించినం జాలును; జీవనప్రమాణము దానంతట నదియే హెచ్చ గలదు. అటుల నొక్క ప్రమాణము సహజముగ నిర్మాణమయ్యెనా ప్రజలయొక్క సంస్కృతియు, మేధాశక్తియు, వానంతట నవియే ప్రకాశమునకు వచ్చును. మఱియు ప్రజాజీవితమున వేరూని నిలువబడదగిన దగుటచేత, ఆ జీవనప్రమాణము సుస్థిరమై వర్ధిల్లగలదు.

బ్రిటిషు ఆరామాధికారి జీవనప్రమాణము, అతని చుట్టునున్న ప్రజల జీవితముతో అనుసంధానముగలదికాని కారణమున, కేవలము వ్యక్తిగతమైనదని చెప్పవలసియున్నది. దాని వ్యాప్తి వాని యింటి నాలుగుగోడలమధ్యను మాత్రమే. 'ఇంగ్లీషువాని గృహము వానికి కోట" అనునుడి కలదు. నిజమే! లోపలనున్నవారి కది యెంతెంతగా స్థూలములౌ శారీరకసౌఖ్యముల సమకూర్చునదైనను, అది ప్రపంచమును దూరముగా నెట్టివేయునదగుట నిస్సంశయమే. చుట్టును పఱగుజీవనఝరినుండి ఆతీరున విడివడి, ముడుచుకొనియుండుస్థితి మన దేశములోకూడ, పాశ్చాత్యజీవన పద్ధతుల ననుసరించువారు తెచ్చిపెట్టుకొనుచున్నారు.

మనము వెదకులాడుచున్న ప్రమాణము ఒక్క కుటుంబము కొఱకు కాదు; ఒక్క తరగతివారి కొఱకునుగాదు; మఱియు ఒక్క కూటమువారికొఱకును గాదు. అది స్థానిక ప్రజ యంతటికిని సమష్టిని వినియోగపడునదై యుండవలయును. అనగా ఆ ప్రమాణము ప్రజా సమూహములోని యెల్లరి జీవితములను ఒండొంటితో పెనవేసి కలిపి వేయగలదిగ నుండవలయును. మన ప్రాచీనగ్రామ నిర్మాణ మొక తీరున ఈమార్గాన కొంత ప్రయత్నము చేసియున్నది. అందు కాపుర ముండువారిలో మంగలి, చాకలి, ముచ్చి, మాదిగ మున్నగు వృత్తు లవలంబించువారిలో ప్రతివానికిని, వడ్లు, కాయధాన్యములు మొదలగువాని రూపమున ఆగ్రామపు పంటరాశిలోనుండి వార్షిక భాగమును నిర్ణయించి, యిచ్చు కట్టడి కలదు. ఈ వ్యవస్థ యందలి వారందఱు, సమష్టిని ఒకేకూటముగా పాటింపబడిరి. కాని మనము కోరునది శరీరముయొక్క యునికిని కేవలము నిలువబెట్టుటకు తగిన యేర్పాటులు కావు. మానవునందలి శ్రేష్టతర కల్పనాసామర్థ్యమును పెంపొందించుట కనుకూలించు సదుపాయములు కూడ అవసరములే.

మఱల మన దివాను ప్రస్తావన చూతము. ఆయన తన కాగితములు పెట్టుకొనుటకు ఒక తోలుపెట్టెను కోరుననుకొందము. ఆయన ముచ్చిని పిలిపించును. ఏరకపు పెట్టెను ఏరకపు తోలుతో చేసిపెట్టవలెనో తెలుపును. ఆ పెట్టె ఆకారమును, పరిమాణమును, అందలి అఱలను నిర్ణయించును. ఆముచ్చి చర్మకారుని పిలిచి ఎట్టి నాణ్యముగల చర్మమును ఏరీతిని ఊనియీవలెనో యేర్పాటు చేసికొనును. ఈ వ్యవహారములో పరిష్కారము కావలసిన సమస్యలు చాల నుండును. ఇందు చాకచక్యమునకు ఊహాకల్పనకు ఎంతేని అవకాశము కలదు. ఈ విధమున దివానువారికోరిక వలన వాని చుట్టుచున్న వారియొక్క నిర్మాణ కౌశలము క్రియారూపమున

దాల్చుటకు వసతియేర్పడు చున్నది. ఇందుకు మారుగా, ఆ దివాను సరాసరి నొక బ్రిటిషు విక్రయశాలలోనికి పోయి, అచ్చట సంసిద్ధముగా చేసిపెట్టి యుంచిన తోలుపెట్టెను కొను నటులొందుము. ఆపెట్టె సరిగా తాను కోరుకొనునట్టి రకముదై యుండదు. అక్కడ సిద్ధముగా చేర్చిపెట్టియుంచిన సరకునుండి, అతడేదోయొక దానిని ఎన్నుకోవలసిన వాడగును. ఇంతియె కాదు. తన కేలాటి పెట్టె కావలయునో అను విషయమునకు ప్రాధాన్యతనిచ్చి విచారణ చేయుటయే మానుకొనవలసిన వాడగును. ఆ విషయనిర్ణయము వానికంటె ముందుగా ఉత్పత్తిదారుని వలన చేయబడి యుండెను. ఆనిర్ణయము ప్రత్యేకముగ వాని కనుకూలించునది కాకపోవచ్చును. ఏదో సామాన్య సమస్యగా, ఆయుత్పత్తిదారుడు సాగించిన ఆలోచనా ఫలితమైయుండును. ఆ దివాను తన పెట్టెను స్థానికముగా చేయించుకొనునెడల, దాని వివరములంగూర్చి తానేస్వయముగా యోచన సాగించుకొన గలడు. తనకు వలయువస్తు స్వరూపమును ఆయన నిర్ణయించుకొనును. తనదాపున నున్నవారిలో ఏపని కెవరుపయోగపడుదురో వారిచేత ఆయాపనులు చేయించును. ఈవిధాన వినియోగదారుని జీవనము, వాని భావనయు ఉత్పత్తిదారుల జీవనముతోడను వారి కల్పనాసామర్థ్యములతోడను చక్కగ పెనవేసికొని యుండును. ఒకడు ఇంకొకడు నిరూపించు సమస్యలను పరిష్కరించుటలో పాల్గొనగలుగు చుండును. మన జీవితములు వేఱువేఱు స్వతంత్రములైన విషయములు కాక, ఒండొంటితో పెనవేసికొని యుండును. సవ్యమైయొప్పు ఒక జీవనప్రమాణము అనెడు పట్టుదారమిటుల, సమాజప్రజలందలి వ్యక్తిజీవులనెడు ముత్యముల నొక హారముగా కూర్చును. దివాను జీవనప్రమాణ మటువంటిదై, వాని జీవితమును వడుకువారి యొక్కయు, నేతనేయువారి యొక్కయు,

చాపలల్లువారి యొక్కయు, చర్మకారుల యొక్కయు, మంచ్చీల యొక్కయు జీవితములతో అనుబంధము కూర్చుటేగాక, ఆతను భోజనానంతరము పారవేసిన విస్తరిని తినుమేక మొదలగు నోరులేని తోడిజీవుల జీవితములతోడ సుఖతము సంబంధము కల్పించు చున్నది. తనకుతానై జీవించునరుడు లేడు. కాని ఫాక్టరీలలో తయారు చేయుబడిన వస్తువుల వాడుసందర్భమున, పరిసర ప్రజలతో ఆలాంటి సన్నిహిత సంబంధము శూన్యమై పోవుచున్నది. అక్కడి జీవనప్రమాణము నిర్జీవములగు యంత్రములతో జోడింపబడినదగు చున్నది. ఈ యంత్రములు వృద్ధికాగల నిర్మాణ కౌశలములేని నిర్మాతలన దగియున్నవి.

కాబట్టి మనజీవన ప్రమాణమేదైనను, సంఘమునందు వివిధ వర్గముల మధ్యమున శుభంకరమగు సహకారమును కల్పనచేయుచు, సంఘమునొక సజీవసంస్థగా సంఘటితపఱచ గల్గునదిగా నుండవలయును. అట్టి ప్రమాణము వేఱుపడి జీవించుచు నితరులతో ప్రమేయము పెట్టునని వ్యక్తుల ప్రయోజనము కొఱకు మాత్ర మేర్పడినదిగా నుండవలయును. అయ్యది సంఘమునంతను నొక్కటిగా కూర్చి సంఘటిత పఱచు స్నేహబంధముగా నుపకరింపవలయును. అప్పుడు పరస్పర విశ్వాసము, ఐకమత్యము, ఆనందము, ప్రవర్ధనము గాంచును. ఈ గుణములు సంఘబలమునకు పునాదులై వెలయును. వైషమ్యముల పొడమనీయవు.

సన్నని దూదిపోచలు వేర్వేరుగా నున్నప్పుడు అల్పములును, దుర్బలములునై యుండును. కాని కొన్నివేల పోచలు కలియ వేన

బడునప్పుడు, బలిష్ఠమగు మోకుగ నేర్పడి, పెద్ద సముద్రపుటోడనైనను లాగిపట్టగల్గును. సంతృప్తిదాయకమగు జీవనప్రమాణము యొక్క ప్రభావ మటువంటిదిగా నుండును. అది సంఘము నంతటిని ఒక్కటిగా సంఘటితపఱచి, ఉత్పత్తిదారుని, వినియోగదారుని సన్నిహిత బంధువులనుగ జేసి కూర్చగలదిగా నుండును. అటువంటి జీవనప్రమాణము మాత్రమే శాశ్వతత్వమున కాధారమై వెలయంగా గలదు.

అధ్యాయము 12

శ్రమ

“ శ్రమ ” అను మాట చాల తఱచుగా వాడబడునదైనను, ప్రజలు అర్థముచేసికొొన శ్రద్ధవహింపని మాటలలో ఇదొకటియని చెప్పవచ్చును. ‘ శ్రమ ’ అనగా నేమిటి? ప్రకృతిసిద్ధమైన పరిపోషణమునందు దానికిగల ప్రమేయ మెటువంటిది? కోట్లాది జనమునకు “ శ్రమ ” నేర్పాటుచేయు టెట్లాయను సమస్య నేడన్నిజాతులను ఎదుర్కొను ప్రధానసమస్యలలో నొకటిగ నున్నది. కాబట్టి ‘ శ్రమ ’ యను పదమునకు పూర్ణభావమును తెలియుట అత్యవసరము. పరంపరాగతిని, శాశ్వతత్వమును సంరక్షించుచు, విశ్వముయొక్క నిరంతర జీవనము సాగివచ్చుట కాధారములగు ప్రాకృతజీవగణముల చర్య లెటుల సమకూర్చబడుచున్నవో పూర్వాధ్యాయములలో విచారించియుంటిమి. పురుగులు భూసారము నెటుల పోషించునో, పక్షులు విత్తనముల దీసికొనిపోయి అందందుజల్లుట కెటుల తోడ్పడునో, తేనెటీగలు పూలకెట్లు చూలుకల్పనచేయునో తెలిసికొంటిమి. ప్రకృతిలోని ఆయాజీవుల శ్రమవిధాన మటులనున్నది; వాని జీవనధర్మ మారీతి నున్నది.

నరుని విషయమునను అట్లే. “ జీవనమనగానేమిటి ? కేవలపు టునికిని మించి దాని యందలి ప్రధానాంశము లేవి?” అను విచారణ చేసి యుంటిమి. నిమ్నజాతి జీవులవలెగాక, నరుడు తన స్వతంత్రేచ్ఛను ప్రయోగింపజాలును; ప్రకృతియందలి వివిధమూల వర్గములను సమీకరణచేసి, వానివాని ధర్మములను శ్రేష్టతర మార్గమును నిర్వహింపచేయ గలడు. అటులచేయుటలో, నరుడు తన కౌశలమును వృద్ధిచేసికో గలడు; మఱియు తనయెదుట నిడుకొనిన సమస్యలను

పరిష్కరించుటలో తానవలంబించు ప్రమాణములద్వారమున తన వ్యక్తి ప్రభావమును ప్రకటింపజాలును కూడను. ఈ చర్యయే నరుని వంతు 'శ్రమ' అనవచ్చును. అదియే ఆ 'శ్రమ' యొక్క ధర్మము నన వచ్చును.

'శ్రమ' అనగా నేమియో సరిగ గ్రహించుటకు, నరుని ప్రాథమిక చరిత్రను గైకొని, దాని నీనాడుపూర్తిగా కప్పిపెట్టిన యనేకములును, సంకీర్ణములునునగు అనుబంధ విశేషాంశములను వేఱుపఱచి, దాని ఆద్యసరళస్వరూపమును గనిపట్టుటెంతయు అవసరము. నరుడొకదశయందు తనకొఱకై రాళ్ళనుండి పనిముట్లను చేసికొనసాగినాడు. అప్పుడతడు, కేవలము నైజప్రవృత్తి ననుసరించి బ్రతుకుజంతువుల వర్గమునుండి వేఱుపడుట ప్రారంభమైనది. ఆకాలమునాటి నరుని చేష్టలను పరిశీలించినయెడల, 'శ్రమ' యనుదాని స్వచ్ఛమగు స్వరూపము మనకు గోచరించును. పక్షులు గూళ్లను కట్టుకొనును; అందందు దేవులాడి తమ యాహారమును సంపాదించి తెచ్చుకొనును. సరిగా అదేతీరున, నరుడు తన బుద్ధిసంపదను, ముందు రాగలదానింగూర్చిన యూహను, అందుంగూర్చిన యుపాయములను సమీకరించి
న యవసరములను దీర్చుకొనకొఱకగు ప్రవృత్తియే వాని 'శ్రమ.'
డు డప్పుడు తన స్వార్థమును సాధించుకొఱకే, తనను తానానంద
ఱచుకొనుకొఱకే "శ్రమ" పడెడివాడు. వ్యక్తిపరముగా వాని
వరములు తీరుట వినా వేఱగు 'కూలి' (ప్రతిఫలము) లేనేలేదు.
సమర్థతలను నిశితపఱచుటకును, వానిని యోచనలు చేయగల
గా పరిణామము పొందజేయుటకును ఆ ప్రవృత్తి సవ్యముగ నడి
ది. అతడు తాను వేటాడిచంపిన జంతువులను తాను నివసించు
ండగుహకు దీసికొని వచ్చెడివాడు. అచ్చట వాని యిల్లాండ్రు
జంతువుల మాంసమునువండి, ఆహారముగా సిద్ధము చేసెడివారు.

ఆతీరుగా స్త్రీజనముయొక్క సాంసారికవ్యాపార మారంభమైనది. ఈదినమువఱకు, కనీసము మన దేశమునందైనను, స్త్రీల 'శ్రమ' స్వాంతగృహములో, స్వాంతమగు నవసరములను దీర్చుకొనుట యనెడు వినిర్మల స్వరూపముననే నడుచుచున్నది.

శ్రమయందలి ప్రధానాంశములు :— 'శ్రమ' యను దానిని విభజించి పరిశీలించునెడల, అందనేకాంశములు చేరియున్నటుల, తెలియవచ్చును. తుదిగమ్యార్థమును సాధించుటలో అందలి ప్రతియంశమును సాయపడుచుండును. ప్రధానముగా 'శ్రమ' యందు సామాన్యపుపాటు, శ్రాంతి, పురోగమనము, సుఖము అనునవి యిమిడియున్నవనదగును. వీనిలో ఏయొక్కదానిని గాని రెండవదానినుండి వేఱుపఱచి, దాని నొక్కదానినే ప్రత్యేకజీవనాంశముగా చేసి నిలుపజాలము. శ్రమయందలి "సామాన్యపు పాటు" భాగము నొక పురుషునికిని, 'శ్రాంతి' భాగమును మరొకనికిని పంచియీయజాలము. మఱియు నందలి సుఖాంశము నంతటిని నింకొకడు గుత్తగొనుటయు పొసగదు. సంగీతములోని స్వరములలో ప్రతిదానికిని విశిష్టమగు తాళగతి యుండును. ఆతాళ మాస్వరమునకు జీవసంజ్ఞగ నుండును. ఆ తాళమానము తప్పెనా, ఆస్వరమున కర్థమే సున్న. గాయకశిరోమణిగా గోరుకొను పురుషుడు స్వరములను నేర్చుకొనుటలో నెన్నియో గంటలకాలము వ్యయముచేయును. అలాచేసి స్వరములను తాళగతితో నేర్చినప్పుడే వాని సంగీతమున రసమొప్పింప గల్గి, వా డానందింపజాలును. ఈరీతిగ స్వరముల నేర్పు చర్యను వేఱొకని వంతుగా పంచియిచ్చి, తాను రసాస్వాదనముచేయు సుఖమును మాత్రము పంచుకోజాలడు. ఒకానొకడు రేడియోగానమును వినుచు సోమరిగ గూర్చుండవచ్చును. కాని ఆచర్యవలన అతడు గాయకుడు కాజా

లదు. అదేవిధముగా, మనమేది చేయబూనినను, దానికై చిరకాలా భ్యాసమును చేయక తప్పదు.

ఇంకొక యుదాహరణను చూతము. సరియైన భోజనమునందు పుష్టికరపదార్థము, జీర్ణముకాని వ్యర్థపదార్థము, రుచి అనునది కూడి యుండును. రుచిని మాత్రమే పొందవలయునని ఎవడేని నిర్ణయించు కొని,-ప్రతిముద్దను కష్టపడి నమలుట కిష్టగింప నిరాకరించునెడల. ఆధునికశాస్త్ర సాహాయ్యమున తన శరీరపోషణకు అవసరమని తాను గ్రహించిన ద్రవ్యముల నేరి దీసికొన నిశ్చయించికొనినను గూడ తనదేహము నెంతకాలమో నిలువబెట్టుకోజాలడు. ఈ సరణిని పరిశీలించునెడల, ఆహారపదార్థములోని వ్యర్థపదార్థమనునది జీర్ణ క్రియకును, శరీరవృద్ధికిని అనివార్యమగు అవసరవస్తువేనని గ్రహింప జాలుదుము. "శ్రమ" వలని యుత్తమఫలితార్థమును బడయ కాంక్షింతుమేని, దానియందిమిడియున్న ప్రధానాంశముల నన్నిం టిని పాటించి స్వీకరించి, వానివాని నైజకృత్యముల కవకాశమొసగి తీరవలయును.

స్మృతిదాటిన ప్రాచీనకాలమునుండియు. మానవుడు తన స్వేచ్ఛను బట్టి శ్రమను పృథక్కరించి దాని వేఱ్వేరు భాగము లను భిన్న భిన్న వ్యక్తులకు పంచు ప్రయత్నముల సాగించు చున్నాడు. సామాన్యపు పాటును తన నెదిరింప శక్తులుకానివారి వంతు చేసి, శాంతిని ఉద్ధతులవంతు చేయ జూచుచున్నాడు. పాటును దాసుల నెత్తినివేసి, యజమాని వారికష్టఫలములను సంగ్ర హించుచున్నాడు. గ్రీసు, రోముసామ్రాజ్య వైభవములు ఆ తీరున లాభసంగ్రహణము, కష్టవిసర్జనమునను చర్యలపై నిర్మాణమైనది తత్పర్యవసానముగా వారివైభవములు దగ్ధమైపోయినది. వానిభస్మ రాశి గత చరిత్రనుగానము చేయుచు, మనకు గుణపాఠమును గఱపు

చున్నది. ఈగుణపాఠమును పెడచెవినిబెట్టి ఆధునిక పారిశ్రామిక సామ్రాజ్యములు వెనుకటివాని జాడలబట్టిపోవుచు, సౌఖ్యములను లాభములను వస్తూత్పత్తిచేయు దేశములకు కట్టిపెట్టి, బండచాకిరిని ముడిపదార్థముల నుత్పత్తిచేయు దేశముల నెత్తిపైబడవేయు ప్రయత్నముల సాగించుచున్నవి. ఈకుతంత్రము ప్రకృతిశాసనమునకు విరుద్ధమైనదిగాన, భగ్నము కాకతీరదు. ప్రకృతినిర్ణయమును భంగపరచు తంత్రఫలముగా చెలరేగిన హింసాచర్యవలన ఘటిల్లు ఘోరవినాశమును మనముకనులారనిప్పుడు కాంచుచున్నాము. సామ్రాజ్యదేశములు అన్యప్రజాళిని తమయిచ్ఛకు దాసులగావించు ప్రయత్నముల దుష్ఫలములే యిటీవలి ప్రపంచసంగ్రామములు సుడీ! కొలదికాలమవి విజయవంతమునైనట్లు జూపట్టవచ్చును; కాని ఆవిజయమునందే వినాశవిషబీజము లిమిడియుండుటచేత, హింసాప్రేరితమా యావ్యవస్థలెల్ల ధ్వంసమైపోవుకాల మాసన్నమగుచున్నది.

'శ్రమనివారణోపకరణముల' నిర్మాణకులు, బలాత్కార విక్రయ సంస్థలను విజయవంతముగావించి, గృహపరిచారకులను, వ్యవసాయకులను, పాటకపుజనమును నెట్లుస్థానభ్రష్టుల గావించిరో, వారినెటుల తమభారీయంత్రాలయములందలి కూలివాండ్రనుగ జేసికొనిరో వెనుకటి అధ్యాయమున దెలిసికొంటిమి. అటువంటి పరివర్తన ఫలితముగా ఆంగ్లదేశమందలి ఆరామములు, సేద్యభూములు పాడుపడినవి, ఏలయందురా?

అచ్చటిభూములన్ని వ్యవసాయము సాగించుటకు దగినంత మంది గ్రామసీమలందు మిగిలియుండినగదా! కాని బొగ్గు, యినుము, తగరముతిని బ్రతుకగలదేశ మెందునునుండదు. ఆహారము తప్పక కావలయును. ఆహారద్రవ్యములను మఱియు నట్టిపదార్థములను సమకూర్చి పెట్టుటకు ఇతరుల దయాదాక్షిణ్యములపై ఆశపెట్టుకొనుట

వ్యర్థము. ప్రభుత్వసాహాయ్యములేని వ్యక్తివ్యాపారస్థుల యిష్టానిష్టముల నమ్ముకొనుటయు నిష్ఫలమే. కాబట్టి అట్టివస్తు సంగ్రహము కొఱకై ఇంగ్లాండుదేశము పరదేశములను తమదాస్యమున నణచి పట్టుట అనివార్యమైనది. పరదేశములు సులభముగా తలవంచి దాస్యమున కొడంబడుట అసహజముగదా. కాబట్టి హింసాచర్య ఇంగ్లాండుదేశైశ్వర్యమునకు పునాదికావలసి వచ్చినది. తమ అభ్యుదయ వ్యాప్తికొఱకును, సంరక్షణకొఱకును ప్రతి రెండుతరముల కాలములోను ఆదేశపు యువకప్రజను, వారి శౌర్యసంపదలను సంగ్రామభూములందు బలిపెట్టవలసి వచ్చుచున్నది. ఇయ్యది వాంఛనీయపరిస్థితి యగునా? ఇట్లు తడవతడవకు నిరపరాధుల వధపెట్టి పరిపోషణము చేసికొను విధానము, సామాన్యముగా వీధినిపోవునే పామరజను డైనను కూడ నింద్యమని తెలుపగలడు. కాబట్టి అటువంటి వాస్తవ పరిస్థితి ప్రజలకు తెలియరాకుండజేసి, తమకు చెప్పిన దానినెల్ల నిశ్శంకముగా నొప్పుకొని ప్రజలు తలయూపునటుల జీవన ప్రమాణములను చీకాకుపఱచి, సంకీర్ణ జీవనప్రమాణములను బహుళ వ్యాపకము గావించి, అకృత్రిమ ప్రమాణములను వేనోళ్ళ పొగడుచు, హింసాపరజీవనమును మహిమాఢ్యమని చాటు విద్యాపద్ధతి చేత ఆబాల గోపాలమును సమ్మోహనమున ముంచి యుంచుచున్నారు. ఈ దుష్ప్రచారదుష్ఫలములను, తల్లులుతమ ముద్దుబిడ్డలను బలిపెట్టి గర్వించుటలోను, యువతులు తమ ప్రియభర్తలను రణభూములందును ప్రాణములవిడువ ప్రేరేపించుటలోను, సులభముగ ద్యోతకము చేసికోగల్గుదుము. ఏ తల్లియేని తనపుత్రుడు ఇతరపుత్రులను వందలాదిగ హత్యచేయుటకును, ఆ కడకయందు హత్యగావింపబడుటకును అనుకూలించు విద్యాశిక్షణమును బడయుచున్నాడని తెలిసి మురిసిపోవుట యెందేని ప్రకృతిసిద్ధ మనగలమా? ఏసదయ

హృదయ యగు తస్వియైనను తన ప్రియభర్తను పరజాతుల దోచు
కొనిరమ్మని పంపి, ఆ యత్నమున ప్రాణహాని గావించుకొమ్మని
ప్రోత్సహింప సమకట్టుట సహజమగునా? కాని విపరీతములగు
మూల్యప్రమాణములను ప్రజల మనస్సు లోనికెక్కించిన దోషము
వలన ఈ విపరీతానర్థము లన్నియు సమకూడుచున్నవి. హింసావినాశ
ములు చేకూరు మార్గములలోనికే లాగునటుల ప్రజలు తమ స్వతం
త్రేచ్ఛలను వినియోగము చేయు యోగము విషమప్రమాణములవల
ననే వచ్చిపడినది. ప్రజలే సహజమును వినిర్మలమునగు యోచనలు
చేయువారగుదురేని హింసావినాశముల కెంతయో దూరముగ
నుండెడివారే!

అటువంటి యధోగతి సంభవమగుటకు ముఖ్యహేతువు దౌర్జన్య
మును మహోన్నతపదవిని నిలిపి పూజించుటయే. ఒక్కరిని హత్య
చేసిన నేరగానికి ఉరిశిక్ష విధించుచున్నారుగదా! కాని పురోభివృద్ధి
కాములును నిరపరాధులునగు యువకులను పెద్దమొత్తున హత్యగావిం
చినవారిని జాతీయవీరులనుగ నిర్ణయించి బహూకరింతురే! ఘోర
కృత్యములను హెచ్చుగ సలిపినకొలదిని బిరుదావళుల నర్పించియు,
సెంటుపాల్సు కెతీడ్రలు లేక వెస్టుమిన్‌స్టరు కెతీడ్రలు వంటి పవిత్ర
పూజాక్షేత్రములందు ఆ క్రూరకర్మల జ్ఞాపకార్థము ఘనతరశిల్ప
నిర్మాణముల స్థాపించియు జోహారులర్పింతురే! స్వరక్షణ నిమిత్తమై
అటువంటి వక్రమార్గములను ఆశ్రయించు విధానములో నేదేని
ధర్మభంగ ముండవలయునని తోచుట లేదా? తలక్రిందుగా నడుప
బడు నాచారఫలితముగా సద్భావములెల్ల అణగారిపోగా జాతియం
తయు జ్ఞానశూన్యమై పోయినటుల కాన్పించుటలేదా? వెనుకటి
అధ్యాయములో మనము విచారించిన సంకీర్ణ జీవనప్రమాణ
నవలంబనముచేయుట కారణముగా ప్రజలు శాంతచిత్తముల

స్థితిగతులం మార్చి ఆలోచనలు గావించు నవకాశములనే కోల్పోయినవారైరి, అధికారపదవుల నాక్రమించిన నాయకులు, ఆ ప్రమాణావలంబనము వలన తమ లక్ష్యములను అడ్డులేకుండ ననుసరింపుచు కనుగానక ఆత్మసంతృప్తులై తమను తాము సంభావించుకొను భ్రమలో పడిపోయిరి.

జరుగు కార్యక్రమము చాల సరళము. ప్రకృతిప్రేరితుడై నరుడు తన తృప్తికొరకుమాత్రమే శ్రమపడునని క్రిందటి అధ్యాయములో గనుగొంటిమి. కాబట్టి నరుడు ప్రయత్నశీలుడగుటకు ప్రత్యక్షకారణము వాని అవసరములని గ్రహింపగలము. వాని యవసరములను హెచ్చించితివా, వాని ప్రయత్నములును హెచ్చును. నరుని అవసరములను పెంచవలయుననెడు ప్రతిపాదనకు మూలకారణమిప్పుడు మనకు తెల్లమగుచున్నది.

కాబట్టి నరుని భౌతిక జీవనప్రమాణమును "ఉద్ధరించుట" అనగా, లేక ఆ ప్రమాణమును సంకీర్ణము చేయుటనగా ఎద్దునకు ముక్కుత్రాడువేసి లాగుకొనిపోవు టెటువంటిదో అటువంటిదని గ్రహించియుంటిమి. అందువలన నరుని స్వీయమా ఇచ్ఛ అణంచబడును; వాని యుద్యమశక్తికిని వాని కార్యోత్సాహము నకును, విరోధము కలుగును; అతనిని వశము చేసికొనినవాడు నిర్దేశించిన తెరువులలోమాత్రమే అతడు నడువవలసినవాడగును. ఆతీరున పరుని వశముననుండి నడుచునతడు విచక్షణశక్తిని కోల్పోవును. తనను వశము చేసికొనినవాని సన్న ననుసరించుపట్ల శంకింపడు.

ప్రపంచ మీనాడు పెద్దయెత్తున పరిశ్రమలు నడుపు ఉత్పత్తిదారుని కాలిక్రింద పడియున్నదనియు తెలిసికొనియుంటిమి. ప్రజల వాక్కు నణంచిపెట్టుట మూలముననను, తనకు లాభముల నార్జించిపెట్టు సంస్థను వ్యాపింపచేయుట మూలముననను, ఈ రెండు రీతులను

అధికవస్తూత్పత్తిదారుడు లాభము పొందుచున్నాడు. సంగ్రామముల నడుమ శాంతిసమయములం దతడు సైకిలులయుత్పత్తిని హెచ్చించి వాని నమ్ముకొనును; యుద్ధమేఘములు నింగి నావరించు సమయములందు బాంబులయు ఫిరంగులయు ఉత్పత్తిని సాగించును. తన స్వార్థచింతను కప్పిపెట్టి, ప్రజాక్షేమముయొక్క రక్షణకొఱకేయని చాటువాని యానతులను శిరసావహించి, యవివేకపు ప్రజాళి తమ ప్రియబంధుమిత్రుల ప్రాణములను బలి యిచ్చుచుందురు. సామాన్య శ్రమాంశమును దానియనుబంధమగు శిక్షణమును వేఱుపఱచి, దూరముగనుంచి, వడిగ నడిచిన శ్రమ సాధించిపెట్టిన తృప్తిని ఆనందమును మాత్రము సంగ్రహింపవలయుననెడి పేరాశయొక్క పర్యవసానమే యిదంతయు.

సమగ్రమగు ఆహారమువలె, సవ్యమగు శ్రమ శరీరమునకు కావలయు శక్తిని, ఆరోగ్యమును, విశ్రాంతిని, సమకూర్చును. శ్రమ శారీరకముగ వ్యాయామమును కల్పించుటేగాక, మానసికపరిణామమునకు సంతుష్టికిని గూడ అవకాశముల నొసగును. కాని శిక్షణాంశమంతయు నిస్సహాయులై పడియున్న ఒక్కసంఘభాగముపైననే పడవేసి, శ్రమఫలితములో ఆనందప్రదాంశము నంతను ఉద్ధతినున్న సంఘభాగమునకై కూర్చిపెట్టియుంచుటయు ఆధునిక యుగలక్షణముగ నున్నది. ఇందుకొఱకుగాను శ్రమను భట్టీపెట్టి దాని భాగములను వేఱుపఱచి సుఖాంశమును మాత్రము తీసికోగలమని భ్రమించుచున్నాము. అందలి కష్టాంశమునకును ఆనందప్రదరూపమును కల్పనచేసి, గోల్ఫు, టెన్నిసు, క్రికెట్టు, ఫుట్బాలు మున్నగు వ్యాయామపు ఆటలనెడు పేర్లతో మాత్రలుగా చేసి, సుఖాంశమును మాత్రము మ్రింగజూచుచున్నాము. ఈమాత్రలు బహుళవ్యయ కారణములగు భోగములై పేదలకు అలవిగాకున్నవి.

ఈవిధముగా శ్రమను మొండెముగాచేయు ప్రయత్నము, నేల
మీద ఆటపాటలందును వ్యాయామములందును మాంసకండరములు
పొందుటలో అలవాటుపడిన చలనములను కల్పనచేయుటకై, సము
ద్రప్రయాణములు చేయు పెద్ద నౌకలమీద, సామాన్యముగా నవ
కాశము లుండవని తెలిసియు, సాగించు ప్రయత్నమును బోలి
యున్నది. అటువంటి నౌకలమీద వ్యాయామస్థలముల నమర్తురు.
అందు గుఱ్ఱపుస్వారీ, పడవలను తెడ్లువేసి నడపుటవంటివానికి ప్రతి
రూపముగా నుండు వ్యాయామముల నేర్పాటుచేయుదురు. గుఱ్ఱపు
రౌతు తురగాకారమున నున్న యొక యంత్రముపై నెక్కి కూర్చుం
డును. దాని కళ్ళెపు వారులను చేతబట్టుకొనును. విద్యుచ్ఛక్తి ప్రసా
రము గావించు గడియను ద్రిప్పును. అంతట ఆ యంత్రము గుఱ్ఱపు
దాట్లు వేయుటను దౌడుదీయుటను అనుకరించును. ఆ యంత్రము
యొక్క జీనుపైనెక్కి కూర్చుండిన యతడు నేలమీద పరుగులిడు
గుఱ్ఱముమీద స్వారిచేయువానికి గలుగు కుదుపు ననుభవించును;
కాని వానిక్రింద సజీవమగు తురగముండదుగదా ! అటులనే తెడ్లు
లాగి పడవనడపు కృత్రిమవ్యాయామమును తీసికొను యాత్రికుడు
బల్లపై గూర్చుండి, తెడ్లను చేబూని, కాళ్ళను తన్నిపట్టి ముందు
వెనుకకు వంగుచుండును. స్ప్రింగుతీగలమర్చిన తెడ్లు సరిగ పడవ
తెడ్లవలె చలించును. ఇచ్చట గుఱ్ఱపుస్వారిచేయుట, పడవ నడపుట
వంటి వ్యాయామముకలదుగాని, నేలమీద గాలిలోను నీటిమీదను
పరిసర ప్రకృతిదృశ్యముల నడుమను పోవునప్పు డనుభవించు
స్వాభావసిద్ధమగు ఆనంద మెక్కడినుండి పొందగలము. కొన్ని దిన
ములు, సముద్రయాన కాలమునందు, ఆ కృత్రిమపు ఏర్పాటుల
పబ్బము గడుపవచ్చును. కాని సహజసంఘటనలవలె అవి చిర
కాలము తృప్త్యానందముల నొసగజాలవు. అటులనే శ్రమయొక్క

అంతర్భాగములగు ఆటపాటలు విడదీయుబడుటయు, కొందఱు ఆట
భాగమును, మఱికొందఱు పాటుభాగమును పంచుకొనుటయు జరుగ
వచ్చెను. అటుల జరుగు శ్రమవిభాగమున సమత శూన్యము గావున
పాటు అనునది బండచాకిరిగను, ఆట అనునది పుచ్చుటతీరు పనిగను
పరిణమించును. ఇవి రెండును మానవాభ్యుదయమునకును, క్షేమము
నకును హానికరములే యగును. దాసుడు కష్టహేతువగు పాటువలన
ప్రాణములు పోగొట్టుకొనువాడగుచుండగా, ప్రభుడు విలాసము
లకు మఱిగి యీల్గుచుండును. యుగాంతరములనుండి యనేక సారు
లుగా సాగింపబడుచు వచ్చిన యీ ప్రయత్నములు మానవ జాతికి
పూర్ణత్వమును చేకూర్ప సమర్థములై పోవుచు వచ్చినవి. మన జీవిత
కాలములోనే, శిక్షణాంశమును విసర్జించి, సుఖముల బడయువలయు
ననెడు ప్రయత్నములు యుద్ధములను క్షామములను ఈతిబాధలను
చావులను సంఘముపై బడవేసి, వేళ్ళను పులివాత ద్రోసినటుల
వెలసినవి. ఇకనైనను మనము కండ్లు తెఱచి, వాస్తవస్థితిని
గుర్తించి, వెనుకకు తగ్గ దగదా!

అధ్యాయము 13.

శ్రమవిభాగము

విశిష్టతను చతురతను సమకూర్చునట్టి శ్రమవిభాగ పద్ధతి వలన లాభముండు ననుటను ఎవరును కాదనబోరు. మన దేశములో ఆ విశిష్టత అతి ప్రాచీనకాలమునుండియు ఆచరణలోనే యున్నది. దాని ప్రాబల్యము మెండై పారంపర్యముగ వచ్చు ఆచారమై, కుల ధర్మముగ ఘనీభవించినది కూడను. ఆ ఆచారకాఠిన్యము వలన నెన్నియోకష్టములు వచ్చిపడినవి. అది మననొక పెద్ద అఘాతములో దింపినది కూడను.

శ్రమవిభాగము మహాక్షేమదాయకమను మిషతో పాశ్చాత్యులలో వస్తూత్పత్తిదారులు దానిక్రమము నతి సూక్ష్మ విభాగము నకు గురిచేసివేసిరి. అందువలన 'శ్రమ' యనిన బండచాకిరి యను భావమేర్పడినది. అది మిక్కిలి అసహ్యాలక్షణములు గల శాపముగ పరిణమించినది.

'శ్రమ' లేక 'పాటు' అనునది శ్రామికునికి ఆరోగ్యలాభముల సమకూర్పకలదిగ నుండవలయునెడల, అందే చిన్న అంతర్భాగముగాని నరములను త్రెంచునంత బాధాకరము కాకుండ చూడవలయును. అందుకై అవి భాగమున తగినంత వైచిత్ర్యమును నవీనతయు అమరియుండవలయును. కేవలము అధికోత్పత్తి కౌశలమే లక్ష్యముగ నుండతగదు. కాబట్టి శ్రమవిభాగచర్య కొక హద్దుండ వలయును; ఆ హద్దును మీరినచో నది క్షేమకరముగ నుండ జాలదు.

ఇటుల శ్రమభాగాంతరములు చేయబడగా తేలిన ప్రతి చిన్న భాగాంతరముకూడ సాధ్యమైనంతవరకు ఒకానొక పరిశ్రమయొక్క

పూర్ణస్వరూపముగ నుండవలయును. కాని ఆ భాగాంతరము యేదే నొక పరిశ్రమ కార్యక్రమమున ఒక అంశమాత్రము కాదగదు. చూడుడు: వడ్రంగవృత్తిని విభాగములుగ చీల్చినయెడల, చక్రముల నిర్మించుభాగముగను, గానుగలను తయారుచేయు భాగముగను వేఱు చేయునగును. అప్పుడటుల నిర్మింపబడు సరుకులు వేర్వేఱుగ విక్రియమున కర్హమైనవిగ నుండగలవు. ఇట్టి విభాగమునకు మారుగా, వానిని గూడ చిన్న చిన్న అంతర్విభాగముల గావించి, చక్రాల అడ్డల నొకచోటను, పూటీల నొకచోటను, ఆకుల నొకచోటను, కోతకోయుట నింకొకచోటను జరుపు నేర్పాటు చేయునెడల, అందందు జరుగు 'శ్రమ' 'బండ' చాకిరియైపోవును. చర్మకార వృత్తి సందర్భములో బూట్ల నిర్మాణముగాని చెప్పులు తయారు చేయు పనిగాని ఒక పూర్ణ పరిశ్రమాంగము కావచ్చును. కాని మడమలకు సరిపోవు చర్మములను కత్తిరించుట యొక పరిశ్రమాంగమును, తోళ్ళచీలికలను కోయుట మరొక పరిశ్రమాంగమును, వేర్వేరుగ స్వయంపూర్ణ పరిశ్రమలుగాని, లేక, పరిశ్రమాంగములుగాని కానేరవు. నేటి భారీపరిశ్రమాలయములందు శ్రమవిభాగములను స్వల్పస్వల్ప ఖండములుగ చేసివేసి, ఒక్కొక్క శ్రామికునియొక్క పనియంతయు మేకులు కొట్టుటయో, లేక మరదిమ్మలు త్రిప్పుటయో, మరి యిట్టి యేదేని పనియో, యగునటుల హద్దులు పెట్టుచున్నారు. అటువంటిపనిని దినమునకు 8 గంటలచొప్పున సంవత్సరములో మూడువందలదినాలు, ఎవడైనను చేయునెడల, వానికి లభించు జీతపుసొమ్మెంతటిదైనను అగుగాక, వాని నరాలు చితికిపోయి వానిమతి చెడగా, నతడు పిచ్చివారి చికిత్సాలయమునకు పోవలసియే వచ్చును. అమెరికా సంయుక్తరాష్ట్రములబోలు ప్రపంచ విఖ్యాతిగన్న పరిశ్రమలకు నిలయములగు నగరరాజము లందలి

జనులు, అన్ని వ్యాధులవలనకంటె నాడీజాడ్యములవలన, చాల హెచ్చుగా పీడింపబడుచుందురు. అందు వింత యేమున్నది? నరుని తనువు నిర్జీవమగు జడయంత్రము కాదు. వాని శరీరనిర్మాణము వాని శక్తిసామర్థ్యముల నన్నింటిని సమముగ ప్రకటించుట కనువగు నభ్యాసచర్యల నవశ్యము కోరుచుండును. ఆతడు పూను శ్రమవిభాగాంశము తగినంత విశాలమైనదిగ నున్ననేతప్ప, ఆ యీప్సితము నెరవేరదు. శ్రమవిభాగాంశములు కడుంగడు చిన్నవై పూర్ణకార్యక్రమమున నత్యల్పచర్యలుమాత్రమే యగునెడల, స్వల్పకాలములోన శ్రామికుని నిరుద్యోగిని చేసివేయును. మరియు వానిశక్తులు అచిరకాలముననే వ్యర్థపడిపోవుచుండును. విశేషముగ కష్టపడి పని చేయు శ్రామికుడు నలుబదియైదేండ్ల యీడు వచ్చునప్పటికే శరీరపాటవమును కోల్పోవుచున్నాడు. ఇటుల మానవశక్తి హెచ్చుగ నష్టమైపోవుచున్ననుగూడ పరిశ్రమాధికారి నష్టపడక లాభమునే పొందులాగున కూలిపద్ధతి సృష్టింపబడియున్నది. ఆతంత్రము కారణముగా ఆ మానవశక్తియొక్క నష్టమంతయు సంఘముమీద పడుచున్నది. పరిశ్రమల యజమాని యేర్పాటుచేసిన యిట్టి శ్రమవిధానమువలన ఎంత నరశక్తి వినాశమైనను, దానిజోలియే వానికిపట్టదు. ఏలన ఒక శ్రామికుడు అసమర్థుడై పడిపోవుపట్ల యజమాని వెంటనే వానిని తొలగించివేసి యువకుని నొకనిని వాని స్థానమున నియమించుకొనగలడు. తొలగిపోవు శ్రామికునికిని యజమానికిని మధ్య నగ్నమైపోవు ప్రేమబంధ మనునది యిసుమంతయు లేదు. కాల్చివేయగా మిగిలిన సిగరెట్టుముక్కను ఎంత నిశ్చింతగా పారవేయునో అంత సులభముగా తన సేవలో భగ్నజీవుడైపోయిన శ్రామికుని యజమాని నెట్టిపారవేయగల్గుచున్నాడు. యజమానికి హెచ్చుశక్తిసంపన్నుడగు యువకుని సేవలు వెనువెంటనే లభించుచుండును.

కావున వానికి లాభమేగాని నష్టముండదు. తన సేవలో ప్రవేశించిన నరుల జీవముల నిటుల హరించినందుకై యజమానిని దండించువారు లేరు. ఇట్టి పరిస్థితులవలన ప్రజల ప్రాణములును శక్తిసామర్థ్యములును వమ్మైపోవుట లేదా? ఇట్టి వినాశకర జీవన విధానమువలన శాశ్వతత్వము సాధ్యము కాగల్గునా? శ్రామికులు లేమేని హెచ్చు కూలిని గడించుకొనునటుల కాన్పించుచున్నను అయ్యది తమ నలుబదియైదేండ్ల పిమ్మట బ్రతుకునకై పొందదగిన మూల్యమును ఇప్పుడే వారు పుచ్చుకొనుచున్నారన్నమాట.

కూలి, ఉత్పత్తి, సంకీర్ణజీవనప్రమాణ పోషణము అనువానికి మితిమీరిన ప్రాధాన్యతనొసగి, నరుని యుత్తమశక్తుల నుపేక్షించుచున్నారు. వాని స్వతంత్రేచ్ఛను భంగపరచు చున్నారు. వాని జీవన మూల్యమును తబ్బిబ్బుచేసి వేయుచున్నారు.

అటువంటి పరిస్థితులందు శ్రామికునిస్థితి గానుగనుద్రిప్పు ఎద్దుదశ వంటిదై పోవుచున్నది. ఆ యెద్దుకండ్లకు గంతలు కట్టుదురు. అందచేత అది యెక్కడికిపోవు చుండెనో, యేదారిని పోవుచుండెనో దానికి తెలియదు. దాని ముక్కుత్రాడెట్లు లాగిన నదట్లు నడచును దానిని నడుపుటకు మనుష్యుడుకూడ నవసరము లేదు. దానిముక్కుత్రాడు ఆ గానుగ దూలమునకు కట్టివేయబడి యుండును. త్రాడు తానుపోవలసిన గమ్యమును తెలుపుచున్నదని తలచి, యెద్దు గిరగిర గానుగచుట్టును నియమిత వలయములో దినమంతయు తిరుగుచుండును. అదట్లు దినమంతయు నడచుచునేయున్నను అ ప్రయాణించిన దూరమేలేదు. గానుగయజమాని ఆ యెద్దునకు తెలికపిండిని దినిపించునటుల నిజమే. ఆతడెంతయో ఆదరము పెంపున చిత్రాన్నని ప్రేమనొలికించు నటుల నటించును. ఆపిండియు ఆ యెద్దుముక్కలంతయు శ్రమపడి సిద్ధముచేసినరాశిలో నొకస్వల్పాం

శము మాత్రమేకదా! మనఫాక్టరీశ్రామికులగతి యింతకన్న మిన్నయైనదికాదు. జీవితానందమును గాని స్వేచ్ఛావాతావరణ సౌఖ్యమునుగాని అనుభవించుటకు వారునోచుకొనరైరి! పరిణతిగాంచుటకును వృద్ధిపొందుటకును వారి కవకాశములు పూజ్యము. ప్రకృతిసిద్ధమైన శ్రమవిధాన మిట్లుండదు. కాబట్టి శ్రామికుల యుత్తమశక్తిసామర్థ్యములు క్షయించి వినాశమై పోవుచుండును. ఈ నష్టమునకు డబ్బురూపమున లభించుకూలి పరిహారము కాజాలదు.

ఈతీరుగ పరిశ్రమల యజమానులు 'శ్రమ' యొక్క కష్టాంశమును తప్పించుకొని, ఆ 'శ్రమ' యొక్క వినోదానందాంశమును మాత్రము సంగ్రహించు యత్నముల సాగించుచుండ, ఆ 'శ్రమ' నుండి విశ్రాంతిని చూరగొనవచ్చునని మనసోషలిస్టు మిత్రులు ప్రతిపాదించు చున్నారు. సరిగాగ్రహించునెడల 'శ్రమ' యందే 'విశ్రాంతి' యిమిడియుండవలయును. 'విశ్రాంతి' యనగా తీరికసమయమని యర్థము. సంగీతపుస్వరములందు తాళమెట్టుల ప్రధానాంశమై పఱగుచున్నదో, అట్లే 'విశ్రాంతి' యు 'శ్రమ' యందొక ప్రధానాంశమై యున్నది. వానిరెంటిని వేరుపఱచుటకు వలనుపడదు. విశ్రాంతియనగా సర్వక్రియా రాహిత్యమని అర్థము గాదు. సర్వక్రియా రాహిత్యమన మరణమే. విశ్రాంతియనిన వ్యర్థకాల యాపనమునుకాదు. సోమరితనము అనగా వ్యర్థకాలయాపనము క్షీణతనాపాదించును. ఉచితమగు విశ్రాంతివలన, ఒకరీతి ప్రవృత్తికి తీరుబాటు లేక విరమణము లభింపగా, ఇతర రూపములగు మన ప్రవృత్తులకు పనికలుగుచుండును. వ్రాతబల్లముందు గూర్చుండి మానసికకర్మచేయు మనుజునికి, ఆ పనిలో వానికి గలిగిన నాడులయొత్తిడికి విరామమొసగి, తోటలోని [illegible]నికి [illegible]లకడ పాటుపడుట వాని 'శ్రమ'కు పూర్ణతనొసగి ఆనందించుచు[illegible]ర్వ

గలదు. ప్రకృతి శాసించురీతిని ప్రయోజనకారియై ఫలింపవలెనన్న ఏ 'శ్రమ' యందైనను, నరుడు జోక్యముచేసికొని దానిని విషము గతి బట్టింపనియెడల, ఇట్టివిభాగములు పరస్పరము పూర్ణతచేకూర్చు కొనుచు, ఆ 'శ్రమ' కు ధన్యతచేకూర్చును.

ఒకసారి 'శ్రమ' విధానమును గురించి అనుభవజ్ఞుడని ఖ్యాతి గన్న ఒకయింజనీయరుతో చర్చింపు చుంటిని. పాటు, విశ్రాంతి రెండును ఏకకాలమందు అనుభూతమగుటెట్లో తా నూహింపజాలనని ఆయన అధిక్షేపించినాడు. సిద్ధాంతరూపమున దీనిని విశదము చేయుట కష్టమేకావచ్చును; కాని నిదర్శనము చూపుట సులభమే. కావున నేనాయనను ఏ శిల్పి కర్మశాలకైనను పోయి, తనకుతానే సమస్యా విమర్శనుచేసికొను డంటిని. ఆయన నామాట కొడంబడి, నాతోడనే యొక బడిపంతులు ఇంటికివచ్చినాడు. ఆతడు టోపీలను జేసి జీవనము గడుపుకొనువాడు. టోపీలుచేయుకర్మ క్రమములో అతనికి విశ్రాంతి యెక్కడనో, తీరుబాటు అనెడు వేఱు కర్మకలాప మెద్దియో విశదము చేయుడని ఇంజనీయరు నన్నడిగెను.

ఆ బడిపంతులు టోపీలు చేయుటలో ఏమేమికర్మలు చేయునో అడిగితిమి. ఆత డొక తట్టను తీసికొనివచ్చినాడు. అందుండి యొక మఖమలుగుడ్డను దీసి, దానిలో అండాకారముగ నొక ముక్కను కత్తిరించినాడు. ఎఱ్ఱఅస్తరు (లైనింగు) గుడ్డను దీసి, దానిలోను ఆలాటిముక్కనే కత్తిరించినాడు. దీని కతడు కొన్ని ప్రాతకాగితపు ముక్కలను టాకీలు వేసి అతికించినాడు. తరువాత దాని నొక కుట్టు యంత్రములో బెట్టి కొన్ని చిత్రాకృతులను దానిపైన కుట్టినాడు. అంతట దానిని మఖమలు గుడ్డపైన బెట్టి కుట్టినాడు. దాని మీఁది చిత్రాకృముల ననుసరించి కొన్ని రంధ్రముల జేసి, ఇత్తడి గొట్టపుముక్కల నందు బిగగొట్టినాడు. వీనిగుండ గాలి ఆడుచుం

డును. ఈ గుడ్డను టోపీపైని మూతగ కుట్టునట. ఆ యా కర్మాంశ ముల నన్నింటిని అతడు నిర్వహించుచుండ ఇంజనీయరుగారికి నేను కొన్ని వివరములను చెప్పసాగితిని. ఆ ముఖమలుగుడ్డ ఇటలీనుండియు లైనింగుగుడ్డ జపానునుండియు వచ్చిన వగుటచేత, వానిని సంగ్ర హించు సందర్భమున కొన్ని అంతర్జాతీయ వాణిజ్యసమస్య లతనికి తట్టును. కత్తెర దీసికొని గుడ్డలు కత్తెరవేయుతరిని వానిలోని యొక రీతి కండరముల సమర్థత పని చేసినది. కుట్టుయంత్రముతో చిత్రా కారములను కుట్టునప్పుడు మరొక సమర్థత అనగా కళానిపుణతయు గాలిబెజ్జముల నమర్చునప్పు డింకొకతీరు కౌశలమును, వేరొకనాడీ జాలమును పని చేయుచుండెను. ఊరక యిత్తడి గొట్టములు బిగించు సమయమున చిత్రకళానైపుణ్యమునకును తత్సంబంధమగు యూహా పోహాలకును పని యుండదు; ఆతని కళానిపుణతకు అపుడు విశ్రాంతిదశ.

మే మిటుల ప్రసంగించుచుండగా దొడ్డిలోనుండి పంతులుకూతురు ఏడ్పు వినవచ్చినది. తత్క్షణమే అతడు చేయుచున్న పనిని విడిచి, పర్విడిపోయి, బిడ్డ నెత్తికొనినాడు. పెద్దమనుష్యులు వచ్చి యింటిలో నుండగ బిడ్డ నేడ్పించినందులకు సతిని మందలించినాడు. పంతు లటుల భార్యతో తగవులాడుపట్ల ఇంజనీయరుతో నే నిట్లంటిని; "అదిగో, వారి కిప్పుడు సంపూర్ణమగు తీరుబాటు వినోదములు అను భూతములగుచున్నవి". "ఓహో! ఇపుడు మీభావము నాకు పూర్తిగ అర్థమైనది" అనుచు ఇంజనీయరు పకపక నవ్వినాడు.

జీవితము ప్రకృతి ననుసరించి జరుగునపుడు, ప్రయత్నపూర్వక ముగా తంటాలుపడి మన మేజోక్యమును తెచ్చిపెట్టుకొనకుండగనే, తన సాధనోపాయముల నది కనిపెట్టి, తన యవసరములనెల్ల నదియే తీర్చుకొనగల్గును.

శ్రమయు, జీవనపథమున, శ్రమధర్మమును ఈతీరున నుండును. అది నరుని శక్తిసామర్థ్యము లన్నియు వినియోగపడు వసతులను గల్పించును. వానికి తన జీవితకాలమున పరిణతిపొందుట కవకాశము నొసగును. మరియు లోకము విడిచి పోవునపుడు అతడు శ్రమపడి యుత్పత్తిచేసిన వస్తురాశిపైన వాని వ్యక్తిప్రభావము స్థిరముగ ముద్రితమై నిలిచియుండును. అయ్యదియే వాని శ్రేష్ఠతమాంశము.

చిత్రకారుడు తనయందలి సౌందర్యభావమును పటపుటముమీదికి చేర్చి ఒక ఉత్తమచిత్రమును లోకమున విడిచి పోవుచున్నాడు. భావి సంతతివారు దాని నెంతయో మక్కువతో సంరక్షించి పూజింతురు. ఆ చిత్రశిల్పి రవ్వంత రవ్వంతగా రంగులను దీసికొని, పటపుటమున నద్దుచుండు సమయమున, దినములుదినములుగా కష్టపడిచేయు బండ చాకిరిగ అది గోచరించియుండును. కాని ఆశ్రమయే శ్రేష్ఠమగు చిత్ర రాజముగా సిద్ధముకావలసి యుండెను. బొమ్మల అచ్చొత్తివేయు వతడు ఈ కష్టమును, ఈ బండచాకిరిని తప్పించుకొనగలడు. కా: అతడుఉత్పత్తిచేయు చిత్రపటములు, వాస్తవికచిత్ర శిల్పి రచించి: ఉత్తమ చిత్రముతో పోల్చి చూచునెడల, వానిపట:ము లన్నియు తుంక్కకాగితపు ముక్కలనుమించిమానసీయములు కావు.

చిత్రరచనాకార్యము ప్రారంభమగుటకు పూర్వము సయితము, రంగులను కలుపుటలోను, వర్ణద్యుతుల నిర్ణయించుటలోను గంట కొలది కాలము చాల కష్టపడి అతడు పనిచేయవలసి యుండును. అజంతాగుహాలలో వినియోగింపబడిన రంగులు ఇన్ని శతాబ్దములు చెక్కుచెదరక నిలచియుండు లీల, పూర్ణస్థితికి వచ్చు పరిణతిని సాధించుట కెన్ని దశాబ్దులు పట్టెనో? ఆనాటి యా చిత్రకారులు అందుకు వలయు శ్రమ నర్పించుటకు వెనుదీసి యుండలేదు. వారి సంతానము వారు తమకు ప్రసాదించియున్న సాటిలేని కళాసంపదం గూర్చి

జోహారు లర్పించుచున్నారు. అట్టి ధన్యప్రతిభ నార్జించుట కవసరమైన శ్రమను అర్పణము గావింపకుండ, ఆ కళానిధులు తమ సాధనములను తమ యుపాయములను కనిపెట్టియుండరుగదా ! ప్రకృతి చాల కాఠిన్యము చూపు అధికారిణి. ఉత్సాహశూన్యులై వెనుకాడుచు చేయు శ్రమకు మెచ్చి, యీ ప్రకృతి యెన్నడును శాశ్వతత్త్వమును ప్రసాదించునది కాదు. మనము శాశ్వతఫలమును పొందనభిలషింతుమా నిరంతర చిరకాల శ్రమపడవలసినదే. తాత్కాలికముగా సంతోషము గొలుపు క్షణభంగురపు శ్రమవలన, మనకు వచ్చిపడున దంతగా నుండదు. ప్రకృతి యెన్నడును భ్రమపడునది కాదు, భయపడి లొంగునది కాదు.

అటులనే యెల్లోరాలో గొప్ప పెనుశిలయందు అల పెద్ద దేవళమును తొలిచి ముం దెన్నితరములనాడో జననము గాంచనున్న తమ వంశీకులకు పిత్రార్జితముగ ఆ కళాస్రష్ట లొసగిన దివ్యసంపద వారి శ్రమఫలితమగు సౌందర్యనిధియే. ఆ ప్రమాణవిజ్ఞత, ఆ రూపసౌష్టవము శ్రమను తప్పించుకొను కడకయొక్కగాని, సులభోపాయములయొక్కగాని ఫలితార్థము కాజాలదు. నిష్కపటముగ సాహసించి కాలోచితకార్యముల నిర్వహించినవారి శ్రమయొక్క సత్ఫలమే అది. సవ్యమార్గమున చేకొనిన శ్రమ, శ్రామికుని వాని శ్రమ కారణముగా లభించిన యుత్పత్తిని ధన్యము చేయగలదు.

శ్రద్ధాపూర్వకముగ నిర్వహింపబడిన వినిర్మలశ్రమం గూర్చిన మరొక యుదాహరణమును వివరింతము : ఢిల్లీలో కుట్బుమినారు సమీపమున నొక ఉక్కు స్తంభము కలదు. దానిపై నొక పురాతన శాసనము కూడ గలదు. ఆ స్తంభము ఎండవానలనుండియు, శీతోష్ణముల నుండియు ఏలాటి రక్షణము లేకుండ బహిరంగప్రదేశమున శతాబ్దులకాలము నిలిచియున్నది. ఐనను దానిపైన నలుసంత త్రుప్పు

కాన్పింపదు. అందలి లోహముల కూడిక, ఏతీరున కల్పింపబడెనో యీనాటి లోహకారు లెందరో శోధించి కనుగొనలేక విభ్రాంతు లగుచున్నారు. ఈ ధ్వజరాజమును పోతపోసిన ప్రాచీన లోహ శిల్పులు దాని నిర్మాణమునకై, శ్రమనివారక కృత్రిమోపాయముల వెంటబడినవారు కారు. ఆ యా లోహములతోడి దాని నిర్మాణమున కవసరమగు శ్రమను, శిక్షణమును తప్పించుకోనెంచి యుండరు. వారు ప్రకృతి శాసించినరీతినే శ్రమను గ్రహించియుండిరి. కావున ఆ లోహస్తంభ మీనాడు మనకా సత్యము నత్యంత గంభీరముగ ప్రకటించుచున్నది.

ఐశ్వర్యము సుఖభోగము బంగారుగనుల పరిశ్రమతో సంబంధించి పెరుగుచుండుననను భావము పెక్కండ్రకు కలదు. కాని కష్టాంశమగు బండచాకిరి నొకతరగతి ప్రజలకును, సుఖాంశమగు నైశ్వర్యమును వేరొకతరగతివారికిని కట్టబెట్టు విధానము మన భారతదేశములో బంగారుగనులకు పేరెన్నిక గాంచిన మండలమును దరిద్రనిలయముగ చేసివేసినది. ఆ జిల్లాలోని రయితులు తమ ఆవులను "ద్వివిధ విని యోగము" పాలు చేయవలసినంతగా డబ్బునకు మొగమువాచి లేమిని గుడుచుచున్నారు. "ద్వివిధ వినియోగ" మనగా నేమిటి? ఆవులు పాడివగునెడ నాలుగుచుక్కలు పాలిచ్చుట; యొడిపోయి సమయమున నాగలికి గట్టబడి నేల దున్నుట- అను రెండు తెఱగుల వినియోగపడుచున్నవి.

ఆ ప్రదేశమునందు నేను సంచారముచేయుకాలమున, ఏడు వే యడుగుల లోతుగల యొక గని గోతిలోనికి నన్ను దీసికొనిపోయి అచట చీకటిలో 'డేవిసు' లాంతరొసగు మిణుకు మిణుకుమను వెలుగు సాహాయ్యమున శ్రామికులు సొరంగములలో దూరి పని చేయు చున్నారు. చట్టురాయి తగిలినచోట తుపాకిమందు కూరి కాల్చి

వగులగొట్టుదురు. ప్రొద్దు పొడిచినది మొదలు క్రుంకువరకు నాలుగు డబ్బుల కూలి కాసించి, అపాయములకు లోనై, దుమ్మనక ధూళి యనక ఆ మట్టికి సొరంగములలో శ్రామికు లెందఱో పాటుపడుచున్నారు. ఇంత చేసినను వారికి కడుపునిండ కూడు లేదు. వారికిచ్చు కూలి స్వల్పమే శ్రమయా చాల హెచ్చు. సాయంతనమున వారిని విశాల శుభ్రవాతావరణములోనికిని వెలుగులోనికిని లేవదీసినపుడు, వా రెంతయో అలసి, సొమ్మసిలి యుందురు. జవసత్త్వములుండవు. ఆ సంస్థానప్రభుత్వమువారి ఆదాయములో ఆ జిల్లానుండి కల్లు సారాయిలమీద వచ్చు రాబడియే చాల హెచ్చు. మిగుల సొక్కిపోయిన ఆ శ్రామికుల నరముల సత్తువ నిల్పుకొనుటకు కల్లుముంత కిరుణించి ప్రసాదించు కైపుతప్ప తరుణోపాయము లేదని వారు భ్రమించుట అబ్బురమా! గనుల పనివారలలో వ్యభిచారము సుఖజాడ్యములుకూడ అధికమే. ఎచ్చటెచ్చట మితిలేని శ్రమవలన నరజాలము నలిగిపోవుట గలదో, అచట సహజముగనే సేదదీర్చుకొను సాకుగా స్త్రీకొరకును, సారాయికొరకును పరువులుపెట్టుట కాననగుచున్నది. మానవశరీరనిర్మాణమున కనుసరణమగు మానసిక జాడ్యములలో ఇదొకటిగ నున్నది. నా దర్శనానంతరము ఆ ఖని యజమాని సాంఘిక క్షేమముకొరకై యేదేని యుద్యమముం గూర్చి నే నేమైన సలహా నీయగలనా యని అడిగినాడు. గనులలో పనిచేయు శ్రామికుల నుద్ధరించు నుపాయమును దెలుపుడని అర్థించినాడు. నేను రెం డుపాయముల దెలిపి, యే యొకదానినైన అనుసరించు డంటిని. (i) శ్రమయొక్కయు, పాటుయొక్కయు, గౌరవమును పునఃప్రతిష్ఠించు నిమిత్తము ఆ గనిపనిని మూసివేయు డంటిని. లేనియెడల (ii) ఆ శ్రామికుల దుఃఖములను పూర్తిగ మరుగుపఱచజాలునంతటి సారాదుకాణములనైన పెట్టించు డంటిని. నా సలహా విని

ఆ యజమాని నిర్ఘాంతపోయెనని వేరుగ చెప్పనక్కరలేదు. ఈ రెండు వసులును వానికి అహితములే. వారి కంపెనీ పెద్ద పెద్దలాభముల పంచిపెట్టగలంత వృద్ధిలో నున్నది. ఆ కంపెనీవారికి మానవ జీవుల క్షేమముకంటె సువర్ణోత్పత్తి, డబ్బు రాబడి హెచ్చుప్రధానములు కదా?

ప్రకృతిసిద్ధమగు శ్రమవలన పూర్తిలాభమును బడయగోరితిమేని శ్రమయొక్క ప్రాథమిక సరళస్వరూపమును సాధ్యమగునంతవరకు నిలిపిపట్టవలయునేగాని ఆ శ్రమయే నిరుపయోగమైపోవునంతగ సూక్ష్మవిభాగము చేయ సాహసింపదగదు.

కూలి:— ఉచితరీతిని జరుగు శ్రమను గూర్చి ప్రకృతి యెట్లు బహూకరించునో శ్రామికుల కది యెట్లు లాభముల చేగూర్చునో తెలిసికొంటిమి. అటుల శ్రమవలన చేకూరు లాభమే సహజమగు కూలి.

జీవనము 'సంకీర్ణమై' రాగా రాగా నరుడు శ్రమవిభాగమును మితిమీరి ప్రవేశపెట్టుచుండును. మొత్తముమీద చేకూరిన లాభములోని స్వతస్సిద్ధాంశమునకు మారుగా డబ్బురూపమగు కూలిని శ్రామికునికి తిరిపెమిడినటుల నొసగుచుండును. శ్రమయొక్క వాస్తవిక ధర్మమును సదా మన కండ్లయెదుట నుంచుకొందుమేని, తికమకలుపడి మన మారీతిగ పెడత్రోవలకు త్రొక్కు నవసర ముండదు.

దురదృష్టవశమున కూలిపద్ధతి తలచూపినప్పటినుండి ప్రాధాన్యత శ్రమయొక్క ధర్మముమీదినుండి మారి, శ్రమవలని యుత్పత్తి పైకి గంతిడినది. అచ్చోటనే నిలిచినది. ఆ కారణమువలననే యీనాడు సహజధర్మమును ప్రక్కకు నెట్టివేసి, ఉత్పత్తిసమస్య రాజ్యము చేయుచున్నది. విశాలములగు పణ్యక్షేత్రములందు, అత్యధికమగు లాభముల గడించులాగున విక్రయింపగల ఉత్పత్తుల (సరకుల) గూర్చి

మాత్రమే యజమాని సదా తలపోయుచుండును. కావున అత్యల్పమగు ఖర్చుతో, అత్యధికోత్పత్తిని చేయించవలయు ననెడు సమస్యయే వాని నావహించి యుండుచున్నది. సరకును ఉత్పత్తి చేయించుటకే ఆతడు కూలి నొసగుట. నైతికధర్మ మేమైపోయినను 'శ్రమ' పరిస్థితి యెట్టి పరివర్తన మందినను, సాధనప్రయోగ మేతీరు దైనను పర్యవసాన మెటువంటిదైనను కనిపట్టక కూలిడబ్బుల కాశపడి, వస్తూత్పత్తిచేయు శ్రామికులు ఒండొరులతో పోటీలు పడుచు, తండోపతండములుగ, తమంత తాము వచ్చి జొరబడుచున్నారు. డబ్బును మించిన ఏ ప్రమాణమునకును ఈ సమస్యాపరిష్కారమున ప్రసక్తి లేదు. ఈ విధముగ 'శ్రమ' వ్యాపారసంబంధమున చిక్కువడిపోయినది. శ్రామికుడు హెచ్చుకూలి నిచ్చు నాశపెట్టు యజమానికి బానిసయై అమ్ముడువోవుచున్నాడు. యజమానియో వీలగునంత చౌకకూలి నొసగి, తన శ్రామికులను ప్రోవుచేసికొన జూచుచుండును.

ఆఫ్రికా పడమటితీరమున పట్టువడిన బానిసలను అమెరికా సంయుక్తరాష్ట్రము లందలి తోటలలోనికి చేరవేయు ఓడలను నడుపుటకై బానిసల వర్తకునికి నావికులు కావలసివత్తురు. చీనావారికి బలాత్కారముగ విక్రయించు నల్లమందును తయారుచేయు నిమిత్తము, తన చేలలో గసగసాలను ఉత్పత్తిచేయుటకై క్షేత్రపతికి కూలీలు కావలసియుందురు, డబ్బురూపమగు కూలితప్ప, యేలాటి నైతిక సాంఘికప్రసక్తియు పెట్టుకొనకుండ అవసరమగునంతమంది శ్రామికులు దొరకుటే వానికి కావలసినదెల్లను! నైతికమూల్యముల ప్రమేయము వానికి పట్టనేపట్టదు.

తనబిడ్డకు పాలిచ్చుతల్లి తనబిడ్డకు పాలిచ్చుచుసాకు సందర్భమున గాని తనపిల్లలకు వంటచేసిపెట్టు విషయమునగాని, 'సేవాపరిపోషణ'


విధానములో ప్రకృతి ప్రేరేపించిన తీరున, తనధర్మమును నిర్వహించును. తనబిడ్డలు తుష్టుగా తిని సుఖముగనుండ జూచుకొని ఆనందించుటే తల్లికోరుకొను ప్రతిఫలము. అదియే ఆమె 'కూలి' యననగును.



పాలదాది పరులబిడ్డకు పాలిచ్చునపుడును, వంటకత్తె డబ్బుకై పరులయింట అన్నము వండునప్పుడును 'సేవాపరిపోషణము' నుండి 'సాహసపరిపోషణ' దశకు వారు పడిపోవుచున్నారు. ఈరెండు సందర్భములందును, తల్లియొక్క శ్రమ జీతపు డబ్బుకాశించి పరులబిడ్డకు పాలిచ్చుదాది వ్యాపారసరళి లోనికిదిగి పోవుచున్నది. దాదియు, వంటకత్తెయు తమకుదొరకు డబ్బునుబట్టి గిట్టుబాటును గణనచేసి కొందురు. బిడ్డలక్షేమమో ఆ తరువాతి సంగతి.

అవసరము కలిగిగాక, తనసౌందర్యమును నిలుపుకొను కాంక్షకు లోనై సహజమైన తనపాలను బిడ్డకీయక, అందులకు మారుగ డబ్బీ పాలను తనబిడ్డకు త్రాగించునెడల అట్టితల్లి ఇంకను పడిపోయి 'స్తేయపరిపోషణ' స్థితికి దిగజారినదగుచున్నది. డబ్బీపాలనుత్పత్తి జేయువతనికి బిడ్డగోడు పట్టదు. అతనికి కావలసినదెల్ల బజారులో తనసరకు హెచ్చువెలకు విక్రయించుకోగల్గుటే. అందుకై అతడు లేనిపోనియోగ్యతల నెన్నింటినో తనసరుకున కారోపించి ప్రకటనల సాగించును. తల్లియొక్క సౌందర్యరక్షణనుగూడ వానివ్యాపార పరమలక్ష్యములలో చేర్చి చాటుచుండును.

డబ్బాపాలను గూర్చిన బూటకములో అతిశయోక్తులతో గూడిన ప్రకటనలు సాగించునెడల మనమింకను 'పరాన్నపరిపోషణ'కే దిగజారిపోయినట్లగుచున్నది. అప్పుడు వర్తకుని చేతిలో బహు డబ్బే అన్నిటికి ప్రధానము. బిడ్డకేమేని హానికలిగినను చింతయే లేదు. ఈతీరుగా రాను రాను మాతృధర్మము, డబ్బులాభము కో అకాశించి, తల్లికి బదులుగ మాతృస్థానము నాక్రమించునటుల నటించు



తల్లి 'సౌందర్య' సంరక్షణకై బిడ్డకు డబ్బీపాలు

పెక్కండ్ర పాలిట పడిపోయినది. అందుమూలమున పవిత్ర మాతృధర్మము, తత్సంబంధమగు క్షేమాభ్యుదయకర కర్మములతో సహా రూపుమాసి పోవుచున్నది. మిగులునదెల్ల వట్టివ్యాపారము; డబ్బుతో కొనుట, డబ్బునకమ్ముట.

ఒకానొకకాలమున కాశ్మీరదేశమునందు మేలిరకపు దుప్పట్లు తయారు చేసెడివారు. ట్కర్కీతువాళ్ళవలె రోమముతో నమరియుండి, అవెంతయో మెత్తగాను వెచ్చగానుగూడ నుండెడివి. వానిని తయారు చేయుటలో నక్కడివారు అత్యంతమగా చాకచక్యము చూపెడివారు. వాని యుత్పత్తికి చాలకాలము పట్టును. ఆకారణముచేత నవి చాల ప్రియముగ నుండెడివి. కాలక్రమమున నవి రూపుమాసిపోయినవి. వాని స్థానమును మిల్లుదుప్పట్లాక్రమించినవి.

కొండొకకాలమున చర్ఖాసంఘ ప్రచారకులలో నొకనిదృష్టి రోళ్లకై రాళ్లను చితుకగొట్టు బీదవారిపై బడినది. ఆతడు సాగించిన విచారణనుబట్టి వా రొకప్పు డారకపు మేలిదుప్పట్లు చేసెడివారనియు, ప్రత్యేకముగ వా రాకళయందు మంచినిపుణు లనియు తెలియవచ్చినది. వారి సరకులకు గిరాకీ తగ్గిపోగానే వారి వృత్తి యడుగంటిపోయినది. వారి సుశిక్షితకళాకౌశలముగూడ ప్రపంచమున కపురూపమైపోయినది.

శ్రమపైనుండు ప్రాధాన్యత ఉత్పత్తిమీదికి మారిన కారణమున, హస్తకుశలురగు శ్రామికులు కటా! రాళ్లు పగులగొట్టు కూలివారుగ మారవలసివచ్చినది. మానవనిపుణతను సద్వినియోగము గావించుటకు ఆర్థికశాస్త్రానుగుణ్యమును సహజము నగు విధాన మిదియేనా? శ్రమయొక్క వాస్తవికధర్మమును ఉపేక్షించి డబ్బురూపమగు కూలిపద్ధతి నవలంబించుటవలన మూడిన అనర్థమే యిది! యంత్రాలమీద ఉత్పత్తిచేయబడిన సరకుల దిగుమతివలన, శ్రామికుల ధన్యజీవనము గంగపాలైపోయినది. ఇంగ్లాండులో నొకప్పుడు స్వతంత్రజీవనము చేయుచుండిన రయితు లెటుల బ్రిటిషు ఫ్యాక్టరీలలో దీనులగు కూలివాండ్రుగ మారిపోవలసి వచ్చెనో గ్రహించియుంటిమి. అటువంటి ఫ్యాక్టరీలలో తయారైన సరకుల దిగుమతివలన, మన దేశములోని నరజీవులును తమ బ్రతుకుకొఱకు నోరులేని పసువులతో పోటీకి దిగవలసిన దుర్గతి పట్టినదిగదా! నరుడు ఎద్దులయు గుఱ్ఱాలయు స్థానము నాక్రమించి, సరకుబండ్లను రిక్షాలను లాగుట, అనేక నగరములలో మనము సాధారణముగ చూచు దృశ్యమే కదా? పారిశ్రామిక దేశములందలి ‘శ్రమనివారణోపాయముల’ ప్రతిబింబమే యిది. ఇంగ్లాండులో నిట్టిది శ్రమనివారణ గావింపవచ్చును. కాని

భారతదేశములో నిదియే, శరీరమున ప్రాణముల నిలుపుపాటి తిండినైన సంపాదించుకొనజాలక నరుడారాటపడుటకు మూలమగు చున్నది. క్రొత్త కష్టముల నెన్నిటినో తోడదీసికొని వచ్చు చున్నది. సమస్యా పరిష్కారము గావింపగల యే విధానమువలనను ఒక తావున కలిమి మరొక తావున లేమి సృష్టి కాదగదు. కర్మ కుశలుడగు శ్రామికుని రాళ్ళపగులగొట్టు కూలివానిగనో, రిక్షాలు లాగువానిగనో మార్చి గ్రాసమునకై ఆరాటపడు పశువులతో పోటీ పడజేయు ఏ విధానమునేని అభ్యుదయ చిహ్నమందుమా ?

శ్రమకు అర్హమౌ పూజ్యస్థానమును మరల దానికొసగవలసి యున్నాము. అపుడది మానవ శక్తిసామర్థ్యములకు శ్రేష్ఠ తమ పరిణతిని చేకూర్పగలదు. ఉత్తమశీల నిర్మాతయై వెలయగలదు. ఇందు కృతకృత్యులము కాగల్గుదుమేని శ్రమను దాస్యశృంఖలముల నుండి విముక్తము చేసిన వారమగుదుము. దానినైజధర్మ ప్రవృత్తికి అవకాశముం గల్పించిన వారమగుదుము.

నరునిముఖము జీవప్రభతో వెలుంగుటకు శ్రమభాస్కరప్రభలు వానికవసరము. సవ్యమౌ శ్రమ కేవలము శ్రామికునకేగాక, చుట్టు నున్న వారందఱకును వెలుగును వెచ్చదనమును ప్రసాదింపగలదు. ప్రేమమయియగు తల్లి తన బిడ్డలకొఱకు శ్రమపడి పనులజేయునపుడు తానానందము ననుభవించుటేగాక, కుటుంబము వారందఱును ఆమె ప్రేమయొక్కయు శ్రద్ధయొక్కయు అమృతఫలరసము ననుభూతి చేయగల్గుదురు. బిడ్డల శరీరములు మనస్సులు పరిపోషింపబడును. వారు వీర్యవంతులై పౌరులుగ వర్ధిల్లుదురు. ఎంత సమర్థతతో శ్రమపడినను దాదిగాని, యింటి దాసిగాని గృహలక్ష్మియై మాతృ స్థానము అలంకరింపజాలదు. అదే విధముగ శ్రీమయొక్క పరమ

ధర్మమును, ఎఱగా నొసగబడు కూలిడబ్బు నిర్వహింపజాలదు. తల్లి ప్రేమను కొనుటకును అమ్ముటకును ఎటుల వలనుపడదో కర్మ కుశలుని యభిమానము నటుల వర్తక సరళిలోనికి ద్రింప వీలు పడదు. అగుచో దాని ప్రతిభయే భగ్నమైపోవును.

తనకు రాగల డబ్బుపైగల శ్రద్ధనుబట్టి రోగి నాదరించు వైద్యుని కన్న రోగియందును రోగమునందును శ్రద్ధవహించు చికిత్స విషయ మును చక్కగా విశదీకరించు వైద్యుడు హెచ్చు విజ్ఞానమును అను భవమును గడింపజాలును. మొదటివాడు ధనకాంక్షయొక్క ప్రేరణ వలన శ్రమదీసికొనును. రెండవయతడో ఆశ్రమయందు తనకు గల అభిమానమువలన పనిచేయును. ఈతడు జాగ్రత్తగా వృత్తిని నిర్వ హించును. మొదటివాడు మందులనమ్ముకొను వ్యాపారి మాత్రమే. అతడు రోగులకు నిర్ణీతమైయున్న ఔషధముల వినియోగించుచు మందుల నుత్పత్తిచేయువాని పక్షమున పనిచేయు విక్రియదారు డగుచున్నాడు. ఒకడుచావ సిద్ధముగ నుండవచ్చును. సమర్థుడౌ వైద్యున కీయవలసియుండు డబ్బురుసుము నీయలేనివాడగునెడల వానిగోడు నావైద్యుడు విచారింపడు. ఇంకొక నరుడు ఆర్భాటములు చేయువాడు కానగును. ఆతని సంచినిండుగ రూకలున్న చాలును. కావలసినంత వైద్యసేవ, కోరిన మాత్రాన వానికి లభించును.

అదే తీరున తన యొద్దకు వచ్చిన కక్షిదారుని వ్యాజ్యమును నైతిక దృష్టితో విచారించి, తదనుగుణ్యముగ పనిచేయు నతడు వృత్తినిబట్టి న్యాయవాది యనందగును. తనకు వచ్చు రుసుమును బట్టి పనిచేయు న్యాయవాది న్యాయశాస్త్రముతో వ్యాపారము చేయువాడగును, ఆశాపాత్రుడగు తన న్యాయవాదిని తృప్తిపఱుప

జాలునంతటి డబ్బుచేత లేని హేతువువలన చెఱసాలలో క్రుస్గుచున్న పురుషు లెందరో కలరు.

అదేమి దురదృష్టమోగాని, ప్రతిజీవన నీతియు అంగడివీథికి లోబడిపోయి డబ్బు ప్రధానమగు ఆర్థికనీతి చేతులలో చిక్కిపోవుట చేత మానుషధర్మ దృష్టితో వర్తించుచు తమ తమ వృత్తి నీతిని నిర్వర్తించు పురుషులు గానవచ్చుట మిగుల అరుదై పోవుచున్నది.

మనము పరీక్షించిన సందర్భములన్నింటను ప్రాధాన్యత శ్రమ నుండి తొలగింపబడి, కూలిడబ్బుమీద నిలుపబడుచున్నది. కూలి యందు నిర్మాణాంశము శూన్యముగనుండు గావున, పురోవృద్ధియు శూన్యముగనే యుండును. మన దేశములో వైద్యశాస్త్రమున చెప్పఁ దగినంత పరిశోధన గావించిన పురుషుని నొక్కనినైన గాంచ లేకుంటిమిగదాయని ప్రజలు వాపోవుచుందురు. కారణమునకై దూరము వెదుకపనిలేదు. ఆవృత్తి 'స్తేయపరిపోషణ' యొక్కయో 'పరాన్న పరిపోషణ' యొక్కయో స్థితికి దిగలాగబడి, అవలంబ నము చేయబడుచున్నది. 'సాహసపరిపోషణ' దశకు చేరినవారు కొద్దిమంది. 'సమూహపరిపోషణ' దశనుగాని 'సేవాపరిపోషణ' దశనుగానిఅందుకొనినవారుచాల అరుదు. కర్మక్షేత్రము కడువిశాల మగుటచేతను, చక్కనికట్టుబాటులుగల వసతులు లేమిచేతను, వారి ప్రావీణ్యత ఫలప్రదమగుటలేదు.

న్యాయశీలురును సత్యప్రియులునగు ప్రవర్తకులు ప్రతిక్షేత్రము నందును అరుదుగనే కనబడుచున్నారు. బహుశః ధనరూప పరి పోషణ విధానము పాలనము చేయుపట్ల, అట్టి స్థితి అనివార్యమై యొప్పును. శ్రమకు మారుగా కూలిడబ్బు, ఉత్పత్తిరాశి యనునది క్రమేణా అధికారస్థానము నాక్రమించి వేయుచుండును.

శ్రమయొక్క తత్వమును గ్రహించి దానిననువర్తించు నెడల, స్థూలశరీరమున కాహారమెట్టిదో, సూక్ష్మతరశక్తిరాజిపట్ల శ్రమ అట్టిదె యుపకరింపజాలును. శ్రమ ఉత్తమనరునికి పుష్టి నొసగును; జనసత్వములు ప్రసాదించును. వానికి సాధ్యమగునంత శ్రేష్ఠతమ కార్యముల నిర్వహింప ప్రోత్సహించును. వానియందుండు పశు లక్షణములకు పరిణతి మార్గములందు శిక్షణగఱపి, వాని స్వాతంత్ర్యేచ్ఛకు పరమోత్తమ గతులనెఱపును. నరుడు తన మూల్య ప్రమాణముల ప్రదర్శించి, తన వ్యక్తి ప్రభావమును ప్రవర్ధనము గావింప నాధారపడును.

సారాంశము

శ్రమను విభజించు ప్రయత్నమునందు మన ప్రధానదృష్టిని శ్రమ యొక్క ధర్మమునుండి తొలగించివేసి యంత్రాయుడమాసి సందర్భమున ఉత్పత్తిరాశిమీదను, శ్రామికుల సందర్భమున కూలిడబ్బు మీదను నిలుపుటెట్లు సంభవించునో తెలిసికొంటిమి. ఆ విభాగము యొక్క ఫలితార్థము మహోపకారదాయకమై ప్రధానకర్తవ్యముగా నుండదగిన శ్రామికుని యోగక్షేమమును దృష్టినుండి జారవిడుచుట సంభవించినది.

ప్రకృతిలోని సహకారమునకు ముఖ్యోద్దేశము శ్రామికుని ఆత్మలాభ మనియు గ్రహించియుంటిమి. శ్రామికుని క్షేమమే అందుకు ప్రత్యక్షఫలము. తేనెటీగవిషయము చూడుడు: అది మొక్కలందు చూలు కల్పనచేయుట తన ప్రధానకర్తవ్యముగ భావించుట లేదు. పూదేనెను పుప్పొడిని ప్రోగుచేసికొనుటయే దాని ప్రధానోద్దేశము, ప్రకృతియొక్క దృక్పథమునుండి చూచునెడల, తేనెటీగ కావించు సేవకు అదియే తృప్తికరమగు పూర్ణప్రతిఫల మగును.

శ్రమవిభాగవిధానమువలన లాభములను అనేక అంతర్భాగములుగ విభజించుట సంభవించుచున్నది. జీతములు, కూలి, అద్దె, వడ్డీ మొదలగున వన్నియు లాభమును పృథక్కరింపగ వచ్చు అంశములే; శ్రామికుడు పాటుపడి సమకూర్చిన లాభములో హెచ్చుభాగము అందువలన వానికి దక్కకుండ పోవుటే పర్యవసానము, స్వలాభాపరుడగు వ్యాపారి వచ్చి దూరి, సంపాదింపబడు లాభములో హెచ్చుభాగమును తస్కరించుకొని పోవుచున్నాడు. తేనెపట్టులో ప్రవేశించి తేనెటీగలు కష్టపడి కూర్చిన పదార్థముల నెల్ల తినివేయు మైనపుపురుగువంటివాడే యీ వ్యాపారి.

ఈ పరిశీలన సాగించి మనము నేర్చుకొనిన సారాంశ మేమన:— ప్రకృతిలో జీవులు పరస్పరసహకారమును పెంపొందించుకొనుటకు స్వలాభ కాంక్షయే ప్రధాన ప్రేరకశక్తి. ఆ లాభమును తస్కరించు ప్రయత్నములెల్ల 'శాశ్వతపరిపోషణము'నకు విరుద్ధములైనవే. ఎప్పుడో యొకప్పుడు హింసాచర్యకు మూలమగునవియే, సోషలిష్టులు న్యాయమగు పంపుడును ప్రతిపాదింతురు. కాని వారుమున్ముందుగా లాభములను పోగుచేసి ఆ పిమ్మట నెప్పుడో పంపుడులు సాగింపవచ్చునందురు. వారి యీ ప్రణాళిక ప్రకృతియొక్క ఉదారవిధానమునకు కేవలము విరుద్ధము. ప్రకృతి నేరుగ లాభములను పంచిపెట్టును. ఈ సోషలిష్టుల విధానమువలననుకూడ తుదకు హింసాచర్యయే పర్యవసించును.

పథకరచన :— పరిపోషణపథక నిర్మాణమున కిది యదను కాకపోయినను ఉత్పత్తిరాశిని కూలిని మాత్రమే దృష్టిలో పెట్టుకొని యే పథకరచనకైనను పూనుకొనుట ప్రకృతివిరుద్ధచర్య యగునని యీ సందర్భమున పేర్కొనుట అప్రస్తుతము కాదని తోచుచున్నది. మన లక్ష్యసిద్ధికి అనుకూలమై, శాశ్వతపరిపోషణమునకు సాయపడగల యే పథకరచనకైనను 'శ్రమ' యొక్క సహజధర్మమును కేంద్రస్థానమున నిలిపి సాగింపవలసి యుండును; మరియు ఎవరికొఱకై 'శ్రమ' నిర్ణయమైనదో అటువంటి మానవజీవియొక్క సమర్థతయు స్వభావమును దానికి పునాదిగా నుండవలయును.

వ్యవసాయకుడు ధాన్యమును నూర్పిడిచేసి తెచ్చి పురుల నిలువచేయును. ఎలుకలు వానిలోనికి బొఱియలు చేసికొని ప్రచును. అపుడా వ్యవసాయదారుడా సమస్యను చేకొని, తదః ముగా కుటుంబపోషణకై పథకమును వేయును. ఎలుకలు

నుపాయముగా పిల్లి నొకదానిని పెంచును. ఎలుకలను వేటాడుట పిల్లికి నైజమగుటచేత వాని పథకము ప్రకృతికి అనుసరణముగా నున్న దందుము. అంతట పిల్లిపాలకై ఆవును కొనును. తుదకు ఆవు పోషణకును సంసారమును దిద్దుటకును భార్యను తెచ్చుకొనును. అట్టి ప్రకృతి ధర్మానుసరణమగు పథకరచన ఫలప్రదము కాగల్గును.

దురదృష్టవశమున ఈనాడు నిర్మాణమగు పథకము లన్నిటికిని ఉత్పత్తిరాశియే కేంద్రవిచారణాంశముగ నున్నది. కూలివిషయము గూడ కొంత వారి గణితములోనికి వచ్చును. జర్మనీలోను, రష్యా లోనువలె, అటువంటి పథకములు సత్వరఫలముల నొసగు ననుట నిస్సందేహమే. కాని అవి శాశ్వతములు కావు. మరియు శాశ్వతత్వ మును గమ్యముగ నిడుకొని నడువని కారణముచేత, వానివలన తుదకు హింసాకాండ బయలుదేరగలదు; తప్పదు. తస్మాత్ జాగ్రత! జాగ్రత! జాగ్రత!